fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
16-8-2026
ఆదివారం
సంపుటి: 32
సంచిక: 197
పేజీలు: 8+4
వెల: 8.00



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం అమరావతిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సిఎం చంద్రబాబు, సిఎస్ సాయి ప్రసాద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా



శనివారం ఎర్రకోట నుండి జాతినుద్దేశించి స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగం చేస్తున్న ప్రధాని మోడీ

### ఏడు రంగాల వృద్ధితో దేశం సుసంపన్నం

### మావోయిజాన్ని అంతం చేయగలిగాం

### డిజిటల్ యుగంలో చిప్‌లకు పెరిగిన ప్రాధాన్యం

### కరోనా, యుద్ధాలను దాటి ముందుకు వచ్చాం

### దేశంలోని 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్

### గత పన్నెండేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

### ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ

# వికసిత్ భారత్‌కు 'సప్తధార'

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామని భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తి వంతం చేస్తామని ప్రధానిమోడీ అన్నారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్‌అనే ఏడుధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. నేడు ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోందని ప్రధాని పేర్కొన్నారు. 80వ భారత స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో శనివారం ఉదయం ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతోందన్నారు. ఎందరో వీరుల బలిదానాల ఫలితమే స్వాతంత్రం అని వివరించారు. తొలిసారిగా ఎర్రకోట వద్ద వందే మాతరం గీతాన్ని ఆలపించామని అన్నారు. దేశం కొత్త ఉత్సాహంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదుగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవచ్చు >>2

# చేతిలో జాతీయ జెండా.. గుండెలో బలమైన అజెండా

### విధ్వంసం నుండి వికాసం వైపు అడుగులు, ఇక వైభవం వైపు ప్రయాణం

### శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత అవసరం

### 80వ స్వాతంత్ర్య వేడుకల్లో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** మన చేతిలో జాతీయ జెండా ఉండాలి, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలుగెత్తి చాటారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారందేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చిందన్నారు. నా దేశం, నా బాధ్యత అని ముందుకుసాగాలని సూచించారు. దేశం నాకు ఏం చేసిందని కాదు, దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 యేళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య వేడుక జరిగే వేదిక వద్దకు సిఎం కాన్వాయ్‌తో పాటు బుల్లెట్ ఎస్కార్ట్ వచ్చింది. డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సిఎంకు స్వాగతంపలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాలు ముఖ్యమంత్రికి గౌరవవందనం సమర్పించారు. ఎపిఎస్పీ సహా >>2

# ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని..

### అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం: మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరం కలిసి స్వర్ణాంధ్ర సాధనకు ప్రతిన బూనుదామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఈ రోజు దేశం అంతా ఒక్కటే పండుగ. కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు. అందరూ కలిసి జరుపుకునే ఒకే ఒక్క పండుగ జెండా పండుగ. ఈ రోజు దేశం మొత్తం జాతీయ జెండా గర్వంగా ఎగురుతుంది. ఆ జెండా మనందరి గుండె చప్పుడు. జెండా పండుగ నాకు ఒక పర్సనల్ ఎమోషన్. ఇక్కడ విద్యార్థులను చూసిన తర్వాత నా స్కూల్ డేస్ >>2



మహిళలతో బస్సులో ప్రయాణిస్తున్న సిఎం చంద్రబాబు

# 'స్త్రీ శక్తి'కి నీరాజనం

### మహిళలు వివిధ రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం అండ

### మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించిన సిఎం చంద్రబాబు

### వారి కుటుంబ పరిస్థితులపై ఆరా

**విజయవాడ.ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** స్త్రీలు స్వయం శక్తి రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. మహిళల సామాజిక, ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 'స్త్రీ శక్తి'కి యేడాది రెట్టింపైన ఆత్మగౌరవం పేరిట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రాజధానిలోని పరేడ్ గ్రౌండ్స్ నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ మీదుగా సిఎం క్యాంప్ కార్యాలయం వరకు మహిళలతోకలిసి సిఎం బస్సులో ప్రయాణించారు. ప్రయాణంలో >>2








శనివారం అమరావతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పోలీసు అధికారులకు, మహిళా అధికారులకు అవార్డులు అందజేస్తున్న సిఎం చంద్రబాబు







శనివారం అమరావతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డులు పొందిన శకటాలు

# గుండెలో బలమైన అజెండా

>> వివిధ పోలీసు దళాల సన్నద్ధతను సిఎం సమీక్షించారు. పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సిఆర్పిఎఫ్, కర్ణాటక పోలీసు దళం మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగునేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఎపి ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడు అమరావతి నా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు అవుతుందని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్గా, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ కార్బన్ న్యూట్రల్, నో పోల్ సిటీ, డీప్ టెక్ క్యాపిటల్గా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మాణమవుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత కావాలని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలని అన్నారు. స్వాతంత్ర్యం మనల్ని ఐక్యం చేసిందని, స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు.

**10 సూత్రాలతో విజన్ సాకారం**

రాష్ట్రంలో 3 ప్రాంతాలు ఎదిగి, ప్రతీ జిల్లా ప్రగతి సాధించటమే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సామాజిక న్యాయం జరిగినప్పుడే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి లక్ష్యం కోసం 10 సూత్రాలు రూపొందించుకున్నామని సిఎం అన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ ఉపాధి కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత ఫార్మర్ అగ్రిటెక్, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అనే ఈ 10 సూత్రాలతో విజన్ సాకారం చేద్దామని చంద్రబాబు ఆకాంక్షించారు. లక్ష్యాలకు తగ్గ కార్యాచరణలో భాగంగా ప్రతి నియోజకవర్గాన్ని ఒక అభివృద్ధి యూనిట్గా తీసుకుని విజన్ యాక్షన్ ప్లాన్లు రూపొందించామన్నారు. 201419 మధ్య 13.5 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధి రేటు, 201924 మధ్య 10.3 శాతానికి పడిపోయిందని విమర్శించారు. అన్ని వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడంతో వృద్ధి రేటు 11.3 శాతానికి పెరిగిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రాష్ట్రంలో అర్హులందరికి 2029 నాటికి అందరికీ ఇళ్లు**

నవ్యాంధ్ర యువ ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. యువత కలలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రభుత్వం సృష్టించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అద్భుతాలు సృష్టించాలని సూచించారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సాయం అందేలా ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పనిచేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలో చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామని సిఎం వెల్లడించారు. తల్లికివందనం సాయాన్ని ఖర్చులా చూడకుండా పిల్లల భవిష్యత్పై పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. బిసిలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా ఎస్సీలు కోరుకున్న వర్గీకరణను అమలు చేశామన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనేది తమ లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రభుత్వ భూముల్లో ఎన్నో యేళ్లుగా నివసిస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.

**శాంతిభద్రతలతోనే అభివృద్ధి:**

అభివృద్ధి కావాలంటే శాంతియుత వాతావరణం ఉండాలి అన్నారు. పెట్టుబడులు రావాలంటే భద్రత కావాలి. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలి. అందుకే పోలీసులకు ప్రజా భద్రతలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం అన్నారు. విజిబుల్ పోలీసింగ్....ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నాంపోలీసు శాఖలో టెక్నాలజీ... డ్రోన్లు.. విస్తృతంగా వినియోగిస్తున్నాం. వీటి ఫలితాలు కనిపిస్తున్నాయి అన్నారు. నేరస్తులను వేగంగా గుర్తించడంతో పాటు, అంతే వేగంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటాం. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే. అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా గంజాయి, డ్రగ్స్పై ఉక్కుపాదం మోపాం. పోలీసుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇచ్చాం. వారికి రూ.427 కోట్ల బకాయిలు చెల్లించాం అన్నారు.

**స్వాతంత్రం నుంచి స్వర్ణాంధ్ర వరకు**

స్వాతంత్రం మనకు హక్కులు ఇచ్చిందని సిఎం అన్నారు. స్వర్ణాంధ్ర మనకు, మన పిల్లలకు బంగారు భవిష్యత్ ఇస్తుంది. స్వాతంత్రం మనకు అవకాశాలు ఇచ్చింది. స్వర్ణాంధ్ర ఆ అవకాశాలను ఆర్థిక శక్తిగా మారుస్తుంది. స్వాతంత్రం మనల్ని ఐక్యం చేసింది...స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుంది. 2024లో రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రారంభించాం. 2047 నాటికి అంతా గర్వించే స్వర్ణాంధ్రను నిర్మిద్దాం. ఇది కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదు. ఇది ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం కావాలని పిలుపునిస్తున్నాను. ఇది మన పిల్లల భవిష్యత్ కోసం మన బాధ్యత. ఇది మన తరానికి వచ్చిన చారిత్రక అవకాశం. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేశాం. ఇక వికాసం నుంచి వైభవం వైపు ప్రయాణిద్దాం. సంక్షోభం నుంచి స్థిరత్వానికి వచ్చాం స్థిరత్వం నుంచి స్వర్ణాంధ్ర వైపు సాగుదాం.. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఆత్మవిశ్వాసంతో... అంకితభావంతో ప్రతి రోజూ పనిచేద్దాం అన్నారు.. మన సంకల్పం ఒక్కటే...భారత్ ప్రపంచంలో నంబర్వన్ కావాలి. ప్రపంచంలో తెలుగుజాతి నెంబర్ వన్గా నిలవాలి వికసిత్ భారత్ను నిర్మిద్దాం! స్వర్ణాంధ్రను సాధిద్దాం అంటూ ప్రసంగం ముగించారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న శకటాల ప్రదర్శనలో అవార్డులు

**విజయవాడ.ఆగస్టు 15.ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి,. సంక్షేమ రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులను వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన నిర్వహించారు. భాషా, సాంస్కృతిక శాఖ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ, పర్యాటక శాఖ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఇంధన శాఖ, రవాణా శాఖ, ఎపిఎస్ఆర్టీసీ, మహిళలు, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, జల వనరుల శాఖ, పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష, ఉన్నత విద్యా శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, చేనేత, జౌళి శాఖ, ఎపిసిఆర్డిఎ, అమరావతి, గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు, పరిశ్రమల శాఖ, ప్రణాళిక శాఖ, దేవాదాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, గనులు, భూగర్భ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ వంటి దాదాపు 25 శాఖల నుండి వచ్చిన శకటాల ప్రదర్శనలో వికసిత భారత్ నిర్మాణంలో విద్యా విప్లవం అంటూ సాగిన విద్యా సమగ్ర శిక్ష శకటానికి, ఉద్యానవన శాఖల శకటానికి సంయుక్తంగా ప్రథమ బహుమతి లభించింది. ద్వితీయ బహుమతిగా నేతన్నల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న చేనేత, జౌళి శాఖకు లభించింది. అడవులను రక్షించండి, వన్య ప్రాణులను కాపాడండి అంటూ హరితాంధ్ర లక్ష్యంగా చేసుకుని సాగిన అటవీ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ శాఖలు, పోలీసు, భద్రతా బలగాలు ప్రదర్శించిన క్రమశిక్షణ, ప్రతిభ, రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. విజేతలుగా నిలిచిన బృందాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. అయితే, ఈ కార్యక్రమం అనంతరం శకటాలను రాజధాని ప్రాంత గ్రామాల్లో ప్రదర్శించారు. శనివారం మధ్యాహ్నం నుంచి మల్కాపురం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయ పాలెం గ్రామాల్లోని ప్రధాన రహదారుల మీదుగా శకటాల ప్రదర్శన కొనసాగింది. రంగురంగుల అలంకరణ లతో రూపొందించిన శకటాలు గ్రామాల మీదుగా సాగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వీటి ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శకటాలపై ప్రదర్శించిన తీరు పలు గ్రామస్థులను ఆకట్టుకుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా శకటాల ప్రదర్శన సాగడంతో ప్రజలకు సమాచారం చేరువైనట్లయింది. వీటిని తిలకించేందుకు రాజధాని గ్రామాల ప్రధాన రహదారులపైకి పెద్ద సంఖ్యలో ప్రజలు పోటెత్తారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం నిర్వహించిన ఈ శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# 'స్త్రీశక్తి'కి నీరాజనం

>> మహిళల యోగక్షేమాలు, కుటుంబ స్థితిగతులను ఆయన ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి హైటీ (తేనేటి విందు) కార్యక్రమంలో పాల్గొని, వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో సిఎం ముఖాముఖి మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభించి నేటితో యేడాది అయింది... ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలు జరిగాయని సిఎం అన్నారు. వివిధ ప్రాంతాలకు ఉచితంగా మహిళలు వెళ్లే వెసులుబాటు కల్పించాం అన్నారు. ఈ పథకం ద్వారా మహిళల డబ్బులను ఆదా చేసుకోగలుగుతున్నారు అన్నారు. రాబోయే రోజుల్లో అందరి ఆదాయం పెరగాలి.. అందరి ఆరోగ్యం బాగుండాలి. అప్పుడే అందరూ సంతోషంగా ఉంటారుఅన్నారు. దీన్ని నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బాగా వెనుకబడిన కుటుంబాలను ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం అన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజారోగ్యం బాగుండేందుకు తీసుకో వాల్సిన ఆహారాన్ని కూడా ప్రచారం చేస్తున్నాం. మహిళలు అంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేది.. కానీ ఇప్పుడు ఇది రివర్స్ అయింది అన్నారు. మహిళలే ఎక్కువగా సంపాదించే పరిస్థితివచ్చింది అన్నారు. సంజీవని వంటి పథకాలతో ప్రజారోగ్యం కోసం పని చేస్తున్నాంఅన్నారు. వీటితో పాటు.. ఆర్థిక పరిస్థితులు మెరుగపడేలా వివిధ రకాల పథకాలను అందిస్తున్నాం అన్నారు.

**ఆర్థికంగా ప్రగతి సాధించాలి.**

పి4 పథకం ద్వారా కూడా పేద కుటుంబాలకు చేయూతనిచ్చేలా మార్గదర్శులను ముందుకు తెస్తున్నాం అన్నారు. నేనుఅనే సంకల్పం తీసుకుని ప్రతి ఒక్కరూ పని చేయాలి అన్నారు. డ్వాక్రాసంఘాలను తెచ్చాను.. ప్రొత్సహించాను. అన్నారు. రూ.25వేలకోట్లు డ్వాక్రా సంఘాలద్వారా పొదుపు సొమ్ము బ్యాంకుల్లో ఉంది.అన్నారు. తీసుకున్న బ్యాంక్ రుణాలను తిరిగి చెల్లింపులు జరుపుతారు అన్నారు. కొన్ని పెద్ద కంపెనీలు కూడా రుణాలను ఎగవేస్తున్నాయి.. డ్వాక్రా మహిళలు మాత్రం తీసుకున్న రుణాలను ఠంచనుగా చెల్లింపులు జరిపారు అన్నారు. గంజాయి నిర్మూలనకు, అవగాహన పెంచేందుకు మహిళలు చొరవ తీసుకోవాలి. రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారిని మహిళలు ఓ కంట కనిపెడుతూ ఉండాలి అన్నారు.

**రూ.3,095 కోట్ల సబ్సిడీ 87 కోట్ల ప్రయాణాలు**

ఈ పథకం ద్వారా గడిచిన యేడాది కాలంలో మహిళలు రికార్డు స్థాయిలో 87 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని సిఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 24లక్షలమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్ల సబ్సిడీ భరిస్తోందని తెలిపారు. యేడాదికాలంలో మొత్తం రూ.3,095కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని వివరించారు. ఆర్టీసీలోని మొత్తం 9,978 బస్సులకు గాను, 7,631 బస్సుల్లో ఈ పథకం విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. మొత్తం ఆర్టీసీలోని 76 శాతం బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు అవుతోందని సిఎం తెలిపారు.

**హర్షం వ్యక్తం చేసిన మహిళలు**

మహిళలతో మాట్లాడుతూ.. వారి కుటుంబ వివరాలు.. ఆర్థిక స్థితిగతులను అడిగి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసి ఓట్లేయించుకునే వారిని నమ్మొద్దన్న సిఎం చంద్రబాబు హితవు చెప్పారు.. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి కాకూడదని మహిళలు ప్రచారం చేయాలన్నారు..రాబోయే 10 యేళ్లలో ఏయే లక్ష్యాలను నిర్దేశించుకున్నారంటూ సిఎం ప్రశ్నలు....కోటి రూపాయల పెట్టుబడితో తన డ్వాక్రా సంఘం నుంచి వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపిన కడప జిల్లా ముస్లిం మహిళ. .ఏఐ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా తాను ఎంచుకున్న సాఫ్ట్ వేర్ రంగంలో టాప్ పొజిషనులోకి వెళ్లాలని వివరించిన విశాఖకు చెందిన ఓ ఉద్యోగిని...స్త్రీ శక్తి ద్వారా సుమారు రూ. 3 వేలు ఆదా చేసుకోగలుగుతున్నామని తెలిపిన యువతి.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలే ఎక్కువగా సంపాదిస్తున్నారని... తాము కూడా మరికొందరికి ఉపాధి చూపగలుగుతున్నామన్న పలువురు మహిళలు.. అమరావతి నిర్మాణాలను చూడాలని ఉందని కోరిన మహిళలు.. రాజధానిలో మహిళల పర్యటనకు ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం ఆదేశించారు.

## బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి పర్యటన ఖరారు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** బిజెపిప జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి పర్యటన ఖరారు. ఆగస్టు 17 నుంచి 21 వరకు 5 రోజుల పాటు ఎపిలో పర్యటించనున్న నితిన్ నబీన్ ఆగస్టు 17 సాయంత్రం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. విశాఖలో నితిన్ నబీన్కు బిజెపి నేతలు, కార్యకర్తల ఘన స్వాగతం పలుకుతారు. ఆగస్టు 18 ఉదయం సింహాచలం శ్రీ వరాహా లక్ష్మీ నరసింహా స్వామి దర్శనం చేసుకుంటారు. అనంతరం విశాఖలో జిల్లా అధ్యక్షులు, ఇన్చార్జీలు, రాష్ట్ర పదాధికారులతో సమావేశం అవుతారు.

# ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని..

>> గుర్తొచ్చాయి. ఇండిపెండెన్స్ డే వస్తుంది అనగానే స్కూల్లో హడావుడి ఉండేది. ఫ్రెండ్స్ అంతా కలిసి క్లాస్ రూమ్స్, స్కూల్ని డెకరేట్ చేసేవాళ్లం. స్కూల్లో పెట్టే కాంపిటీషన్స్ కోసం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర గురించి స్టడీ చేసేవాళ్లం. ఫైనల్గా ఎవరైనా గెస్ట్ వచ్చి జెండా ఎగరేసినప్పుడు గూస్ బంప్స్ వచ్చేవి. జనగణమనఅంటూ జాతీయగీతం పాడుతూ.. జాతీయజెండా ఎగరడంచూసినప్పుడు చాలా గర్వంగా ఉంటుంది. మన ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైనే కాదు.. ఈ రోజు ప్రతి భారతీయుడి గుండెల్లో జాతీయ జెండా ఎగురుతుంది అన్నారు.

**యువతలో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం..**

ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత నాకు ఇస్తే.. దేశ తలరాతను మారుస్తానని స్వామి వివేకానంద అన్నారు. ఇప్పుడు నేను అదే ఫాలో అవుతున్నా. నాలుగేళ్ల ఇంజనీరింగ్ చేస్తే ఉద్యోగం రాదు. నాలుగు నెలలు అమీర్ పేటలో కోచింగ్ తీసుకుంటే ఉద్యోగం వస్తుంది. అదే స్కిల్ గ్యాప్. అందుకే నేను పరిశ్రమలు కాలేజీలను అనుసంధానిస్తున్నాం. పరిశ్రమలు మన ఐటిఐలను అడాప్ట్ చేసుకుని వాళ్లకు కావాల్సిన నైపుణ్యాలను నేర్పిస్తారు. ఉద్యోగాలు వెంటనే వస్తాయి. అలానే ఉన్నత విద్యను కూడా ప్రక్షాళన చేస్తున్నాం. కరిక్యులమ్ మార్చాం. ఇన్నేళ్లుగా లేని ప్రొఫెసర్ రిక్రూట్ మెంట్ చేస్తున్నామని తెలిపారు.



శనివారం విజయవాడలో స్వాతంత్ర్య ఏడుకల్లో భాగంగా జెండా ఎగురవేస్తున్న మంత్రి లోకేష్

**అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం..**

ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటున్నాం. పెన్షన్, తల్లికి వందనం, దీపం పథకం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకార భరోసా అందిస్తున్నాం. అన్నా క్యాంటీన్లు ఏర్పాటుచేశాం. మెగా డీఎస్సీ ద్వారా 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. పదివేల పోస్టులతో జాబ్ కేలండర్ విడుదల చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. ప్రతి వంద రూపాయల పెట్టుబడుల్లో ఎపికి రూ.25 వస్తున్నాయి. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనేది నా ఆశయం అన్నారు.

## వారం - వర్జ్యం

16-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
చవితి సా.4.58 న.హస్త రా.3.52
వ.మ.12.00-మ.1.37
దు.సా.4.46-సా.5.37
రాహు సా.4.30-సా.6.00
శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృషభం :** ఇంటిలో తల్లి ఆరోగ్యం కొంత కలవర పెడుతుంది. గృహనిర్మాణ యత్నాలు ఫలించవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**మిథునం :** శాస్త్ర, సాంకేతిక విషయాలయందు ఆసక్తి చూపుతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** పట్టుదలతో ముందుకు సాగి పనులు పూర్తి చేస్తారు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. విందు వినోదాలు.

**సింహం :** పారిశ్రామిక, రాజకీయ రంగాల వారు అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. మిత్రుల కలయిక.

**కన్య :** ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఇంటా బయటా అనుకూలం.

**వృశ్చికం :** సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. వస్తు కొనుగోలు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**ధనుస్సు :** సన్నిహితుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. వస్త్ర లాభం.

**మకరం :** భూ సంబంధిత వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం :** సోదరుల నుండి స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు. మిత్రుల కలయిక.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# డి.సిఎం పవన్కు అస్వస్థత

## ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన వైనం

## ఫిజియో థెరపీ కోసం కేరళకు వెళ్లే అవకాశం

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరం కారణంగా ఈ సాయంత్రం లోక్ భవన్లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. ఈ విషయాన్ని లోక్ భవన్ అధికారులకుకూడా సమాచారం అందించారు. కాకినాడలో 80వ స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న అనంతరం పవన్ రాజమహేంద్రవరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్ను ప్రారంభించారు. ఆ సమయంలో జ్వరం తీవ్రం కావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే త్వరగా ముగించారు. అక్కడ వైద్యులు ఉపముఖ్యమంత్రిని పరీక్షించారు. కొంత ఉపశమనం కలిగిన అనంతరం హైదరాబాద్కు బయలుదేరి వెళ్లారు. ఇటీవల పవన్ కుడి భుజానికి శస్త్ర చికిత్స జరిగిన సంగతి విదితమే. శస్త్ర చికిత్స అనంతరం ఫిజియో థెరపీ గురించీ వైద్యులను కలవనున్నారు. కాకినాడలో జరిగిన కార్యక్రమాల్లో పవన్ పాల్గొన్నప్పుడు కొంత అసౌకర్యంగా కనిపించారు. జాతీయ పతాకానికి సెల్యూట్ చేసిన తర్వాత అలాగే వాహనంలో అభివాదం చేసిన తర్వాత కూడా భుజాన్ని చేతితో నొక్కుకున్నారు. ఆయనకు జ్వరంకూడా ఉన్నట్లు కార్యాలయవర్గాలు వెల్లడించాయి. పవన్ ఫిజీథేరపిలో భాగంగా వచ్చేవారంలో కేరళవెళ్లే అవకాశాలున్నాయి. ఇటీవలే ఆయన భుజానికి శస్త్రచికిత్స అనంతరం వేసిన కట్టుతీసారు. ఆ తరువాత కొన్ని ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ఆయన కేరళకు వెళ్లే అవకాశం ఉంది.

# వికసిత్ భారత్కు 'సప్తధార'

>> నని ప్రధాని మోడీ తెలిపారు. సంకల్పం, కలలు ఉన్నతంగా ఉంటే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇవాళ ప్రపంచమంతా భారత్వైపు చూస్తోందన్నారు. శౌచాలయాలు 4 రెట్ల వేగంతో నిర్మించామని, పేదలకు ఇళ్లు 3 రెట్ల వేగంతో నిర్మించామని తెలిపారు. దేశవ్యాప్తంగా మెట్రోరైళ్ల సదుపాయాలు పెరిగాయని, ఆత్మనిర్భర భారత్ సాధనే మన లక్ష్యమని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఆత్మ విశ్వాసం పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని అన్నారు.

**డిజిటల్ యుగంలో పెరిగిన చిప్ ప్రాముఖ్యం....**

డిజిటల్ ప్రపంచంలో ఎలక్ట్రానిక్ వస్తువుల్లో చిప్ ప్రాముఖ్యత పెరిగిందని వివరించారు. సెమీకండక్టర్ల రంగంలో స్వావలంబన దిశగా కీలక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మూడు ప్రధాన సెమీకండక్టర్ ప్లాంట్లు కార్యకలాపాలు చేపట్టాయని గుర్తు చేశారు. ఏడెనిమిదేళ్లలో దాదాపు 8 సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రధాని మోడీ తెలిపారు. 200 గిగావాట్ల అణు ఇంధనం ఉత్పత్తి మన లక్ష్యమన్నారు. ఐదు అణు రియాక్టర్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని 70 నగరాల్లో పైప్లైన్ ద్వారా గ్యాస్ అందిస్తుమ్మని చెప్పారు. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ లైన్ ద్వారా వంట గ్యాస్ అందిస్తున్నామని వివరించారు. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం అని నొక్కి చెప్పారు. దేశాభివృద్ధిని అడ్డుకోవడం ఎవరి తరంకాదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. 12 యేళ్లలో అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని గుర్తు చేశారు. రైల్వే కోచ్, మొబైల్ ఫోన్ల తయారీ పెరిగిందని వివరించారు. డిజిటల్ లావాదేవీలు 100 రెట్లు పెరిగాయని గుర్తు చేశారు. రైల్వే విద్యుదీకరణను 30 నుంచి వందశాతానికి పెంచామన్నారు. తొలి హైడ్రోజన్ రైలును కూడా ప్రారంభించామని వివరించారు. అనేక చట్టాలను మార్చామన్నారు.

**కరోనాతర్వాత యుద్ధాలు ముంచేసాయి..**

కరోనా మహమ్మారి ప్రపంచాన్నే ముంచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా నుంచి బయటపడగానే యుద్ధాలు ముంచేశాయని పేర్కొన్నారు. ముందు ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు ఇరాన్ యుద్ధం అని వివరించారు. యుద్ధాలు వస్తే ఇంధనం, ఎరువులు దొరకవని కొందరు భయపెట్టారని ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు లోటు రానివ్వలేదని చెప్పారు. సంక్షోభం వస్తుందని ముందే ఊహించి ముందస్తు ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు. యూరియా, డిఎపి ధరలు పెరిగినా ఇక్కడ సబ్సిడీకి ఇస్తున్నామని పేర్కొన్నారు. భారత్లో స్థిరమైన ప్రభుత్వం ఉందని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. 2014 తర్వాత 40 దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్లు చేశామని గుర్తు చేశారు. మన టెక్స్టైల్, ఫార్మా, మత్స్య సంపద మనల్ని రక్షిస్తోందని చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నారు. భారత్ నుంచి రక్షణ రంగ ఎగుమతులు పెరగాలని ఆకాంక్షించారు. గత 12 యేళ్లలో రక్షణ రంగ ఉత్పత్తి 4 రెట్లు పెరిగిందన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి 5 రెట్లు పెరిగిందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 33 రెట్లు పెరిగిందని వివరించారు. భారత్ 6జీ టెక్నాలజీని ప్రపంచమంతా తీసుకెళ్లాలని తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో భారత్ నుంచి 50 సంస్థలు ఉండాలని ప్రధాని మోడీ ఆకాంక్షించారు.

**నక్సలిజాన్ని అంతంచేసాం...**

దేశంలో నక్సలిజాన్ని అంతమొందించామన్నారు. నక్సలిజం, మావోయిజం ఎంతోమంది యువకులను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో ఎంతమంది సైనికులు చనిపోయారో నక్సలిజంతో అంతమంది పోలీసులు చనిపోయారని పేర్కొన్నారు. నక్సలిజం భావజాలం ఉన్నవారిని కట్టడి చేయాల్సి ఉందన్నారు. కానీ దేశంలో చాలామంది మావోవాదులు ఉన్నారని చెప్పారు. వారి మనసుల్లో మావోయిజం, నక్సలిజం ఇంకా ఉందని తెలిపారు. అలాంటి వారిని కనిపెట్టి నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

మహిళా రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు కలిసి రావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోటా అందాల్సి ఉందన్నారు. మహిళా బిల్లుకు సహకరించి ఆ ఘనత మీరే తీసుకోవాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధిలో జనగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. పథకాల రూపకల్పనకు జనగణన సమాచారం కీలకమని అభివర్ణించారు. జనగణనకు యువత సహకరించాల్సి ఉందన్నారు. జనగణన నమోదులో తప్పులు లేకుండా చూడాలని అందుకోసం యువతకు ఉచిత ఆన్లైన్ శిక్షణ అందిస్తామని ప్రధాని మోడీ వివరించారు.

# అత్యంత ఎత్తయిన ఇయు పర్వతం అధిరోహించిన ఏలూరు ఎస్ఐ



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎపికి చెందిన ఓ పోలీస్ అధికారి వినూత్న రీతిలో జరుపుకున్నారు. రాష్ట్రంలోని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు యూరప్లోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి, అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. రష్యాలో ఉన్న 5,642 మీటర్ల ఎత్తైన ఈ శిఖరంపైకి ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం) ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించి తన దేశభక్తిని చాటుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన తోటి పోలీసు సిబ్బందికి తన ఈ ఘనతను అంకితం ఇస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. పర్వతారోహణపై ఆసక్తి ఉన్న ఆయన, ఈ యాత్ర కోసం కఠినమైన శారీరక, మానసిక శిక్షణ పొందారు. గతంలో కూడా ఆయనకు పలు శిఖరాలను అధిరోహించిన అనుభవం ఉంది. మోంట్ ఎల్బ్రస్ను విజయవంతంగా అధిరోహించిన ఆయన, తన తదుపరి లక్ష్యం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమేనని ప్రకటించారు.



శనివారం జాతీయ పతాకానికి అభివాదం చేస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

# దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే

## శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

**విజయవాడ, ఆగస్టు 15.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. భారతదేశ భవిష్యత్తు యువత శక్తి, ప్రతిభ, నైపుణ్యాలపై ఆధారపడి ఉందని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించిన పద్మలత

**విజయవాడ.ఆగస్టు 15.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎస్సీ పీసీఆర్ సభ్యురాలు కేజీ పద్మలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ వేడుకలలో ఏపీఎస్సీ పీసీఆర్ సభ్యులు చల్లా మధుసూదన రావు, కమిషన్ సిబ్బంది మల్లీశ్వరి, పెద్దిరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

# 'స్వర్ణ శ్రీకాకుళం' అందరి ధ్యేయం కావాలి

### సంక్షేమానికి స్వర్ణయుగం.. శ్రీకాకుళం అభివృద్ధికి మహా ప్రణాళిక

### రైతు సంక్షేమం.. సాగునీటికి పెద్దపీట..

### మౌలిక వసతులకు భారీగా నిధులు: మంత్రి అచ్చెన్నాయుడు



శనివారం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 15 ప్రభాతవార్త :** సుపరిపాలనతో రాష్ట్రంలో సంక్షేమానికి స్వర్ణయుగాన్ని తీసుకురావడంతో పాటు శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతు సంక్షేమం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2047 నాటికి స్వర్ణ ఆంధ్ర-స్వర్ణ శ్రీకాకుళం లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుల కన్న కలల భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1.49 లక్షల కోట్లను సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి జిల్లాలో 3,04,352 మంది పింఛనుదారులకు ప్రతి నెలా రూ.129.99 కోట్లు అందిస్తున్నామని మంత్రి వివరించారు. తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలో 2,54,456 మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున రూ.381.684 కోట్లు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. బడిబయట ఉన్న 8,654 మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించామని వివరించారు. ఖరీఫ్ 2026లో ఇప్పటివరకు 1,35,059 హెక్టార్లలో పంటలు సాగయ్యాయని వివరించారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద 2026లో తొలి విడతగా 2,79,100 మంది రైతులకు రూ.183.61 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని మంత్రి తెలిపారు. నారాయణపురం, మడ్డువలస జలాశయాల ద్వారా 44,160 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,48,230 ఎకరాలకు, కుడి ప్రధాన కాలువ ద్వారా 63,134 ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేరడి బ్యారేజీ నిర్మాణానికి రూ.641.10 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రెండు సంవత్సరాల్లో రూ.240 కోట్లతో 551 కిలోమీటర్ల పొడవున 3,300 సీసీ రహదారులు పూర్తి చేశామని మంత్రి తెలిపారు. మరో రూ.107 కోట్లతో 104 కిలోమీటర్ల మేర 39 బీటీ రహదారులు పునర్నిర్మాణం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

మత్స్యకార సేవలో పథకం కింద 2026-27లో వేట నిషేధ భృతిగా 16,738 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.32.38 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. 2047 నాటికి శ్రీకాకుళం జిల్లాను పేదరిక రహితంగా, స్వయం సమృద్ధిగా, సాంకేతికత ఆధారితంగా, పెట్టుబడులకు అనుకూలంగా, ఉపాధి అవకాశాలతో కళకళలాడే జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వి ఓం పాండేయ, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మ పరిరక్షణే మా సంకల్పం

### శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తాం: టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



తిరుమలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రసంగిస్తున్న చైర్మన్ బి.ఆర్.నాయుడు

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ నలుమూలల నుండి తిరుమలకు విచ్చేసే శ్రీవారి భక్తుల సేవే టిటిడి ప్రధాన ధ్యేయమని, సనాతన ధర్మ పరిరక్షణే తమ సంకల్పమని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఉద్ఘాటించారు. శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ, విద్య, వైద్యం, ధార్మిక సేవలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఉదయం టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ మైదానంలో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపినాథ్‌తో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు చైర్మన్ ఉద్యోగులనుద్దేశించి వేంకటేశ్వరస్వామి దివ్య కైంకర్యాల్లో సేవలందిస్తున్న అర్చక స్వాములు, భక్తుల సేవలో తరిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, ఉద్యోగులు, భద్రతా సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, మీడియా , దేశ విదేశాల నుండితిరుమలకు విచ్చేస్తున్న భక్తకోటికి భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనానంతరం దివ్యానుభూతితో తిరిగి వెళ్లేలా సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా టిటిడి బోర్డు, యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబరు 15 నుండి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అదేవిధంగా అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనం, వాహనసేవలను భక్తిశ్రద్ధలతో వీక్షించేలా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లక్షలాది మంది భక్తులకు పరిశుభ్రమైన, నాణ్యమైన అన్నప్రసాదం అందించేందుకు దాతల సహకారంతో 120 కోట్లతో మరొక వంటశాలను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దాతల సహకారంతో 145 కోట్లతో అభివృద్ధి చేసిన తిరుమల ఎస్వీ మ్యూజియంలో శ్రీవారి సేవలు, ఉత్సవాలు, అరుదైన ఆభరణాల వైభవాన్ని 3డి, 7డీ రూపంలో భక్తులకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు నాయుడు తెలిపారు. కోదండరామస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక వైభవానికి తగినట్లుగా తీర్చిదిద్దేందుకు కడపజిల్లా ఒంటిమిట్టలో విశ్రాంతి గృహాలు, యాత్రికుల సౌకర్యాలు, విద్యుత్ అలంకరణలు, భూసేకరణ తదితర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టి, ఒంటిమిట్టను మరింత ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో 19.62 ఎకరాలు, అస్సాంలోని గౌహతిలో 10.32 ఎకరాలు, తెలంగాణలోని ఖమ్మంలో 20 ఎకరాలు, కర్నాటకలోని బెల్గాంలో 6.43 ఎకరాలు, ముంబైలోని బాంద్రా ప్రాంతంలో అదనంగా మరో 10 సెంట్లు, అదేవిధంగా బీహార్ రాష్ట్రంలో కూడా భూమిని సేకరించి శ్రీవారి ఆలయాల నిర్మాణ పనులను ముందుకు తీసుకెళుతున్నామన్నారు. గత రెండేళ్లుగా టిటిడిలోని వివిధ ట్రస్టులకు సుమారు 1,500 కోట్లకు పైగా విరాళాలు అందించిన ప్రతి దాతకు టిటిడి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 161.40 కోట్లతో టిటిడి విద్యాసంస్థలను ప్రపంచస్థాయి విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, నరాశివరావు, నరేష్‌కుమార్, అదనపు ఇఒవెంకయ్య చౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, వి. గోపినాథ్, సివిఎస్ఒ మురళీకృష్ణ, అదనపు సివిఎస్ఒ శివకుమార్ రెడ్డి, , సిఇ సత్యనారాయణ, సిహెచ్ఒ డాక్టర్ తఖారి రవి, డిఎఫ్ఒ డి. ఫణికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణకు మరిన్ని విద్యుత్ బస్సులు

### దాతల భాగస్వామ్యంతో పలు ప్రాజెక్టులు

### విజయవంతం: టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమలక్షేత్రంలో పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు విద్యుత్ బస్సులను పెద్దఎత్తున ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. దేవదేవుల నుండి ఇష్టప్రైమ్ శ్రీవారి దర్శనార్థం ప్రస్తుతం తిరుమలకు 10 వేల నుండి 14 వేల వరకు వాహనాలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ అత్యంత అవసరమన్నారు. దాతల సహకారంతో మరో 37 విద్యుత్ బస్సులను భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. రానున్న బ్రహ్మోత్సవాలకు సుమారు 25 విద్యుత్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. గత ఏడు నెలల్లో లగేజ్ కౌంటర్ల ద్వారా సుమారు 2.6 కోట్ల బ్యాగులను సమర్థవంతంగా డిపాజిట్ డెలివరీ చేసినట్లు అదనపు ఇఒ తెలిపారు. టిటిడి సాధిస్తున్న విజయాలు ఏ ఒక్క వ్యక్తివి కాదని, ప్రతి విభాగం, ప్రతి ఉద్యోగి, ప్రతి భాగస్వామి సమిష్టి కృషి ఫలితమని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్పష్టం చేశారు. వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి మరిన్ని వినూత్న సంస్కరణలు, అద్భుతమైన ఫలి తాలతో టిటిడిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో టిటిడిఅధికారులు, ఉద్యోగులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అభివాదం చేస్తున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ

# ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యం

## రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అంత కుముందు ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన స్పీకర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని స్పీకర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు విశిష్ట సేవలందించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, తొలి స్వాతంత్ర్య సమరయోధుల్లో ప్రముఖుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, గన్నవరం శాసన సభ్యులు,ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు, శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్ రైల్వేడివిజన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం

### పాల్గొన్న డిఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఎడిఆర్ఎం శివ ప్రసాద్

**గుంతకల్ రైల్వే, ఆగస్టు 15 ప్రభాత వార్త:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ గుంతకల్ డివిజన్ 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైల్వే గ్రౌండ్ నందు నిర్వహించిన వేడుకలలో గుంతకల్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా మరియు ఎడిఆర్ఎం శివప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మన దేశభక్తులు, అమరవీరులు మరియు స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించే పవిత్రమైన సందర్భమిది. అదే సమయంలో, ప్రస్తుత సంవత్సరంలో మనకు కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో మన వంతు కృషిని సమీక్షించుకుని, మరింత మెరుగైన పనితీరుకు కట్టుబడి ఉండాల్సిన సందర్భం కూడా ఇదే. దేశభక్తుల పోరాటాన్ని గుర్తుచేసే ఈ జాతీయ పండుగ, మన దేశం పట్ల గర్వంగా మరియు విధేయతతో ఉండేందుకు మనలో స్ఫూర్తిని నింపుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2025-26లో డివిజన్ 15.73 మిలియన్ టన్నుల ఒరిజినేటింగ్ సరుకు లోడింగ్ సాధించింది. ఇది గుంతకల్ డివిజన్ చరిత్రలోనే అత్యధిక సరుకు లోడింగ్ నిర్వహించింది. డివిజన్ ..2,426 కోట్ల అత్యధిక ఆదాయాన్ని సాధించిందన్నారు. జూలై 2026లో గుంతకల్ డివిజన్ 97.57 పంక్చువాలిటీతో దక్షిణ కోస్తా రైల్వేలో మొదటి స్థానాన్ని సాధించింది.





జూలై 2026లో 3 సందర్భాల్లోఆగస్టు 2026లో 4 సందర్భాల్లో కోచింగ్ రైళ్లకు 100 పంక్చువాలిటీ సాధించి, భారతీయ రైల్వేల్లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. బెస్ట్ ఎలక్ట్రిక్ షెడ్ మెయింటెనెన్స్ ట్రోఫీ డీజిల్ షెడ్ స్టాఫ్ విభాగంలో 2వ అత్యుత్తమ పనితీరు కనబరచిన షెడ్ గా అవార్డు సాధించిందన్నారు. బెస్ట్ డీజిల్ షెడ్ హోమింగ్ ఎలక్ట్రికల్ లోకోస్ "గా రైల్వే బోర్డు షీల్డ్‌ను అందుకుందన్నారు. గుంతకల్ డివిజన్ మీదుగా మొత్తం 15 జతల కొత్త రైళ్లు ప్రవేశపెట్టబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం /రామకృష్ణ, సౌత్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మమత గుప్తా, బ్రాంచ్ అధికారులు, సూపర్వైజరీ అధికారులు, ట్రేడ్ యూని యన్లు మరియు అసోసియేషన్ల ప్రతినిధులు, రైల్వే పరివార్ సభ్యులు, చిన్నారులు, ప్రజలు పాల్గొన్నారు.





# రెపరెప లాడిన 'తిరంగా జెండా'

### సైకిల్ ర్యాలీ నిర్వహించిన ఎంఎల్ఏ

**శ్రీకాళహస్తి,ఆగస్టు 15 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం శనివారం ఆలయాలు, మసీదుల వద్ద మువ్వన్నెల జెండా రెప రెపలాడింది. అలాగే పుణ్యక్షేత్రంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌సారథ్యంలో సారథ్యంలో మోటార్‌సైకిల్ ర్యాలీ కార్యకర్తలతో కలసి నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మసీదుల వద్ద జమియతుల్ ఉలమా నాయకుడు ముఫ్తీనయం సాహెబ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు పట్టణంలోని 15 మసీదుల వద్ద జాతీయ జెండా రెప రెప లాడింది. వాయులింగేశ్వరుని పరిపాలనా భవనాల వద్ద ఇఒ టి.బాపిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేసి వందన స్వీకారం చేశారు. ఆలయ పారోహితులు ఆధ్వర్యంలో స్వామి పూజలతో కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. కాగా శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరై పలు శాఖల్లో సేవలందించిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. అలాగే రెండేళ్లలో శ్రీకాళహస్తి నియోజకవర్గం సాధించిన ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడుకోలా ఆనంద్ కుమార్,శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్,మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కెవి కృష్ణారెడ్డి సారథ్యంలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను నిర్వహించారు.

## కృష్ణానదిలో మునిగి ముగ్గురు యువకుల మృతి

**విజయవాడ,ఆగస్టు 15.ప్రభాతవార్త:** కృష్ణానదిలో తాడేపల్లి పరిధిలో ముగ్గురు కృష్ణలంకకు చెందిన యువకులు స్నానానికని వెళ్ళి మృతి చెందిన ఘటనపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంక,ద్వారకానగర్,మొదటి లైనుకు చెందిన వీసం గౌతం ఇంటర్ పూర్తి చేసి చదువుతున్నాడు. అక్కడే నివసిస్తున్న గెద్దం జాషువా ఇంటర్ పూర్తి చేసి స్ట్రాఫ్ కోర్టుకి వెనలోకి వెళ్తున్నాడు. వీరిద్దరూ బావా బామ్మర్దులు.ఒకే ఇంటిలో నివసిస్తుంటారు. పేరుబ్బ తేజేష్ కూడ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అతని తండ్రి ప్రైవేటు డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరందరూ ద్వారకానగర్ లోనే నివసిస్తున్నారు. వీరు ముగ్గురితో పాటు మరో ముగ్గురు శనివారం సాయంత్రం సుమారు 4 గంటలకు పార్కుకు వెళ్తున్నామని ఇంటిలో చెప్పి కృష్ణానదికి వెళ్లారు.కృష్ణలంక మార్గాల్లోని గుడి వద్ద నుండి నడుచుకుంటూ వెళ్లి విజయవాడ వైపు నీళ్ళు లేకపోవడంతో తాడేపల్లి పాయవైపుకు వెళ్లినట్లు సమాచారం. గౌతం,జేజేష్, కృష్ణ,ప్రేమ్, జాషువా, తేజలు కలిసి వెళ్లారు. కృష్ణానది పాయ లోకి నలుగురు దిగారు. మరో ఇద్దరు మాత్రం బయటే వేచి ఉన్నారు. వీరిలో తేజ నదిలో నుండి బయటకు వచ్చేశాడు. ముగ్గురు మాత్రం నదిలో మునిగిపోయారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


## నేడు విజయవాడలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

### రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

**విజయవాడ,ఆగస్టు15.ప్రభాతవార్తప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని ఆదివారం కూటమి ప్రభుత్వం ఘనంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర స్థాయి జయంతిని విజయవాడలో నిర్వహించనున్నట్లు మంత్రి సవిత విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న విశేష కృషి చేసిన మహనీయుడని కొని యాడారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారన్నారు.

# రూ.1,226కోట్లతో తిరుపతి వన్ ప్రాజెక్టు

### స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో మంత్రి ఆనం





**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిజిల్లాను ఆలయాలు, బీచ్, రిసార్ట్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తిరుపతికి సమీపంలోని దామినేడు వద్ద 1,226 కోట్ల రూపాయలతో "తిరుపతి వన్ "ప్రాజెక్టుకు 21 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. అలిపిరి, వడమాలపేట మండలం ఎస్వీపురం ప్రాంతాల్లో 440 కోట్లతో పైవ్‌స్టార్ లగ్జరీ రిసార్ట్ ఏర్పాటుకు 33 ఎకరాల భూమిని కేటాయించామని చెప్పారు. ఏపి ఆధారిత సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తిరుపతిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాలో చంద్రగిరి నియోజకవర్గం రాయలచెరువు వద్ద వాటర్ ఏరోడ్రోమ్, సీప్లేన్ సేవలకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. 80వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా శనివారం ఉద యం తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌పల్లి ఏఆర్ పోలీసుమైదానంలో జరిగినజాతీయజెండా వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. తిరుపతి జిల్లాలోని 36 మండలాల్లో 1,023 ఆలయాలు ఉండగా, క్యూ లైన్ నిర్వహణ, ఆర్‌టిజిఎస్, వాట్సాప్, "మనమిత్ర యాప్ ద్వారా పారదర్శక సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడి ఆలయాల విషయంలో రాష్ట్రంలోని 111 ఆలయాల్లో అన్నప్రసాదం, 65 ఆలయాల్లో నిత్యాన్నదానం నిర్వహిస్తూ ప్రతిరోజూ సుమారు 50 వేల మంది భక్తులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి సుమారు 158 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. 5 వేల భజన మందిరాల నిర్మాణానికి 750 కోట్లు, 1,670 మందిరాలకు 570 కోట్లు రూపాయలు మంజూరు చేశామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను, జిల్లా అధికారులకు అవార్డులను మంత్రి రామనారాయణరెడ్డి అందజేశారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 165 మంది సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు, డాగ్ షో బృందానికి కూడా అవార్డులను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సజిజామల వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, చంద్రగిరి ఎం ఎల్ ఏ పులివర్తి నాని, తుడా చైర్మన్ సి. దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం, డిఆర్‌ఒ నరసింహులు,తిరుపతి కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ కమీషనర్ శారదాదేవి, తిరుపతి ఆర్డిఒ రామ్మోహన్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి ఆనంకి అస్వస్థత

### వైద్యచికిత్సతో కోలుకున్న మంత్రి

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం జరిగిన 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నరాష్ట్రమంత్రి ఆనంరామనారాయణరెడ్డి ఉన్నఫలంగా అస్వస్థతకు గురయ్యారు. ఆయన ప్రసంగిస్తూ క్రిందకు తుళ్లి పడబోయారు. వెనువెంటనే ఉన్న భద్రతాసిబ్బంది, జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఆయన్ను పట్టుకుని కూర్చోబెట్టారు. వెంటనే అత్యవసరంగా ఉన్న వైద్యసిబ్బంది మంత్రికి వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యం చేయడంతో కోలుకున్నారు. వెంటనే ప్రథమిక చికిత్స అందించిన వైద్య బృందం బిపి లెవెల్స్ పడిపోయాయని వెల్లడించారు. కాసేపట్లో కోలుకున్న మంత్రి తిరిగి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మిగిలిన ప్రసం గాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సజిజామల వెంకటేశ్వర్లు చదివి వినిపించారు.

పశ్చిమాసియాలో అశాంతి దేశంలోని మధ్య, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న అందిరిపై ప్రభావం చూపుతోంది. గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగడంతో ఉప్పుతోపాటు అన్నినిత్యవసరాల ధరలు పెరిగాయి. ఇరాన్‌పైఅమెరికా దాడి చేయడంతోనే ధరలు పెరుగుతూ ఉన్నాయి. గత సంవత్సరంకంటే 113శాతం అన్నింటి ధరలు పెరిగాయి. ఏం కొనేట్టులేని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితిలో నిత్యవసరాలు కూడా పంపిణీ చేయాలని డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. తెలంగాణ ప్రభుత్వం నిత్యావసరాలు పంపిణీ చేయాల్సిన ఆవశ్యకత గుర్తించాలి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల15నుండి రాష్ట్రంలోని కోటి 5 లక్షల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించిన నేపథ్యంలోస్మార్ట్ రేషన్ కార్డులతోపాటు 14 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రికి లేఖరాసి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రజల తరుపున డిమాండ్ చేశారు. ప్రస్తుతం కార్డుపై ఒక వ్యక్తికి 6కిలోల బియ్యం మాత్రమే అందుతున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా పేదకుటుంబాల ఆదాయాలు పెరగకపోవడంతో, వారు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. తద్వారా రక్తహీనత, పిల్లల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పేదలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే రేషన్ కార్డుదారులకు న్యూట్రీషియన్లతో సంప్రదించి, బియ్యంతో పాటు కందిపప్పు, శనగపప్పు, పెసరపప్పు, మంచినూనె, గోధుమలు/గోధుమ పిండి, కోడిగుడ్లు, మిల్లెట్స్, చక్కెర, చింతపండు, పసుపు, కారం పొడి, ఉప్పు, కొబ్బరినూనె వంటి నిత్యావసర సరుకులైన 14రకాల వస్తువులను రేషన్‌కార్డు ద్వారా పంపిణీ చేయాలి. దారిద్ర్యరేఖకు దిగువనఉన్నవారికికే కాకుండా దిగువ, ఎగువమధ్య తరగతి ప్రజలకు కూడా ఉప్పు, చింతపండు, జీలకర్ర, మెంతులు, కందిపప్పు, తదితర పల్లిలు వంటివి సరఫరా చేయాల్సిన అవసరంఉంది.

# స్మార్ట్‌గా సివిల్ సప్లయ్ ఆధునీకరణ

భాగ్యనగర్ భాస్కర్‌కుమార్

'అదిరిందయ్యా ఉత్తమ్! స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్లు, మిషన్ కె 100 ధాన్యం సేకరణ కార్యాచరణ. సిలోస్‌లు, సిఎంఆర్ ధాన్యం అక్రమార్కులపై మెరుపు దాడలు' అన్నట్లు పౌరసరఫరాలశాఖ ఆధునీకరణలతో ఓవైపు ఆహారభద్రతకు పెద్దపీట వేస్తూ మరోవైపు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టించే రైసుమిల్లర్లపై మెరుపుదాడులు చేస్తూ తెలంగాణ ప్రజల ఆదరాభిమానం చూరగొంటున్నది. తెలంగాణలో ఆహార భద్రతకు శనివారం సంగారెడ్డిలో లాంఛనంగా స్మార్ట్ రూపం ఇచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా రాష్ట్రవ్యాప్తంగా 3.43కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. స్మార్ట్‌కార్డులపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రం నిధులు సింహభాగంలో ఉంటాయనీ ఎవని అయ్య జాగీరు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోటోలు మాత్రమే వేసుకొన్నారని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ ప్రశ్నించారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు తక్షణమే కార్డుల పంపిణీ నిలిపేయాలని అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్మార్ట్ కార్డుపై కేవలం ఇద్దరిఫోటోలు మాత్రమే ముద్రించడం ఇంటా బయట విమర్శలు వస్తున్నా రాష్ట్రంలోని 33జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం చేపట్టాలని పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలమేరకు అన్ని జిల్లాలో మొదలైంది. రాష్ట్రంలో ప్రస్తుతం1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారు. వీరిందరికి రానున్న పది రోజుల్లో స్మార్ట్ రేషన్‌కార్డులు అందిస్తారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులకు నకిలీలను రూపొందించకుండా నివారించేలాతొమ్మిది రకాల ఆధునిక భద్రతా ఫీచర్లతో తయారు చేశారు. బ్యాంకు నోట్లు, పాస్‌పోర్టులు వంటి అత్యంత భద్రత కలిగిన పత్రాల్లో ఉపయోగించే టెక్నాలజీని వినియోగించారు. పైన ఎడమవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుడివైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలను ముద్రించారు. రేషన్ కార్డు నంబరు, కుటుంబ యజమాని పేరు, చౌకధరల దుకాణం సంఖ్యతో పాటు గ్రామం, మండలం, జిల్లా లబ్ధిదారుని ఇంటి చిరునామా వివరాలున్నాయి. కుటుంబ యజమానిగా మహిళల పేర్లనే ముద్రించారు. సాంకేతికమైన పలు భద్రతా ఫీచర్లు జోడించడంతో ఈ కార్డును స్కాన్ చేయగానే లబ్ధిదారుల వివరాలు నిర్ధారణ అవుతాయి. ఈకార్డు ఉన్న ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరుకిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల




ప్రవేశంతో ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత రేషన్ కార్డుల జారీ చేసే విషయంలో ఆనాటి బిఆర్ఎస్ పాలకులు ఉదాసీనంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు అందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. దీనితో గత ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పాలకులు పాతవాటికి తోడు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి ఆ కుటుంబాలకు చెందిన 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించారు. ప్రస్తుతంరాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1,06,28,092 కోట్లకు చేరడమే కాకుండా కాంగ్రెస్ పాలకులు చేసిన కృషి కారణంగా 3.43కోట్ల మందికి కడుపునిండా ఎన్నడులేని తిండితినే అవకాశం కల్పించారు. తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే ప్రబలనిదర్శనం. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ. 14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేలకోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుడి చెంతకు తీసుకెళ్లడానికి బియ్యం రవాణాలో పారదర్శకతకు స్మార్ట్ సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ అనే పద్ధతిని తీసుకొచ్చారు. మండల్ లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం రవాణాలో పూర్తి పారదర్శకత పాటించేందుకు పౌరసరఫరాల సంస్థలో స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ అనే నూతన విధానం ప్రవేశపెట్టారు. స్మార్ట్ ఎస్‌సిఎం విధానం అమలు చేయడానికి యాప్ ప్రత్యేకంగా రూపొందించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు స్టేజ్2 కాంట్రాక్టర్ లారీల ద్వారా బియ్యం రవాణా చేసేవారు. ఆ లారీలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం అమర్చారు. ఆ లారీ ఎటువెళుతుంది, ఎక్కడ ఆగింది? ఈ విధానంలో తెలుస్తుంది. కానీ బియ్యం ఎక్కడ, ఎంత దిగుమతి అయ్యిందో తెలియదు. ఎఫ్‌సిఐ, ఎసిడబ్ల్యూసి గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా చేసే స్టేజ్1 విధానంలోనూ అమలు చేస్తే పారదర్శకత పెరుగుతుందని అధికారులు, డీలర్లు భావిస్తున్నారు. నూతన స్మార్ట్ ఎస్‌సి ఎం విధానంలో టెండర్ల సమయంలో అనుమతించిన నంబర్లతో ఉన్న లారీల వివరాలను కాంట్రాక్టర్ ఆన్లైన్లోనమోదు చేస్తారు. ప్రస్తుతం ల్యాప్టాప్, డెస్కాప్లో నూతన యాప్ అందుబాటులోకి వచ్చింది. త్వరలో మొబైల్స్ యాప్ అందుబాటులోకి తేనున్నారు. డీలర్, కాంట్రాక్టర్, ఎంఎల్ఎస్ పాయింట్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారుల మొబైల్స్‌లో ఈ యాప్ అందుబాటులోకి రానుంది. మరోవైపు రైస్‌మిల్లు అక్రమార్కులపై పకడ్బందిగా దాడులు చేస్తూ ధాన్యం స్టాక్ చూపని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. సివిల్ సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక వైపు విజిలెన్స్ డిజిపి డిఎస్‌చౌహాన్ రైసుమిల్లర్లను ఏ మాత్రం ఊపిరి తీసుకోకుండా ధాన్యం అప్పగించాలని ఒత్తిడి పెంచుతున్నారు. సివిల్‌సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర జిల్లాలో డిఎస్‌వో, డిఎం సివిల్ సప్లయ్‌కార్పొరేషన్‌లు పోలీసు స్టేషన్‌హౌజ్ ఆఫీసర్లకు కేసులు వీగిపోకుండా ఎఫ్ఐఆర్ కేస్ షీట్ రాసేందుకు తర్ఫీదు ఇచ్చారు. గతంలో కోర్టు తీర్పుల అనుభవాలను తీసుకొని ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని తీసుకొచ్చి ఇక ముందు రైస్‌మిల్లు ఓనర్లకు ఏ తప్పించుకోని అవకాశం ఇవ్వకుండా చర్యలు చేపట్టారు. దీనితో కోర్టుల్లో ముందస్తు బెయిల్ రాకుండా పోయింది. మరో వైపు కొంతమంది మిల్లర్లు ఇతర దేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిసి వారిపై లుకౌట్ నోటిసులు కూడా జారి చేయడానికి ఉపేక్షించకూడదని కింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు పరిస్థితికనుగుణంగా చర్యలు తీసుకొనే స్వేచ్ఛను ఇచ్చారు. దీనితో ప్రతి రోజు సిఎంఆర్ ధాన్యం అక్రమార్గం పట్టించిన మిల్లర్లు బిక్కుబిక్కుమంటూ ఎప్పుడు తాము ఊచలు లెక్కించాల్సి వస్తుందో అనే భయంతో నెట్టుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ ధాన్యంపక్కదారి పట్టించిన రైసు మిల్లులపై మిల్లుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి తనిఖీలు చేయడం జులై 20నుంచి నిరంతరంగా కొనసాగిస్తూనే ఉంది. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 89రైస్‌మిల్లుల్లోనే3,72,693.23 టన్నుల ధాన్యం మాయం అయినట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. ఈ వడ్ల విలువ రూ.927.16 కోట్లు అయితే ఇందులో పదిరోజులుగా రూ. 715 ప్రభుత్వం రాబట్టింది మొత్తానికి ఈ సారి భారీగా రికవరీ చేయగలిగారు. బ్యాంకుల నుంచి వడ్డీకి రుణాలు తీసుకుని రైతులకు డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన వడ్లను మిల్లర్లకు ఇస్తే..మరాడించి బియ్యం ఇవ్వకుండా అమ్మేసుకుంటున్నారు. పక్కదారి పట్టించిన వడ్లలో 2022-23 రబీ, 2025-26 ఖరీఫ్ సీజన్లకు సంబంధించినవే అత్యధికంగా ఉన్నాయి. మరోవైపు అజ్ఞాతంలోకి వెళ్ళిన కొంతమంది రైసుమిల్లర్లపై లుకౌట్ నోటిసులకు సన్నాహాలు చేస్తున్నారు. ఒకే ఒక్కరోజు జులై మూడోవారం భారీ స్థాయిలో రైసుమిల్లులు ధాన్యం పక్కదారి పట్టించిన వరగంల్, మహబూబ్‌నగర్, జగిత్యాల, నల్లగొండ, సూర్యపేట మెదక్ రైసుమిల్లుపై దాడి చేసి రూ.154 కోట్ల ధాన్యం రైసు మిల్లులు పక్కదారిపట్టించినట్లు గుర్తించి కేసులుపెట్టారు. జులై చివరివారం రెండవ అతి పెద్ద ధాన్యం వ్యత్యాసం ఐదు రైస్ మిల్లుల్లో ఏకంగా రూ.106 కోట్ల అక్రమాల్నిగుర్తించారు. ●

# 'పరీక్షా' కాలం!

జార్ఖండ్

పరీక్షలే ఇప్పుడు ప్రభుత్వాలకు పరీక్షగా మారుతున్నాయి. ఢిల్లీ జంతర్ మంతర్‌వద్ద రగిలినఆందోళనల జ్వాలలు ఇప్పుడు రాంచీ మీదుగా వివిధ రాష్ట్రాలకువిస్తరిస్తూ అందరిలో ఆందోళన పెంచుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగార్థులు చేయిచేయి కలిపి తమకు న్యాయం కలిగించని ప్రభుత్వాలపై తిరగబడడం రాజకీయ నాయకులలో దడపుట్టిస్తోంది. జంతర్ మంతర్ ఆందోళనల ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఒక కీలక పరిణామమైతే, జార్ఖండ్‌లో సోరెన్ నాయకత్వంలోని జెఎంఎం ప్రభుత్వం ప్రస్తుతం గడ్డుపరిస్థితిని ఎదుర్కోవడం మరో కీలక పరిణామం. మూడు వారాలుగా విద్యార్థులు, ఉద్యోగార్థులు రాంచిలో సాగిస్తున్న ఆందోళనల జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్సీ)జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెపిఎస్‌సి) నిర్వహించిన నియామక పరీక్షల్లోని అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. జెఎస్ఎస్‌సి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సిజిఎల్) పరీక్షను రద్దు చేయాలని, నియామకాల్లోని అవకతవకలపై సిబిఐదర్యాప్తు జరపాలనీ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థినేతలు, ప్రభుత్వం మధ్య ఇప్పటికి మూడు దఫాలుగా చర్చలు జరిగినా సమస్యకు పరిష్కారం లభించకపోవడం చూస్తే ప్రభుత్వం ఎంత మొండివైఖరితో ఉన్నదో స్పష్టమవుతుంది. 14వ జెపిఎస్‌సి నియామక పరీక్ష రద్దు చేస్తామనీ, నిర్వహించిన టిడిపిఎల్ సంస్థపై ఇడి విచారణకు ఆదేశిస్తామనీ ప్రభుత్వం హామీ ఇచ్చినా సిబిఐ విచారణ జరిపించే వరకు తాము వెనక్కి తగ్గబోమని ఉద్యమ నాయకులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో జెపిఎస్‌సికి చెందిన ముగ్గురు సభ్యులు డా. అజిత్ భట్టాచార్య, డా. అనిమా హన్స్ దా, డా. జమీల్ అహ్మద్ ఇప్పటికే రాజీనామాచేశారు. సిజిఎల్ పరీక్షను సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకే నిర్వహించామనీ, అది న్యాయ పరిధిలో ఉన్నందున రద్దు కుదరదనీ మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకటించిన తర్వాత ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. సిజిఎల్ పరీక్ష ఫలితాలు కూడా వచ్చేశాయి. రెండు వేల మంది పైగా అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడంకూడా పూర్తయింది. అటువంటప్పుడు పరీక్ష రద్దు కోరడమే మిటని ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. పార్లమెంటును నీట్ ఆందోళనలు ఓ కుదుపు కుదిపితేనియామక పరీక్షలు జార్ఖండ్ అసెంబ్లీని తలకిందులు చేస్తున్నాయి. గత సోమవారం విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా మారి రక్తపాతాన్ని సృష్టించడంతో దానిప్రభావం అసెంబ్లీపై ఎక్కువగా పడింది. బుధవారం దాకా కొనసాగవలసిన అసెంబ్లీమంగళవారమే నిరవధికంగా వాయిదా పడింది. విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జిని నిరసిస్తూ విపక్ష ఎమ్మెల్యేలు గళమెత్తడంతో అసెంబ్లీ ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలను డబ్బుకు అమ్ముకుంటున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో కరెన్సీని వెదజల్లడం నిరసనలకు పరాకాష్ట అనాలి. పరీక్షల సంస్కరణలకు సంబంధించి 855 సలహాలు వచ్చాయనీ, జవాబుదారీవ్యవస్థను మెరుగుపరుస్తామనీ సిఎం సోరెన్ అసెంబ్లీలో ప్రకటించినా ఎమ్మెల్యేలు వెనక్కితగ్గకపోవడంతో స్పీకర్ విధిలేక సభను నిరవధికంగా వాయిదా వేయవలసి వచ్చింది. పరీక్షల అవకతవకలపైనిరాహారదీక్ష చేస్తున్న ఆరుగురిలోరాహుల్ క్రాంతి ఆసుపత్రి ఐసియు నుంచే దీక్ష కొనసాగించడం ఉద్రిక్తతను మరింత పెంచుతోంది. జంతర్ మంతర్ ఆందోళనల్లో సోనమ్ వాంగ్చుక్ లా రాంచీ ఆందోళనల్లో దీపేంద్ర నాథ్ మహాతో నిరవధిక నిరహార దీక్ష కొనసాగిస్తున్నారు. జార్ఖండ్ లోక్ తాంత్రిక్ క్రాంతికార్ మోర్చా (జెఎల్‌కెఎం) నేత అయిన మహాతో చేస్తున్న దీక్ష జెఎంఎం ప్రభుత్వ పునాదులను కదుల్చుతున్నట్లే కనిపిస్తోంది. జెపిఎస్ సి మాజీ చైర్మన్ ఎల్.ఖియంగ్తేను సిఐడి పోలీసులు గత సోమవారం అరెస్టు చేసిన తర్వాత ప్రభుత్వం ఆందోళనకారులతో మరో దఫాచర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పినట్లే కనిపిస్తోంది. నిషేధిత సంస్థ టిఎస్సార్ డేటా ప్రాసెసింగ్‌కు పరీక్ష నిర్వహణ కాంట్రాక్టు అప్పగించడాన్ని కూడా విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఖియంగ్తే 2 కోట్ల రూపాయల లంచంతో పాటు 20శాతం కమిషన్ కూడా తీసుకొన్నట్లు ఆరోపణలున్నాయి. అటువంటి వారు మరికొందరుకూడా ఉన్నారు. దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం లభించకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కేవలం కంటితుడుపు చర్యగా కొందరు ముఖ్యులతో రాజీనామాలు చేయించినట్లుకనిపిస్తోంది. గత సోమవారం రాంచిలో ఆందోళనకారులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి చివరికి హింసాత్మకం అయింది. ఒక దశలో పోలీసులు లాఠీ చార్జిని కూడా జరిపి, బాష్పవాయువును ప్రయోగించారు. కొన్ని డజన్ల మంది తీవ్రంగా గాయపడ్డారు కూడా. ఈఘటన దేశవ్యాప్తంగా తీవ్రసంచలనం కలిగించింది. ఇషాంత్ సింగ్ యుద్ధంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే శనివారం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆందోళనకారులు భారీగా నిర్వహించిన 'తిరంగా యాత్ర' నిరసన ర్యాలీ కూడా దేశంలో అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్న సిబిఐ దర్యాప్తునకు ప్రభుత్వం ఇంకా అంగీకరించకపోవడంతో పరిస్థితి పూర్తిగా చేయిదాటుతోంది. ప్రభుత్వం, విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ ఆందోళనలకు ఒక సరైన ముగింపుఇవ్వకపోతే ప్రజలు తీవ్రసమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఆందోళనకారులు సమస్యను మరింత సాగదీయకుండా ఒక సామరస్య పరిష్కారానికి ప్రయత్నించాలి. పరీక్షల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఒక పటిష్టమైన, పారదర్శకమైన అధికారయంత్రాగాన్ని ప్రభుత్వం రూపొందించవలసి ఉంది. లేకుంటే ప్రభుత్వానికి నిత్యం పరీక్షే ఎదురవుతూంటుంది. ●

ఎ.వి.వి ప్రసాద్


విద్యార్థుల ఆందోళన

# ఆత్మహత్యల 'సెగ'లు!

ఫ్రాన్స్

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సర్కారుకు రాజకీయ సంక్షోభంతోపాటు ప్రధాని కార్యాలయం ఉద్యోగుల ఆత్మహత్య ఘటనలు సతమతం చేస్తున్నాయి. రెండేళ్లలోనే నలుగురు ప్రధానులు మారిన మాక్రాన్ సర్కారులో ఉన్నత ఉద్యోగులు, కొత్త కేబినెట్ రాక వంటివాటితో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెరిగిందన్న భావన ఎక్కువైంది. మరీ ముఖ్యంగా ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను కార్యాలయానికి అనుబంధంగా పనిచేసే వివిధ ప్రభుత్వ విభాగాల్లో వరుసగా ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఉద్యోగులపై మానసిక వేధింపుల ఆరోపణలపై ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభించారు. ఈవ్యవహారంలో పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును చేపట్టింది. ఇప్పటివరకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. మరో ఉద్యోగి మృతి కూడా అనుమానాస్పద పరిస్థితుల్లో జరిగింది. రాజకీయ దుమారాన్ని అరికట్టేందుకు ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలకు సంబంధించిన ఉద్యోగుల్లో ఎవరూ ప్రస్తుత ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను వ్యక్తిగత కార్యాలయంలో పనిచేయలేదని, వారెవరూ ప్రధానమంత్రితో నేరుగా పనిచేసిన సిబ్బంది కాదని చెపుతున్నా ఆత్మహత్యల పరంపర విస్తృత దర్యాప్తునకు బాటలు వేసింది. దీనికి గత ఏప్రిల్‌లో జరిగిన ఓప్రభుత్వ ఉద్యోగి లారా అనే సీనియర్ ప్రభుత్వ ఉద్యోగిని ఏప్రిల్‌లో రైలు ముందు దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మూలం అయింది. ఓవ్యక్తి ఆమెను రక్షించడంతో ప్రాణాలతోబయటపడ్డారు. ఆతర్వాత లారా తన కార్యాలయంలో తనపై మానసిక వేధింపులు, అవమానకర ప్రవర్తన, తన ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు సృష్టించారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయ సేవలకు అనుబంధంగా ఉన్న కరస్పాండెన్స్ విభాగంలో పనిచేసిన తనను ఉద్దేశపూర్వకంగా ఒంటరి చేశారని ఆమెఆరోపించారు. ఆమెను సమావేశాలకు పిలవకుండా చేయడం, సంస్థాగత చార్టుల నుంచి ఆమె పేరును తొలగించడం, సహచరుల నుంచి దూరంగా ఉంచడం, అవమానించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు గురిచేశారని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కొన్ని నెలలముందే లారా తన వీలునామా, అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకున్నట్లు ఫ్రెంచ్ మీడియాలో విస్తృత వచ్చాయి. లారా ఘటన ఒక్కటే కాదని ప్రధాన మంత్రి కార్యాలయ సేవల పరిధిలోనిప్రభుత్వ విభాగాల్లో గత కొంతకాలంగా ఇలాంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గత అక్టోబర్‌లో ఓప్రభుత్వఉద్యోగి కార్యాలయంలోనే ఆత్మహత్యకు ప్రయత్నించారు. మార్చిలో ఓప్రాజెక్ట్ మేనేజర్ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. మరో ప్రభుత్వ ఉద్యోగి కార్యాలయ తీవ్ర ఒత్తిడితో రైలు ముందు దూకిమరణించినట్లు ఆరోపణలున్నాయి. లారా ఆత్మహత్యాయత్నం అనంతరం పారిస్‌లోని ప్రభుత్వ కార్యాలయంలో ఓ యువ ఉద్యోగి మృతదేహం కూడా లభించింది. ఈవరుస ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల పని వాతావరణం, మానసిక ఆరోగ్యం, ఉన్నతాధికారుల వ్యవహారశైలిపై ప్రశ్నలుతలెత్తాయి. ప్రభుత్వంలోనే వ్యవస్థాగత స్థాయిలో ఉద్యోగులపై వేధింపులు జరు గుతున్నాయంటూ ఓ సిబ్బంది ప్రతినిధి జూన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించింది. ఉద్యోగులపై వ్యక్తిగతంగా వేధింపులు జరిగాయా? ప్రభుత్వ విభాగాల్లోని విధానాలు, తరచూ జరుగుతున్న మార్పులు, అధికారులశైలి కారణంగా వ్యవస్థాగత ఒత్తిడిఏర్ప డిందా అనే అంశాలను దర్యాప్తులోకి చేర్చారు. ఫ్రాన్స్‌లో గత రెండేళ్లుగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరత కూడా ప్రభుత్వ ఉద్యోగులపై పనిఒత్తిడిని పెంచిందని ఉద్యోగ సంఘాలు, సిబ్బంది ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత దేశరాజకీయాల్లో అనిశ్చితి పెరిగింది. రెండేళ్లలో ఫ్రాన్స్‌కు నలుగురు వేర్వేరు ప్రధానమంత్రులు రావడంప్రభుత్వ యంత్రాంగంలో తరచూ నాయకత్వ మార్పులకు దారితీసింది. ప్రధానమంత్రి మార్పులతోపాటు ఉన్నత స్థాయి అధికారుల బదిలీలు, మేనేజ్‌మెంట్ పునర్వ్యవస్థీకరణలు, విభాగాలపునర్నిర్మాణం తరచూ జరగడంతో ఉద్యోగుల్లో అయోమయం, అస్థిరత, ఒత్తిడి పెరిగిందని ఫ్రెంచ్ మీడియాతో పలువురు సిబ్బంది తెలిపారు. ప్రాసిక్యూటర్ కార్యాలయం చేపట్టిన క్రిమినల్ దర్యాప్తుతోపాటు ఫ్రెంచ్ ప్రభుత్వంకూడా ఈఘటనలపై అంతర్గత విచారణలకు ఆదేశించింది. వ్యక్తిగతంగా జరిగిన విషాద ఘటనలను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితులపై కూడా సమగ్రసమీక్ష చేపట్టింది. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, కార్యాలయ వాతావరణం, నిర్వహణ విధానాలు, ఉద్యోగులపై ఒత్తిడివంటి అంశాలపై దర్యాప్తు చేసారు. ప్రధాని కార్యాలయంలోని అన్ని విభాగాల్లో పని పరిస్థితులపై ప్రత్యేక నిపుణుల ఆడిట్ నిర్వహణకు ఆదేశించడంతో పీఎంవో సేవల పరిధిలోని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి, వేధింపులు ఉన్నాయన్న ఆరోపణలపై ఇప్పుడు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభం కావడం ఫ్రాన్స్ ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగుల పని పరిస్థితులపై తీవ్రచర్చకు దారితీసింది. వరుస ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాల వెనుక వ్యక్తిగత కారణాలే ఉన్నాయా? లేక కార్యాలయాల్లోని వేధింపులు, పరిపాలనా అస్థిరత, అధికపని ఒత్తిడి కూడా కారణమా? అనే అంశాలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు స్పష్టత వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, సురక్షితమైన పనివాతావరణం కల్పించాల్సిన బాధ్యతను ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఈ ఘటనలు మరోసారి గుర్తుచేస్తున్నాయి. ●


గన్ని మోహన్


సెబాస్టియన్ లెకోర్ను

# కొత్త ఆధ్యాత్మిక చైతన్యమే 'ఇస్కాన్'

డి.శ్రీనివాస్

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్ నెస్...ఈ పేరు నేడు ఒక ఆధ్యాత్మిక విప్లవానికి పర్యాయపదం. కృష్ణ చైతన్యానికి మారు పేరు. హరినామ సంకీర్తన ధ్యేయంగా, శ్రీమద్ భగవద్గీత పునాదిగా, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య మహాప్రభు బోధనలు ఆలంబనగా విరాజిల్లుతోంది. హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే.. హరే రామ హరే రామ రామ రామ హరే హరే.. అనే మహామంత్రం భక్తులు నిత్యం వందలు, వేలసార్లు జపిస్తూ ధార్మిక జగత్తులో ఓలలాడుతున్నారు. భౌతిక సుఖాలకు పాకులాడకుండా శాశ్వతమైన గోలోకా బృందావనాన్ని చేరుకోవాలని తపిస్తుంటారు. ఏ.సి. భక్తివేదాంత స్వామి ఈ సంస్థ వ్యవస్థాపక ఆచార్యులు. తదనంతరం వీరే శ్రీల ప్రభుపాదులుగా వ్యవహరింపబడినారు. ఇస్కాన్‌ను భక్తి వేదాంత స్వామి 1966 జులై 13 న న్యూయార్క్‌లో ఏర్పాటు చేశారు. అలా ఈ సంస్థ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇటీవలనే ఉత్సవాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. ఇస్కాన్ స్థాపించాక వారు ప్రపంచవ్యాప్తంగా 108 కృష్ణ మందిరాలను నెలకొల్పారు. అందులో భాగంగా మనదేశంలో వారు తన స్వహస్తాలతో మాయాపూర్, కొలకత్తా, బృందావనం, హైదరాబాద్‌లో ఇస్కాన్ మందిరాలను ప్రతిష్ఠించారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరాన్ని 1976 ఆగస్టు 18న ప్రతిష్ఠించారు. అంటే ఈనెల 18తో ఈ మందిరం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. ఒకవైపు ఇస్కాన్ ఏర్పడి 60 సంవత్సరాలు, ఇస్కాన్ హైదరాబాద్ అబిడ్స్ మందిరం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా వీటి వివరాలు ఒకసారి పరిశీలిద్దాం. భక్తివేదాంత స్వామి కలకత్తాలో 1896 సెప్టెంబర్ 1న సాంప్రదాయ గౌడియ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు అభయ్. సంప్రదాయంగా వచ్చిన భక్తితో పాటు వారి తండ్రి మోహన్ దే కున్న అపారమైన భక్తి వీరికి కూడా బాల్యం నుండే అబ్బింది. అదే తదనంతర కాలంలో తన ఆధ్యాత్మిక ప్రయాణానికి బాటలు వేసింది. అందులో భాగంగా వేదాంత స్వామి 1922లో శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ ఆంగ్ల భాష తెలిసిన మీరు పాశ్చాత్య దేశాలలో కృష్ణ చైతన్యం ప్రచారం చేయాలని అభిలషించారు. అలాగే 1932లో సరస్వతి ఠాకూర్ మరోమారు వేదాంత స్వామికి 'నీవద్ద డబ్బులు ఉంటే కృష్ణ చైతన్యం పుస్తకాలు' ప్రచురించాలని, రచనలు చేయాలని సూచించారు. 1935లో వారి వద్దనే వేదాంతస్వామి దీక్ష తీసుకున్నారు. 1944లో కలకత్తా నుండి 'బ్యాక్ టు హెడ్' పత్రికను ప్రారంభించారు. అనేక ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ పత్రికను ప్రచురించారు. కృష్ణ చైతన్యం కొరకు కృషిచేశారు. పత్రిక ప్రచురణ, కృష్ణ చైతన్యం లక్ష్యంగా ఢిల్లీ తరచుగా వెళ్లేవారు. ఎందరినో కలిసి సహకరించాలని అభ్యర్థించేవారు. అయినా చేయూత లభించలేదు. కృష్ణ ప్రచారం పోరాటంలో బృందావనానికి తన మకాన్ని మార్చారు. అంతేకాకుండా 1959లో సన్యాసం స్వీకరించారు. గురువు ఆజ్ఞ మేరకు పుస్తకం ప్రచురణ, అనువాదం చేయటం ప్రారంభించారు. ఆశించిన రీతిలో ఆధ్యాత్మిక ప్రయాణం సాగటం లేదని గుర్తించి అమెరికా వెళ్లాలన్న చెక్కుచెదరని సంకల్పంతో ముందుకు సాగారు. ప్రచారం చేయాలని తలిచారు. చేతిలో డబ్బులు లేవు. వెళ్ళాక ఎక్కడ ఉండాలో తెలియదు. అయినా సంకల్పం చెక్కుచెదరలేదు. ఎట్టకేలకు సింధియా స్టీమ్ షిప్ లైన్ సంస్థ అధినేత్రి సుమతి మురార్జీని వేదాంతస్వామి 1965 ఆగస్టు 13న కలకత్తా షిప్ హార్బర్ నుండి జలదూత అనే షిప్‌లో ప్రయాణమైనారు. 37 రోజుల ప్రయాణం తర్వాత సెప్టెంబర్ 19న న్యూయార్క్ చేరుకున్నారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బట్లర్ నగరంలో ఉన్న గోపాల్ ఆగర్వాల్‌ఇంటికి వెళ్లారు. అనంతరం అనేక ప్రదేశాలలో తిరుగుతూ కృష్ణ చైతన్యం బోధనలు ఇవ్వసాగారు. అయితే ఆ రోజులలో అమెరికాలోని చాలా ప్రాంతాలలో యువత హిప్పి కల్చర్


శ్రీశ్రీ రాధా మదన మోహన


శ్రీల ప్రభుపాదులవారు

కలిగి, మత్తు మందులు, మాదక ద్రవ్యాలు, తాగుడుకు బానిసలై ఉండటాన్ని గమనించిన వేదాంతస్వామి ఆశ్చర్యకరంగా వారి మధ్యనే నివసించాల్సిన పరిస్థితులు నెలకొని ఉండేవి. అమెరికాలో 9 నెలలకు పైగా నిర్విరామంగా కృష్ణబోధనలు చేస్తూ, భారతీయ ఆధ్యాత్మికం, కృష్ణచైతన్యం పట్లవిశ్వాసం ఉన్న వ్యక్తుల తోడ్పాటుతో వేదాంతస్వామి తనకంటూ ఒక ఆశ్రయం ఏర్పాటు చేసుకున్నారు. న్యూయార్క్‌లోని సెకండ్ అవెన్యూ స్టోర్ ఫ్రంట్‌లో కృష్ణ సందేశాలు ఇవ్వడానికిహాల్, తాను నివాసం ఉండేందుకు ఒక గది కల భవనంలోకి తన మకాంని మార్చారు. అక్కడి నుండే కృష్ణ చైతన్య ప్రచారం కార్యక్రమాలు, భజనలు, హరినామ సంకీర్తనలు, శ్రీమద్ భగవద్ గీత, భాగవతం, కృష్ణ సంబంధ గ్రంథాలపై ప్రవచనాలు భక్తివేదాంత స్వామి ఇచ్చారు. ఈ కృష్ణ చైతన్య యాత్రలో చిరస్థాయిగా నిలిచేందుకు వారు 1966 జులై 13న 'ఇస్కాన్' ను స్థాపించారు. పూర్తి స్థాయి సంస్థగా రూపాకల్పన చేశారు. పుస్తక రచనలు, అనువాదాలు, ప్రచురణల కొరకు 'భక్తి వేదాంత బుక్ ట్రస్ట్' ను నెలకొల్పారు. శ్రీ అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి తదనంతరం శ్రీల ప్రభుపాదులుగా ప్రసిద్ధి చెందారు. ఎంతో మందికి దీక్షలు ఇచ్చారు. 70కి పైగా వైదిక గ్రంథాలు, కృష్ణచైతన్య పుస్తకాలకి సంబంధించి సంపుటాలు రచించారు, అనువదించారు, అలాగే వాటికి వ్యాఖ్యనాలు రాసారు. వీరి గ్రంథాలు 95 భాషలలోకి అనువాదం అయ్యాయి. భగవద్గీత యధాతథం, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య చరితామృతం, భక్తి రసామృతం, శ్రీ ఈశోపనిషత్తు, ఉపదేశామృతం, దేవాదిదేవుడు శ్రీకృష్ణ భగవానుడు వంటిఅనేక సుప్రసిద్ధమైనగ్రంథాలు ఇవి కొన్ని. ఇక శ్రీల ప్రభుపాదులవారు కేవలం 11సంవత్సరాల వ్యవధిలో 14 సార్లు ప్రపంచాన్ని చుట్టివచ్చారు. తన జీవిత కాలం అంతా కృష్ణసేవలో, ఆచార్యుల మార్గనిర్దేశంలో గడిపిన శ్రీల ప్రభుపాదులవారు 1977 నవంబర్ 14న తనువు చాలించారు. నేడు అనేక దేశాలలో ఇస్కాన్ కృష్ణ మందిరాలున్నాయి. కోట్లల్లో ఇస్కాన్ భక్తులున్నారు. వివిధ సేవ కార్యక్రమాలు, ఉచిత భోజన వితరణ, విద్యా సంస్థలు, గోశాలలు, గురుకులాలు, వర్ణాశ్రమాలు, సమాజ హితం కోసం పనులు చేస్తూ, మరోవైపు భక్తి యుత సేవ చేస్తూ ఇస్కాన్ నేడు ఆధ్యాత్మిక భూలోక బృదావనంగా తీర్చిదిద్దబడింది. ముఖ్యంగా జగన్నాథ రథయాత్రలు అన్ని చోట్లా నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాలలో ఇస్కాన్ కృష్ణ చైతన్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 900కు పైగా ఇస్కాన్ రాధాకృష్ణ మందిరాలు నెలకొల్పబడినాయి. 75కోట్ల భక్తి గ్రంథాలు ప్రపంచ దేశాలలో అనేక భాషలలో వితరణ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 1.2కోట్ల మంది భక్తులు ఇస్కాన్ ఆలయాలను సందర్శిస్తున్నారు. భారతదేశంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం ద్వారా ప్రతి రోజూ సుమారు 30లక్షల మంది పిల్లలకు భోజనం అందించబడుతోంది. వైద్యసేవల్లో భాగంగా ఇస్కాన్ ఆసుపత్రులు, వైద్య శిబిరాలు, నేత్ర శిబిరాల ద్వారా ఇప్పటివరకు సుమారు 3.4 లక్షల మంది రోగులు సేవలను పొందారు. 1967నుంచి ఇప్పటివరకు సుమారు ఒక లక్షమంది భక్తులు అధికారిక ఆధ్యాత్మిక దీక్షను స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 6వేల కృష్ణ చైతన్య ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరం ఈనెల 18వ తేదీతో 50సంవత్సరాలు పూర్తిచేసుకుని, స్వర్ణోత్సవ శోభను సంతరించుకుంది. శ్రీల ప్రభుపాదులు 1976 ఆగస్టు 18న ఈ మందిరంలో శ్రీ శ్రీ రాధా మదన మోహన, శ్రీ శ్రీ గౌరనితాయి, శ్రీశ్రీజగన్నాథ, సుభద్ర, బలదేవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. 50 ఏళ్ళ ప్రస్థానాన్ని అత్యంత వైభవంగా ఆలయకమిటీ నిర్వహిస్తోం ది. ఈ సందర్భంగా ఆగస్టు 15, 16, 17, 18 తేదీలలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 5లక్షల భోజనాలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరిస్తారు. 50ఏళ్ల ప్రస్థానంలో సేవలందించిన వారికి సత్కారం చేయాలని నిర్ణయించారు. భక్తితత్వంతో నిస్వార్థ సేవ.. అమెరికాలో అననుకూల పరిస్థితులను సైతం సానుకూలంగా మార్చుకుని యువతను 'కృష్ణ చైతన్యం'లోకి తెచ్చారు. జీవితాన్ని తరతరాలకు ఆదర్శనీయంగా తీర్చిదిద్దారు. ●

# ప్రధాని చెప్పిన 'సప్తధార'లు ఇవీ..

## ఏడు లక్ష్యాలతో దేశ అభివృద్ధికి వడివడిగా అడుగులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామన్న ప్రధానిమోడీ భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తివంతం చేస్తామన్నారు. యువతలో ఉన్న అపార సామర్థ్యాలను దేశ నిర్మాణం కోసం పూర్తిగా వినియోగిస్తామన్నారు. యువత ప్రతిభ, ఉత్సాహం, శక్తిని ఏకం చేసి బలమైన, మరింత అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించే దిశగా మళ్లిస్తామని మోడీ ప్రకటించారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు ధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. దేశ ప్రగతికి తయారీ రంగాన్ని భారత భవిష్యత్తుకు గ్రోత్ ఇంజిన్‌గా అభివర్ణించిన ప్రధాని మోడీ తయారీ రంగానికి ఊతమివ్వాలని పిలుపునిచ్చారు. మనకు విడి భాగాలతోపాటు పూర్తి స్థాయి ఉత్పత్తులు కూడా కావాలన్న ప్రధాని ప్రపంచ సప్లయ్ చైన్‌లో భారత్ కేంద్ర బిందువుగా మారాలని పిలుపునిచ్చారు. సప్తధారలో రెండో ధారగా వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాన్ని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈ దిశలో మనం ముందుకెళ్లాలన్న ప్రధాని ఇప్పుడు ప్రపంచ మార్కెట్లు మన రైతులకు తెరిచి ఉన్నాయన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల అతిపెద్ద మార్కెట్లు సైతం మనకు అందుబాటులోకి వస్తున్నాయని మనం వాటిని చేరుకోవాలన్నారు. పొలం నుంచి ఎగుమతి మార్కెట్‌కు మన ఉత్పత్తులను మళ్లించాలన్నారు. మన సంప్రదాయ ఆహారం, మిల్లెట్స్, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలు అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. మూడో సప్తధారగా టెక్నాలజీ, ఆవిష్కరణలు అని పేర్కొన్న మోడీ డేటా సెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త టెక్నాలజీల యుగం నడుస్తోందన్నారు. ఈ టెక్నాలజీల హబ్‌గా భారత్ మారాలని పిలుపునిచ్చారు. యుపిఐని ప్రవేశపెట్టడం ద్వారా మన సామర్థం ఏంటో మనకు తెలిసిందన్నారు. మేడిన్ ఇండియా 6జీ దేశమంతటా చేరాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. యుపిఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాతోపాటు నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో మనం మరో పెద్ద అడుగు వేయాలన్నారు. దేశవ్యాప్తంగా వేగవంతమైన కనెక్టవిటీని పెంపొందించాలన్న ప్రధాని వ్యాపార రంగానికి ఊతం ఇవ్వడం కోసం కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సప్తధారల్లో రక్షణ కూడా భాగమన్న ప్రధాని రక్షణ ఉత్పత్తుల తయారీ, రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ భారత్ మరింత పెట్టుబడులు పెడుతుందన్నారు. గ్రీన్ ఎనర్జీని ఆరో ధారగా పేర్కొన్న ప్రధాని దేశంలో కాలుష్యం తగ్గించడం కోసం గ్రీన్ టెక్నాలజీ రంగంలో పెద్ద ఆవిష్కరణలకు పిలుపు నిచ్చారు. భారత సాఫ్ట్ పవర్‌ను ఏడో ధారగా ప్రకటించిన ప్రధాని యోగా, చేతివృత్తులు, సినిమా, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, సృజనాత్మక రంగాన్ని సాఫ్ట్ పవర్‌కు ఉదాహరణగా పేర్కొన్నారు. పెద్ద స్థాయిలో అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే సామర్థం భారత్‌కు ఉందన్న ప్రధాని దేశంలో అనేక జాతీయ పార్కులు, మ్యూజిక్ కన్సెర్ట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ఇతర ఆకర్షణీయ ప్రదేశాలు ఉన్నాయన్నారు.

## దిమాగీ నక్సల్స్‌తో జాగ్రత్త...

### యువతకు ప్రధాని మోడీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీజాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దిమాగీ నక్సల్స్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో ఆయుధాలు పట్టిన నక్సలిజాన్ని విజయవంతంగా నిర్మూలించామని, సాయుధ నక్సల్స్ కనుమరుగైనా దిమాగీ నక్సల్స్ మిగిలి ఉన్నారని ప్రధాని అన్నారు. దిమాగీ నక్సల్స్ ఒక అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ప్రధాని మోడీ తెలిపారు. మనం వారిని గుర్తించి ఏకాకిని చేయాలని మోడీ సూచించారు.

3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది నక్సలిజం పోరాటంలో అమరులయ్యారని, ఇది యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికంటే ఎక్కువని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోడీ పిలుపునిచ్చారు. నేను అందరినీ ఒక సాయం చేయాలని అడుగుతున్నాను. జనగణన విషయంలో ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో మీరు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దు కుంటాయి.

దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోడీ పేర్కొన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ యువతకు తీపి కబురు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. గడిచిన కొన్నేళ్లలో దేశంలో 650కి పైగా కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా భారత్‌లోకి వస్తున్నాయని, మన యువత స్వదేశంలోనే విదేశీ డిగ్రీలు పొందే అవకాశం లభించిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.



## యుద్ధ నౌకలతో హార్ముజ్‌ను స్వాధీనం చేసుకోలేరు

### ట్రంప్‌కు ఇరాన్ కౌంటర్

**టెహ్రాన్, ఆగస్టు 15:** హార్ముజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ అమెరికాదేనని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. జలసంధి ఎప్పటికీ తమ నియంత్రణలోనే ఉంటుందని.. దానిని ఎవరూ ఆక్రమించుకోలేరని పేర్కొంది. హార్ముజ్‌ను మూసి ఉంచాలా? తెరవాలా? అనేది తమ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ తెలిపారు. యుద్ధ నౌకల మోహరింపు ద్వారా జలసంధిని స్వాధీనం చేసుకోలేరని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. అగ్రరాజ్యం తన భ్రమలను విడిచిపెట్టి.. ఓటమిని అంగీకరించే వరకు హార్ముజ్‌పై ఇరాన్ దిగ్బంధనాన్ని అమలు చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. తాము బెదరింపులకు భయపడబోమని.. సైనిక ప్రదర్శనలకు లొంగబోమని స్పష్టం చేశారు. హార్ముజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని అమెరికా చెబుతున్న మాటల్లో నిజంలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే.. జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందన్నారు. తమ సాయుధ దళాల అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించబోదని స్పష్టం చేశారు. హార్ముజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు.

**డొనాల్డ్ ట్రంప్ ఏమన్నారంటే..?**

యుద్ధంలో ఇరాన్‌ను ఓడిస్తామని.. ఆ దేశం ఓటమిని చవిచూసినతర్వాత హార్ముజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని శనివారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంవద్ద అణ్వాయుధ సామర్థ్యం ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని.. దానిని నాశనం చేయాలనే లక్ష్యంతో యుద్ధానికిదిగినట్లు వెల్లడించారు.

## భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం

### యుఎస్ విదేశాంగమంత్రి మార్కో రూబియో



**వాషింగ్టన్, ఆగస్టు 15:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శుభాకాంక్షలు తెలిపారు. భారత్-అమెరికా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగాఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యమే ఇందుకు కారణమని చెప్పారు. రక్షణ, ఇంధన భద్రత, కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ, అంతరిక్షం, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాల సహకారం మరింత విస్తరిస్తోందని తెలిపారు. భారత్, అమెరికా ప్రజల మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాదిగా నిలుస్తోందని రూబియో పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం కేవలం రెండు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని, అంతకు మించి విస్తరించి ఉందని స్పష్టం చేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఢిల్లీతో పరస్పర సహకారానికి వాషింగ్టన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భవిష్యత్తులోనూ భారత్‌తో కలిసి పనిచేసేందుకు అమెరికా ఎదురుచూస్తోందని తెలిపారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్.. భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య స్నేహ బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సింగపూర్ ప్రభుత్వం భారత్‌తో తమకున్న వ్యూహాత్మక, ఆర్థిక బంధాన్ని గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేస్తూ.. ఇరు దేశాల మధ్య డిజిటల్ కనెక్టివిటీ, గ్రీన్ ఎనర్జీ, రక్షణ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.

## పోటీ పరీక్షార్థులకు ఆన్‌లైన్ ఉచిత కోచింగ్

### జనగణనలో అందరూ భాగస్వాములు కావాలి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ యువతకు కీలక ప్రకటన చేశారు. దేశంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు మధ్యతరగతి, పేద కుటుంబాలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్న ప్రధాని మోడీ వారిపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు పోటీ పరీక్షల కోచింగ్ కోసం కుటుంబాలు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆ భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. చదువుల కోసం యువత వారి కుటుంబాలకు దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి కూడా తగ్గాలని అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పటికే ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించుకుని ఫ్రీ ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, విద్యావేత్తల సేవలను ఈ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కోసం ఉపయోగించుకో నున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు నాణ్యమైన విద్యా వనరులను అందుబాటులోకి తీసుకురావడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా ఆయన ప్రసంగంలో వివరించారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

## సిజెపి చీఫ్ ఇన్‌స్టాకు అంతరాయం.. ఎగసిన దుమారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** క్రాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ శనివారం కొద్దిసేపు నిలిచిపోయింది. ఈ విషయాన్ని సిజెపి ఫౌండర్ అభిజీత్ దీప్కే తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా వెల్లడించారు. సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిపివేయడాన్ని పిరికిపంద చర్యగా అభిజీత్ దీప్కే వర్ణించారు. అయితే, కొంతసేపటి తర్వాత అకౌంట్ తిరిగి ప్రారంభమైంది. ఈ అంశంపై దీప్కే స్పందించారు. సిజెపి అకౌంట్ నిలిచిపోవడానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఆయనతోపాటు సిజెపి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 6.16 గంటలకు సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిచిపోయింది. దీనిపై ఫిర్యాదు చేయడంతో 6.45 గంటలకు ఖాతా తిరిగి పునరుద్ధరించారు. భారత స్వాతంత్ర్య దినం రోజున తమ గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని దీప్కే ప్రకటించారు. ఇది పిరికిపందలు చేసిన చర్యగా అభివర్ణించారు.

## మహిళను హత్యచేసి వన్యమృగాలకు ఆహారం

### ఏడువేల కిలోమీటర్లు ఛేదించి అరెస్టుచేసిన పోలీసులు

**జైపూర్, ఆగస్టు 15:** రాజస్థాన్‌లో షాబాజ్ అనే వ్యక్తి ముస్కాన్ అనే మహిళను హత్య చేసి ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు ఆమె మృతదేహాన్ని అడవి మృగాలకు ఆహారంగా వేశాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగాఉన్న షాబాజ్ ఖాన్‌ను రాజస్థాన్ పోలీసులు సుమారు ఏడు వేల కిలోమీటర్లు వెంబడించి బీహార్‌లో అరెస్ట్ చేశారు. జూన్ 22న ముస్కాన్ దారుణహత్యకు గురైంది. షాబాజ్ ఖాన్,అతని సహచరుడుకలిసి ముస్కాన్‌ను రాంపుర కొండప్రాంతంలో హత్య చేశారు. అక్కడ ఆమె తలపై రాళ్లతో కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని క్రూర మృగాలు తినివేస్తే ఆనవాళ్లు కూడా మిగలవనే దురాలోచనతో సమీపంలోని ఒక జంతువుల గుహవద్ద పడేశారు. అయితే మృతదేహం పూర్తిగాధ్వంసం కాకముందే పోలీసులుదానిని స్వాధీనంచేసుకున్నారు. అప్పటికే మిస్సింగ్‌కేసు పెట్టిన కుటుంబసభ్యులు అది ముస్కాన్ మృతదేహంగా నిర్ధారించారు.

## ఎర్రకోటవద్ద వందేమాతరం ఆలాపన చరిత్రాత్మకం



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చరిత్రాత్మక ఘటన చోటుచేసుకున్నది. వందేమాతరం గేయాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారంపూర్తి స్థాయిలో ఆ గీతాన్ని పాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆ గేయాన్ని పాడడం ఇదే మొదటిసారి. వందేమాతరం గీతాన్ని రాసి 150 యేళ్లు పూర్తి అవుతోంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం కీలక పాత్ర పోషించింది. దేశ ప్రజల్లో ఆ పాట జాగృతి నింపింది. ప్రధాని మోడీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఎర్రకోటపై వందేమాతర గీతం ప్రతిధ్వనించింది. తొలుత 21 గన్ సెల్యూట్ చేశారు. 1721 ఫీల్డ్ బ్యాటరీ సెర్మోనియల్ గ్రూపు ఈ సెల్యూట్ నిర్వహించారు. 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్ వాడారు. ఆర్మీ బ్యాండ్ ద్వారా వందేమాతరాన్ని ఆలపించారు. ఎర్రకోట వేదికపై రెండు ఎంఐ17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఓ హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని మోసుకెళ్లింది. మరో హెలికాప్టర్ వందేమాతరం గీతం రాసిన జెండాను తీసుకెళ్లింది. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి వందేమాతరం గీతాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు.

## మోడీ హగ్ సెటైర్లకు బిజెపి కౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని విమర్శించే క్రమంలో, ప్రధాని నరేంద్రమోడీ విదేశాధినేతల్ని ఆలింగనం చేసుకోవడంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విదేశీ నేతల్ని కౌగిలించుకోవడం ఎలాంటి విదేశాంగ విధానం అని ప్రశ్నించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను కౌగిలించుకుని, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిని ప్రస్తావిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వ్యవహారం తిరిగి కాంగ్రెస్‌కే ఎదురుదెబ్బగా మారింది. బిజెపి నేతలు ఇందిరాగాంధీ గతంలో విదేశీ నేతల్ని ఆలింగనం చేసుకున్న ఫోటోలను షేర్ చేస్తున్నారు. తాజాగా బిజెపి ఎంపీ నిషికాంత్ దూబే తన ఎక్స్ అకౌంట్లో నెహ్రూకు సంబంధించిన పలు పాత ఫోటోలను పోస్ట్‌చేశారు. నా లైబ్రరీలోని నెహ్రూగాంధీ కుటుంబానికి సంబంధించిన ఓ పుస్తకంలోని కొన్ని అయితే, దూబే వీటిని నెహ్రూ కిస్ ఫోటోలని నేరుగా పేర్కొననప్పటికీ, నెహ్రూ మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు చూపించే ఉద్దేశంతోనే వాటిని పోస్ట్ చేసినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ స్పందిస్తూ నెహ్రూ ఫోటోలు అసలు సందర్భం నుంచి విడదీసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఫోటోలో నెహ్రూ సోదరి విజయలక్ష్మి పండిట్ ఆయన చెంపపై ముద్దు పెడుతున్నారని, మరో ఫోటోలో ఆయన మేనకోడలు నయనతార సహగల్ ఉన్నారని ఆమె వివరించారు. 1962 మార్చిలో తీసిన మరో ఫోటోలో హోలీ సందర్భంగా జాక్వెలిన్ కెన్నెడీకి నెహ్రూ రంగులు పూస్తున్నట్లు ఉందని సుప్రియా శ్రీనేత్ తెలిపారు. క్రియేటివ్ కాంగ్రెస్ కార్య క్రమంలో రాహుల్ గాంధీ, సందీప్ దీక్షిత్‌లు ఆలింగనం చేసుకుని ప్రధాని మోడీపై వ్యంగ్యంగా స్పందించారు.

ఈ సమయంలోనే సందీప్ దీక్షిత్, రాహుల్ గాంధీతో నన్ను మెలోనీ అనుకోలేదుగా? అని ప్రశ్నించగా, రాహుల్‌గాంధీ నేను ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదని బదులిచ్చారు. దీని తర్వాత బిజెపి ఇందిరా గాంధీఫిడెల్ కాస్ట్రో, ఇందిరా గాంధీయాసర్ అరాఫత్ ఫోటోలను కూడా షేర్ చేసింది. నెహ్రూ తన సోదరి విజయలక్ష్మి పండిట్, మేనకోడలు నయనతార సహగల్, అమెరికా మాజీ ప్రథమ మహిళ జాక్వెలిన్ కెన్నెడీతో ఉన్న చిత్రాలు ఉన్నాయి.

## ప్రధానిమోడీ ఐర్లాండ్ పతాకం ధరించారంటూ కాంగ్రెస్ సెటైర్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ధరించిన దుస్తులు ఇప్పుడు రాజకీయ దుమారానికి దారితీశాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే సమయంలో ఆయన ధరించే ప్రత్యేక శైలితో కూడుకున్న దుస్తులు, వైవిధ్యంగా కనిపించే తలపాగాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమోతుంటాయి. ఈసారి మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాని మోడీ ధరించిన జాకెట్‌పై అలంకరించిన పాకెట్ స్క్వేర్స్‌లో కనిపించిన జాతీయ పతాకం అమరిక ఇప్పుడు తీవ్ర వివాదానికి కేంద్రబిందువు అయింది. ప్రధాని మోడీ జాతీయజెండాను తలకిందులుగా అమర్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఘాటు విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలకు మరింత ఆజ్యం పోసింది. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలుపు రంగు కుర్తాపైజామాతో పాటు చాక్లెట్ బ్రౌన్ కలర్ స్లీవ్‌లెస్ జాకెట్, సాంప్రదాయ తలపాగాలను ధరించారు. ఈ జాకెట్‌పై ఆకుపచ్చ, తెలుపు, కాషాయం రంగులలో ఉన్న మూడు జేబు రుమాళ్లను అమర్చారు. సాధారణంగా భారత జాతీయ జెండా పైభాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, దిగువన



ఆకుపచ్చ రంగులు ఉంటాయి. దీనికి భిన్నంగా మొదట ఆకుపచ్చ రంగు, ఆ తర్వాత తెలుపు, చివర్లో కాషాయ రంగుతో తలకిందులుగా కనిపించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు పవన్‌ఖేరా. ఆయన వేసుకున్న పాకెట్ స్క్వేర్ రంగులు, దాని అమరికను తప్పుపట్టారు. ప్రధాని మోడీ మన దేశ మువ్వన్నెల పతాకాన్నికాకుండా ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని ధరించారని ఆరోపించారు. ప్రధాని మోడీధరించిన జాతీయ పతాకం కూడా కుడి నుంచి ఎడమవైపుగా అమర్చినట్లు ఉందని పవన్ ఖేరా సెటైర్లు వేశారు. పైగా అది ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని పోలిఉందని, ప్రధాని మోడీ ఆ దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లుగా అనిపిస్తోందని తన అధికారిక ఎక్స్ అకౌంట్‌లో సెటైర్లు వేశారు.

## భారీ వర్షాలకు ఈశాన్య అరుణాచల్ అతలాకుతలం

**ఇటానగర్, ఆగస్టు 15:** అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వేర్వేరుగా జరిగిన ఈ ఘటనల్లో నలుగురు చనిపోగా, ఐదుగురు సైనికులు గల్లంతయ్యారు. ఆ రాష్ట్రంలోని అప్పర్‌సుబన్‌సిరి జిల్లాలోని కియోజరింగ్‌బయాచింగ్ రోడ్డు మలుపు ప్రాంతం, దిబంగ్ లోయ జిల్లాలో ఈ ఘటనలు జరిగాయి. పసుపానీ ఆర్మీ క్యాంపులోని రెండు షెల్టర్లు కొట్టుకుపోయాయి. ఐదో గ్రెనేడియర్‌కు చెందిన ఏడుగురు జవాన్లు కొట్టుకుపోయారు. ఇద్దరిని రక్షించగా, ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైనవారిని హవల్దార్ ఉపేందర్, ఆర్మీ సిబ్బంది కుందన్, వినోద్, ఆదిత్య, సముందగా గుర్తించారు. ఐదో గ్రెనేడియర్, ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ 58వ బెటాలియన్, జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్‌కు చెందిన ఆర్‌సిసి, అరుణాచల్‌ప్రదేశ్ పోలీసులు, వలంటీర్లు సహాయక చర్యలు చేపట్టారు. అప్పర్‌సుబన్‌సిరి ప్రాంతంలో విరిగిపడిన కొండచరియల శిథిలాల కింద పలువురు కూరుకుపోయారు. టాడు బాకి, తాజి రాయ్, మర్కోష్ బసుమతారి, బాబుల్ అలీ మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు.

## సంక్షిప్త వార్తలు

### నేడు ప్రత్యేక పూజలకోసం తెరుచుకోనున్న శబరిమలై



**పతనంతిట్ట, ఆగస్టు 15:** శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారంనుంచి తెరుచుకోనుంది. చింగం మాసం పూజల కోసం ఈ ఆలయాన్ని తెరుస్తున్నట్లు ట్రావన్‌కోర్‌దేవస్వోమ్ బోర్డు వెల్లడించింది. సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ప్రధాని పూజారి ఆలయ తలుపులను తెరుస్తారు. తరువాత ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం ఐదు గంటల నుంచి భక్తులకు దర్శనం అవకాశం కల్పించనున్నారు. ప్రసిద్ధి చెందిన శబరిమల ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం ఆదివారం సాయంత్రం సరిగ్గా 5 గంటలకు తెరుచుకోనుంది.

### ఉగ్ర సంస్థలతో లింకులు: బెంగళూరులో ఒకరి అరెస్టు

**బెంగళూరు, ఆగస్టు 15:** అఫ్ఘానిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఉగ్రమూఠాతో సంబంధం ఉన్న అసఫూల్ మాలిక్ అనే యువకుడిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) సభ్యుడితో కలిసి, ఆ సంస్థలో చేరడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలపై సమాచారం అందడంతో అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసఫూల్ మాలిక్ బెంగళూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఉగ్రవాద సంస్థలతో లింకులు బయటపడ్డాయి.

### విద్యుత్ తీగ తగిలి కరెంట్‌షాక్, టీచర్ మృతి

**భువనేశ్వర్, ఆగస్టు 15:** ఒక స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల సమయంలో విషాద సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఐరన్ పోల్‌కు విద్యుత్ వైర్ తగిలింది. దీంతో కరెంట్ షాక్‌తో టీచర్ మరణించగా, ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణ స్టాండ్‌కు ఐరన్ పైపు అమర్చడానికి వారు ప్రయత్నిస్తున్నప్పుడు అనుకోకుండా పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్‌కు అది తగిలింది. ఈ నేపథ్యంలో ఆ టీచర్, ముగ్గురు విద్యార్థులు విద్యుతాఘాతానికి గురయ్యారు.

### విద్యావ్యవస్థ లోపాలే నిరసనలకు కారణం: బాబారామ్‌దేవ్

**హరిద్వార్, ఆగస్టు 15:** విద్యార్థుల నిరసనలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియపై యోగా గురువు రామ్‌దేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతోన్న నిరసనలు, గందరగోళం లాంటివి విద్య, ఉపాధి వ్యవస్థల్లో ఉన్న తీవ్రమైన లోపాలను సూచిస్తున్నాయని అన్నారు. పతంజలి యోగపీఠంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా రామ్‌దేవ్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు వీధుల్లోకి వస్తున్నారని బాబా రాందేవ్ అన్నారు.

### మద్యం కొన్నా, అమ్మినా 5 వేలు ఫైన్

**చెన్నై, ఆగస్టు 15:** దేశవ్యాప్తంగా యువతను యుతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్,మద్యం అలవాట్లను కట్టడిచేసేందుకు తమిళనాడులోని ఓ గ్రామం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. విజుంతమావడి గ్రామం తీసుకున్న నిర్ణయం దేశ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. తమిళనాడులోని విజుంత మావడి గ్రామంలో పెళ్లి కాని యువకులకు మద్యం విక్రయించడాన్ని నిషేధించారు అక్కడి పెద్దలు. ఈ రూల్స్‌ను అతిక్రమిస్తే రూ.ఐదువేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

### కాశ్మీర్ ప్రజలు తిరుగాబుటు చేసేవారు: సిఎం ఒమర్

**శ్రీనగర్, ఆగస్టు15:** జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ప్రత్యేక హోదాను రద్దు చేయకపోవడం, రాష్ట్ర హోదాను కేంద్రం తొలగించకపోయి ఉంటే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) ప్రజలు జమ్ముకశ్మీర్‌లో విలీనం కావడానికి తిరుగుబాటు చేసేవారని అన్నారు. శనివారం శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. 1947లో పాకిస్థాన్ నుంచి దండెత్తి వచ్చిన గిరిజన దుండగులకు వ్యతిరేకంగా పోరాడి, భారతదేశంలో భాగం కావాలని ఎంచుకున్న కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పిఒకెలోని ప్రస్తుత పరిస్థితులు సమర్థిస్తున్నాయని తెలిపారు.

## తిరుమల సమాచారం




## తిరుమలలో అనూహ్య రద్దీ

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుససెలవులతో తిరుమలకు భారీగా భక్తులు తరలివచ్చారు. శనివారం కావడంతో ఉదయానికి తిరుమలలో లక్షమంది భక్తులు చేరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. సర్వదర్శనానికి సుమారు 24గంటల సమయం నిరీక్షణ తప్పడంలేదు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి శిలాతోరణం వరకు వెలుపల క్యూలైన్లు చేరాయి. శుక్రవారం 4.03 కోట్ల రూపాయలు హుండీ ఆదాయం చేకూరింది. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి అన్ని ఏర్పాట్లు చేస్తోందని ఛైర్మన్ బిఆర్ నాయుడు స్పష్టం చేశారు. తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆయన ప్రకటన చేశారు. భక్తులు తిరుమల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తమ యాత్రను ముందుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. దర్శన సమయంలో సంయమనం పాటిస్తూ, టిటిడి సిబ్బందికి సహకరించాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి వరకు 73,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,884 మంది తలనీలాలు సమర్పించారు. భారీ రద్దీ ఉన్నప్పటికీ భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సేవలు వంటి సౌకర్యాలను టిటిడి అధికారులు నిరంతరాయంగా అందిస్తున్నారు.



## అంకితభావ సేవలకు గుర్తింపు
### టిటిడిలో 38 మంది అధికారులు, 287 మంది ఉద్యోగులకు సన్మానం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో భక్తులకు విశేషంగా అంకితభావసేవలందిస్తున్న టిటిడి అధికారులు, ఉద్యోగులను శనివారం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఘనంగా గౌరవించారు. విధుల్లో ఉత్తమసేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన 38 మంది అధికారులు, 281మంది ఉద్యోగులకు, స్విమ్స్‌లో ఆరుగురు,ఎస్వీబీసిలో ఆరుగురు ఉద్యోగులకు ఐదుగ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఉద్యోగుల పిల్లలకు సంబంధించి ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 33మంది విద్యార్థులకు 4,116రూపాయలు, 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన 29మంది విద్యార్థులకు 2,116 రూపాయలు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఎస్వీసంగీత,నృత్య కళాశాల విద్యార్థినులు దేశభక్తి గీతాలతో చక్కటి నృత్యం ప్రదర్శించారు.



## బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌కు ప్రశంసాపత్రం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో బర్డ్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందించడంలో సాటిగా ఉన్న డైరెక్టర్ డాక్టర్ జి.జగదీశ్‌కు టిటిడి అధికారులు ప్రశంసాపత్రం అందజేశారు. పుట్టుకతో వచ్చే అంగవైకల్యం, పోలియో ఎముకల సంబంధిత వ్యాధులకు పూర్తిగా బర్డ్‌లో ఉచితంగా,నామమాత్రపు ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందించడంలో డాక్టర్ జగదీశ్ సేవలు అమోఘంగా ఉన్నాయి. కృత్రిమ అవయవాలను కూడా అందిస్తున్న సేవలు మరింతగా రోగులకు సేవాభావంతో చేయడంపట్ల డైరెక్టర్‌ను శనివారం స్వాతంత్ర్యదినోత్సవాన టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అభినందించారు.



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.కోటి విరాళం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు,పథకాలకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శనివారం తెలంగాణ హైదరాబాద్ కు చెందిన రక్షిత్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ సి.హెచ్.ఏ.పి.రామేశ్వరరావు, సాయిదండన ఏపిఐ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఉద్దగిరి తాతారావులు కోటిరూపాయలు విరాళమిచ్చారు. టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు ఒక్కొక్కరు 50 లక్షలు రూపాయలు చొప్పున విరాళం అందించారు. దాతలు తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బి.ఆర్.నాయుడుకు విరాళ డిడిలను అందజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, రంగశ్రీ పాల్గొన్నారు.



## తిరంగా ర్యాలీతో నగర సంకీర్తన

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** శనివారం వేకువజామున పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరం భక్తి పారవశ్యంతో మేల్కొంది. వేంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ భజన మండలి ఆధ్వర్యంలో శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. ఈ వారం ప్రత్యేకంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో కలిసి జరిగింది. బ్రహ్మ ముహూర్తంలో సంప్రదాయ వస్త్రధారణలో, నుదుట గోవింద నామాలతో భక్తులు గోవిందరాజస్వామి ఆలయం తూర్పు మాడవీధిలోని ఆం జనే య స్వామి ఆలయం వద్దకు చేరుకుని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీహరి నామస్మరణతో నగర సంకీర్తన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కళాకారులు ప్రవచనకర్త చంద్రమోళి, గుండాల గోపీనాథ్‌రెడ్డి,వాసు దేవ రెడ్డి, మునినాథ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, తిరుపాలాచారి, వాసు, కృష్ణంరాజు, కృష్ణయ్య, మధు, నాగేశ్వర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకల్లో ఆకర్షణగా 'డాగ్ షో'
### ప్రశంసలు కురిపించిన మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, ఆగస్టు 15 ప్రభాతవార్త :** ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ డాగ్ షో మైదానంలోని ప్రేక్షకులను విశేషంగా అలరించింది. తమ ధైర్యసాహసాలు, ఘ్రాణశక్తి, అత్యుత్తమ క్రమశిక్షణతో పోలీస్ డాగ్స్ ప్రదర్శించిన విన్యాసాలు ప్రతి ఒక్కరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఈ అద్భుత ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంత్రముగ్ధులయ్యారు. నేరాల దర్యాప్తు, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాల గుర్తింపులో డాగ్ స్క్వాడ్ సేవలు అత్యంత కీలకమని కొనియాడిన మంత్రి, ప్రతిభ కనబరిచిన హ్యాండ్లర్లు, శిక్షకులను ప్రత్యేకంగా అభినందించారు. వేడుకల ప్రారంభంలో 'మున్నా' అనే గోల్డెన్ రిట్రీవర్ డాగ్ మంత్రి అచ్చెన్నాయుడుకి నోటితో పూలగుత్తి అందించి స్వాగతం పలకగా, 'ద్రోణ' అనే బెల్జియన్ మాలినోయిస్ డాగ్ ఫ్లెక్సీని ఓపెన్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనంతరం హ్యాండ్లర్లు ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ 'మున్నా', 'బ్యూటీ' డాగ్స్ తమ క్రమశిక్షణను నిరూపించగా.. జిల్లాలో గంజాయి నిరోధానికి చేపట్టిన చర్యల్లో భాగంగా 'రాణి' అనే లాబ్రడార్ డాగ్ వాహన తనిఖీల్లో దాచి ఉంచిన మత్తు పదార్థాలను పసిగట్టే తీరును ప్రత్యక్షంగా ప్రదర్శించి ఆకట్టుకుంది.

# జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి
### స్వాతంత్ర్య వేడుకల్లో పతాకావిష్కరణ చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్.ఆర్.ఐ. సాధికారత సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాలనుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ వెంట రాగా ప్రత్యేక వాహనంలో పెరేడ్ పరిశీలన చేశారు. జిల్లా ప్రజలనుద్దేశించి తమ సందేశాన్ని వినిపిస్తూ, మన జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెడదామని పిలుపునిచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో అభి వృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. భోగా పురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మారుతుందని పేర్కొన్నారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కల్పిం చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్నో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యా చరణను అమలు చేస్తున్నామని అన్నారు. ఉదయం 8:59 గంటలకు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి వేదిక వద్దకు చేరుకోగా, 9:03 గంటలకు ముఖ్య అతిథి కొండపల్లి శ్రీనివాస్ సభా ప్రాంగణానికి విచ్చేశారు. 9:04 గంటలకు వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమాలు ప్రారం భమయ్యాయి. అనంతరం మంత్రిచే జాతీయ పతాకావిష్కరణ, పోలీసు బలగాల నుంచి గౌరవ వందన స్వీకరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మంత్రి జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం వినిపించారు. డాగ్ షో తిలకించి, శిక్షకులు ప్రత్యేకంగా మంత్రి అభినందించారు. ప్రముఖులు, అధికారులు అతిథుల వద్దకు వెళ్ళి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం 10:20 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ముందుగా వివిధ సేవా పతకాలను సాధించిన జిల్లా పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు కావాలి గ్రీష్మ, గాదె శ్రీనివాసుల నాయుడు, డాక్టర్ సురేష్ బాబు, మార్క్ఫెడ్ ఛైర్మెన్ కర్రోతు బంగార్రాజు, జేసి సేథు మాధవన్, ఏఎస్పీ సౌమ్యలత, డియార్వో సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికార యంత్రాంగం, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# ఎంసిలో జాతీయ స్థాయి ఉదరకోశ కార్యశాల
### వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ప్రముఖ ఉదరకోశ వైద్య నిపుణులు డాక్టర్ పెదవీర్రాజు



**విశాఖపట్నం, ఆగస్టు15 ప్రభాత వార్త :** వైద్య విద్య, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం,ప్రజాసేవలను సమన్వయం చేస్తూ ఆంధ్రా వైద్య కళాశాల కెజీహెచ్‌లో నిర్వహిస్తున్నరెండు రోజుల జాతీయ స్థాయి ఈయూఎస్ కార్యశాల 2026 ఉదారకోశ యువ వైద్యులు, నిరు పెద రోగులకు ఎంతగానో ఉపయోగ పడుతోందని నగరానికి చెందిన ప్రముఖ సీనియర్ ఉదరకోశ వైద్య నిపుణులు కెజీహెచ్ గ్యాస్ట్రోంట్రాలజీ విశ్రాంత విభాగా ధిపతి డాక్టర్ ఈధర పెద వీర్రాజు అన్నారు. విశాఖ పట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో "వైజాగ్ ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్ )2026: ఏ టూ జడ్ " పేరుతో రెండు రోజుల జాతీయ స్థాయి ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ కార్యశాల ను శనివారం కెజీహెచ్ ఉదరకోశా విభాగంఅధిపతి డాక్టర్ ఎల్ ఆర్ ఎస్ గిరినాథ్, ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఐ వాణి తో కలసి డాక్టర్ పెద వీర్రాజు ప్రారంభించారు. ఆగస్టు 16 ఆదివారం సాయంత్రం వరకూ నిర్వహించనున్న ఈ జాతీయ స్థాయి వర్క్ షాప్‌లో దేశంలోని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజీ, అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపీ నిపుణులు పాల్గొని ఆధునిక ఈయూఎస్ విధానాలపై ఉపన్యాసాలు, ప్రత్యక్ష లైవ్ కేసుల ప్రదర్శనలు, హ్యాండ్స్ ఆన్ శిక్షణ, సాంకేతిక చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ . కె.వి.ఎస్.ఎం. సంధ్యా దేవి,ఏఐజీ హాస్పిటల్స్ కు చెందిన డాక్టర్ సందీప్ లఖ్టా కియా, డాక్టర్ జహంగీర్ బాషా, విశాఖ పట్నం సీనియర్గ్యాస్ట్రోఎం టరాలజిస్టులు , డాక్టర్ ఎ.వి. శివ ప్రసాద్ ఆంధ్ర మెడికల్ కళాశాల మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రలజిస్టులు డాక్టర్ టి. మోహన్ వంశీ, డాక్టర్ . ఎస్. శ్రీదేవి, డాక్టర్ డి. వంశీ యాదవ్, తది తర అధ్యాపకులు వైద్యులు వర్క్ షాప్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్నారు.


# కాకినాడలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
### ముఖ్యఅతిథిగా విచ్చేసిన డి.సిఎం పవన్ కళ్యాణ్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 15 ప్రభాతవార్త :** కాకినాడ భానుగుడి పోలీస్ పరేడ్ గ్రౌండ్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్,ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు. వేదికకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణగావించినానంతరం జిల్లా ప్రగతిపై ప్రజలకు సందేశం ఇచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లా డుతూ దేశ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి అని, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పోలీసు జాగిలాలచే ప్రదర్శన అనంతరం ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సంబంధించిన శకటాల సందర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా లెజినోవా,లోక్ సభ,రాజ్యసభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం,కర్రి పద్మ శ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య,జగ్గం పేట టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ,పెద్దాపురంశాసన సభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ పట్టణ , గ్రామీణ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు,పంతం నానాజీ, ప్రత్తిపాడు శాసన సభ్యులు సత్య ప్రభలతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డిఆర్ఓ డాక్టర్ పి తిప్పే నాయక్ కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు వివిధశాఖల జిల్లా అధికారులు,ప్రజా ప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శకటాల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వారికి, సాంస్కృతికకార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్‌ల చేతుల మీదుగా అందజేశారు. తదుపరి జిల్లాలో ఉత్తమ సేవలను అందించిన 242 మంది అధికారులు,సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

# పేదరిక నిర్మూలనకు చర్యలు: మంత్రి పార్ధసారధి



**ఏలూరు, ఆగస్టు 15:** వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగు ణంగా పేదరిక నిర్మూలన, రైతు సంక్షేమం, సాగునీటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల మేరకు అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో 71,910 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, 44,114కుటుంబాలను 4,853 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద రూ.106.29 కోట్ల పెట్టుబడి సాయం అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ట్రైనీ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, డీఆర్వో ఎం. శ్రీదేవి, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యం
### ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ద్వారా 610 మెగావాట్లు: సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఎస్పిడిసిఎల్)లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ అనంతరం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ భారతదేశం కోసం అసువులు బాసిన మహనీయుల అడుగుజాడల్లో నడుచుకుంటూ వారి ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. సంస్థ పరిధిలో 415 మెగావాట్ల సామర్థంతో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటులో భాగంగా, ఇప్పటివరకు 214 మెగావాట్ల సామర్థంతో 1.06 లక్షల గృహాలపై సోలార్ వ్యవస్థలను అమర్చామన్నారు. ఈ పనుల్లో భాగంగా నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ(ఎంఎన్ఆర్ఇ) గణాంకాల మేరకు రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థల్లో 50 వేల సర్వీసులను గ్రిడ్ కు అనుసంధానం చేసిన తొలివిద్యుత్ పంపిణీ సంస్థగా ఎపిఎస్పిడిసిఎల్ నిలవడం గొప్ప విషయమన్నారు. సంస్థ పరిధిలో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ద్వారా 610 మెగావాట్ల సామర్థంతో 1.35 లక్షల పంపుసెట్లకు. సౌర విద్యుత్తు సరఫరా పనులు త్వరితగతిన జరుగుతున్నాయని, అలాగే కుప్పం నియోజకవర్గంలో ఈ పథకంలో భాగంగా 32,106 పంపుసెట్లకు సోలార్ ప్లాంట్ల పనులను పూర్తి చేయడంతో 141 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు సిహెచ్ రామచంద్ర రావు, జె. రమణాదేవి, ఎం. మురళీ కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జాయింట్ సెక్రటరీ యం. గోపాలకృష్ణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, సిజిఆర్ఎఫ్ చైర్పర్సన్ ఎ. శ్రీనివాస అంజనేయమూర్తి, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కౌసర్ బానో జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బందికి మరియు ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు, యోధులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈడీ కౌసర్ బానో మాట్లాడుతూ మనమందరం ఈనాడు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహానుభావుల, స్వాతంత్ర్య సమరయోధుల నిస్వార్థ త్యాగాల ఫలితమేనని గుర్తుచేశారు. విపత్తుల నిర్వహణ సంస్థ ద్వారా నిరంతరం ప్రజలకు సేవలందించడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. నిరంతరం సేవా దృక్పథంతో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న విపత్తుల నిర్వహణ సంస్థ ఉద్యోగులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

## లలితా జ్యువెలరీ ఐపిఓకు రంగం సిద్ధం
### రూ.1,700 కోట్ల సమీకరణ లక్ష్యం




**విశాఖపట్నం, ఆగస్టు 15, ప్రభాత వార్త:** లలితా జ్యువెలరీ మార్ట్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రంగం సిద్ధమైంది. ఆగస్టు 17న ప్రారంభమయ్యే ఐపీఓ ఆగస్టు 19న ముగియనుంది. ఒక్కో రూ.5 ముఖ విలువ గల ఈక్విటీ షేరుకు రూ.190 నుంచి రూ.201 వరకు ధరల శ్రేణిని కంపెనీ ఖరారు చేసింది. కనీసం 74 షేర్లకు, ఆ తర్వాత 74 షేర్ల గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,200 కోట్ల వరకు తాజా షేర్లను జారీ చేయనుండగా, ప్రమోటర్ ఎం. కిరణ్ కుమార్ జైన్ రూ.500 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. మొత్తంగా రూ.1,700 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.'లలిత' బ్రాండ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థకు దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి ప్రాంతాల్లో 51 నగరాల్లో 61 స్టోర్లు ఉన్నాయి. వీటిలో 45 స్టోర్లు టైర్2, టైర్3 నగరాల్లోనే ఉండటం విశేషం. బంగారం, వెండి, వజ్రాల ఆభరణాలను పోటీ ధరలకు అందిస్తూ సంస్థ దక్షిణ భారత మార్కెట్‌లో విస్తరణపై దృష్టి సారిస్తోంది.2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.25,023.93 కోట్ల ఆదాయం ఆర్జించగా, నికర లాభం రూ.1,009.82 కోట్లుగా నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం, లాభాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది. చెన్నైలోని తిరుముడివాక్కం, కాంచీపురంలోని మరై మలైలో కంపెనీకి రెండు తయారీ కేంద్రాలు ఉన్నాయి. నాణ్యత, డిజైన్, పోటీ ధరలతో వినియోగదారులను ఆకర్షించడంతో పాటు కొత్త మార్కెట్లలో స్టోర్ల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది.ఐపీఓలో నికర ఆఫర్‌లో 50 శాతానికి మించకుండా అర్హతగల సంస్థాగత పెట్టుబడిదారులకు, కనీసం 15 శాతం సంస్థాగతేతర బిడ్డర్లకు,కనీసం 35శాతం రిటైల్ పెట్టుబడిదారులకు కేటాయింపు ఉంటుంది. ఆగస్టు 9, 2026న రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను కంపెనీ దాఖలు చేసింది.



## బొబ్బిలిలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్'
### ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన

**విజయనగరం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'బొబ్బిలి వీణ' తయారీకి కావలసిన ముడిసరుకు(పనస కలప) కొరతను గురించి రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) తీసుకువెళ్లిన సంగతి మనందరికీ విదితమే. కళలు, కళాకారులపట్ల ఎంతో గౌరవం కలిగిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే స్పందించి, అటవీ శాఖ అధికారులతో చర్చించి 'బొబ్బిలి వీణ'ల తయారీకి కావలసిన ముడిసరుకును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న పనసకలపను సేకరించి వీణల తయారీ కేంద్రాలకి సరఫరా చేయనున్నారు. అందులో భాగంగా, శనివారం బొబ్బిలి పట్టణం, గొల్లపల్లి గ్రామంలో ఉన్న వీణల తయారీ కేంద్రంలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్' ఏర్పాటు చేసి కొంత ముడిసరుకును సరఫరా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, బీజేపీ జిల్లా కార్యదర్శి వేమకోటి గిరిబాబు, టీడీపీనాయకులు, కార్యకర్తలు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



## న్యాయం ఖరీదైన హక్కు కాకూడదు

### హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయం కొందరికి మాత్రమే దక్కే, ఖరీదైన హక్కు కాకూడదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లిసా గిల్ అన్నారు. కుల, మత, వర్గ, లింగ, ఆర్థిక స్థాయిలతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సత్వరమే, సులభంగా అందే హక్కుగా ఉండాలని ఉద్ఘాటించారు. కోర్టులంటే కేవలం ఇటుకలు, రాళ్లతో కట్టిన కట్టడాలు కావని అదొక సజీవ న్యాయ దేవాలయమని స్పష్టంచేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైకోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆమె ఎగురవేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, న్యాయవ్యవస్థలోని మార్పులను జస్టిస్ లిసా గిల్ వివరించారు. జాతీయ జెండా కేవలం గాలికి ఎగరడం లేదన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రతి స్వాతంత్ర్య సమరయోధుని ఆఖరి శ్వాసతో అది సగర్వంగా ఎగురుతోందని గుర్తుచేశారు. అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి ఎందరో మహానుభావులకు రాష్ట్రం పుట్టినిల్లని చెప్పారు.పాత కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూనే, అత్యవసర కేసులను వేగంగా విచారిస్తున్నట్లు జస్టిస్ లిసా గిల్ వెల్లడించారు. సీనియర్ సిటిజన్లు, అణగారిన వర్గాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. అందరి సమష్టి కృషితో రాష్ట్రంలో పెండింగ్ కేసుల సంఖ్యను 2,50,363 నుంచి 2,45,438కి తగ్గించగలిగామన్నారు. కక్షిదారుల మధ్య రాజీకి లీగల్ సర్వీసెస్ అథారిటీ విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకత్వంలో ఖిమీడియేషన్ ఫర్ ది నేషన్ఖి క్యాంపెయిన్ 3.0ను ఈనెల 1న ప్రారంభించినట్లు తెలిపారు. ఏపీ హైకోర్టు కంప్యూటర్ కమిటీ ఆధ్వర్యంలో ఖిఅడ్వకేట్స్ సర్వీసెస్ పోర్టల్ఖిను ప్రారంభించినట్లు జస్టిస్ లిసా గిల్ తెలిపారు. న్యాయ వ్యవస్థ సక్రమంగా నడిచేందుకు హైకోర్టు రిజిస్ట్రీ సిబ్బంది రాత్రి 8 గంటల వరకు శ్రమిస్తున్నారని చెప్పారు. వారి నిస్వార్థ సేవలను కోర్టు అభినందించిందన్నారు. న్యాయవాద వృత్తిలో సీనియర్లు, జూనియర్లకు మార్గదర్శనం చేయాలని జస్టిస్ లిసా గిల్ సూచించారు.

## ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

**విజయవాడ, ఆగస్టు 15, ప్రభాతవార్త ప్రతినిధి:** గుణదలలోని ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ (టెక్నికల్) ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ (ఫైనాన్స్) ఎస్. వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు, ఇతర ఉన్నతాధికా రులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పి. పుల్లారెడ్డి మాట్లాడుతూ, ఏపీసీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ రంగ అభివృద్ధితో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు పలు కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద సుమారు 180 మెగావాట్ల సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వినియోగదారులకు డిస్కం వ్యయంతో సుమారు 2లక్షల ఇళ్లలో 2 కిలోవాట్ల సామర్థం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌వ్యవస్థలను ఏర్పాటుచేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్థలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులు, అధికారులు మరియు సిబ్బందికి సీఎండీ పి. పుల్లారెడ్డి పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ నుంచి ఆన్‌లైన్‌లో విద్యుత్ సరఫరా నియంత్రణ ప్రక్రియను ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని కూడా సీఎండీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతాలకు అతీతంగా జాతీయ పండుగ

### బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** కులమత, ప్రాంతాలకు అతీతంగా జాతీయ పండుగ జరుపుకుంటున్నామని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చినా వందేమాతర గీతం ఆలపించడం ఆగిపోయిందని ఇవాళ ప్రధాని మోదీ వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని తెలిపారు. కొందరు సంకుచిత మతతత్వ ఆలోచనతో ఏ మాతకీ వందనం చెప్పకుండా భీష్మించుకుని కూర్చున్నారని మండిపడ్డారు.అధికారికంగా దేశం మొత్తం వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని మాధవ్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏక్ భారత్ నినాదం తీసుకొచ్చారని అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వంలో టెర్రరిస్టు, మావోయిస్టు కార్యకలాపాలు లేకుండా చేశారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.



## జూనియర్ వైద్యుల మౌన నిరసన

### డిమాండ్ల సాధనపై వెనక్కి తగ్గేది లేదని స్పష్టం

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 15, ప్రభాత వార్త:** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె శనివారం ఆరో రోజుకు చేరింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు వైద్య కళాశాల జూనియర్ వైద్యుల సంఘం, ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు మౌన నిరసన తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి నినాదాలు, ఆందోళన ప్రదర్శనలు నిర్వహించకుండా మౌనంగా నిరసన తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం ఎందరో చేసిన త్యాగాలను స్మరించుకుంటూనే.. వైద్య రంగంలో సేవలందిస్తున్న యువ వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మౌన నిరసన తమ ఉద్యమం నుంచి వెనక్కి తగ్గినట్లు కాదని జూనియర్ వైద్యులు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై సంఘం ప్రతినిధులు, సభ్యులు సమావేశమై చర్చించారు. ఉద్యమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమాలోచనలు చేశారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ గౌరవానికి ప్రాధాన్యమిస్తూ ఈ రోజు మౌనంగా నిరసన తెలిపామని, తమ డిమాండ్ల సాధన కోసం తదుపరి రోజుల్లో కార్యాచరణ కొనసాగిస్తామని జూనియర్ వైద్యులు తెలిపారు.

## హోం శాఖ కొలువుల భర్తీకి వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** హోం శాఖ పరిధిలోని పోలీసు, ఫైర్ సర్వీస్, జైళ్ల శాఖ, ఎస్‌పిఎఫ్, ఫోరెన్సిక్ విభాగాల్లో ఎస్ఐ, ఏ ఎస్ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టుల భర్తీకి ఇటీవల వెలువడ్డ నోటీఫికేషన్‌కు సంబంధించి వయో పరిమితిని రెండేళ్లు పెంచారు. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాస రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# ఇంద్రకీలాద్రి ఇఒకు ఉత్తమ పురస్కారం



కృష్ణానదిలో వరుణమంత్ర పఠనాలు చేస్తున్న ఋత్విక్కులు




మంత్రి లోకేష్ నుంచి ఉత్తమ పురస్కారం అందుకుంటున్న ఇఒ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ వి.కె. సీనా నాయక్‌కు విశిష్ట పురస్కారంను మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శనివారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అందుకున్నారు. దుర్గగుడి ఈఓగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సీనా నాయక్ భక్తుల సౌకర్యార్థం వినూత్నమైన మార్పులు తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇంద్రకీలాద్రిపై రద్దీ నియంత్రణ, నిరంతర భద్రతా పర్యవేక్షణ, శరన్నవరాత్రి ఉత్సవాల ముందస్తు ప్రణాళికలు, మరియు ఆలయ పరిసరాల ఆధునీకరణలో ఆయన చూపిన చొరవను ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించింది. భక్తుల పట్ల కఠినమైన జవాబుదారీతనం అమలు చేయడం, సేవా దృక్పథాన్ని పెంచడంలో ఆయన చేసిన ఉత్తమ పరిపాలనా సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈఓ సీనా నాయక్ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం పట్ల ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది మరియు భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**పంద్రాగస్టు వేడుకల్లో అలరించిన దేవదాయశాఖ శకటం:**
అమరావతి రాజధానిలో శనివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర దేవదాయ శాఖ శకటం అలరించింది. ముఖ్యమంత్రి సమక్షంలో స్వాతంత్ర దినోత్సవకార్యక్రమంలో ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖశకటం ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ నగర్ లో సందర్శకుల సందర్శన నిమిత్తం కొలువుదీరింది.

– అన్నదాన భవనానికి తుదిమెరుగులు:
దుర్గమ్మవారి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ కేంద్రం తుది మెరుగులు దిద్దుకుంటోంది. శరన్నవరాత్రి ఉత్సవాల లోపే భక్తులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు, పాలకమండలితో కలిసి ఇఓ సంయుక్తంగా పరిశీలించారు.





ఉత్తమ ఉద్యోగులకు పురస్కారమందిస్తున్న ఇఓ, చైర్మన్, దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:**
దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బి శిల్ప , బి సనీల వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116విరాళము శనివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారి సేవలో విఐపిలు:**
దుర్గమ్మవారిని శనివారం సినీ నటులు బుల్లి రాజు రేవంత్ మరియు తన చెల్లెలు ఆశ్రిత తల్లిదండ్రులు శ్రీనివాసరావు దేవితో కలిపి శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు. ప్రముఖ హీరోయిన్ శ్రీ లీల శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు.

**ఇంద్రకీలాద్రిపై ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు:**
దుర్గమ్మవారి ఆలయంలో శనివారం ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇఓ వికె శీనా నాయక్ జాతీయ పతాకావిష్కరణ చేసి, ప్రగతి నివేదిక సమర్పించిన అనంతరం 50 మంది సిబ్బందికి ప్రోత్సాహక ప్రశంసా పత్రాల ప్రదానం కార్యక్రమంలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, టి. హరికృష్ణ, టి. రమాదేవి, ఎస్.సరిత, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, ఇంజనీరింగ్ మరియు పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వేదోక్తంగా కొనసాగుతున్న వరుణయాగాలు:**
సకల లోకకల్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఇంద్రకీలాద్రిపై త్రయాహ్నిక "వరుణ యాగములు, వరుణ జపములు" రెండవ రోజు శనివారం వేదోక్తంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాస్నానఘాట్ మరియు పాత యాగశాల వేదికలుగా విశేష పూజలు జరిగాయి.

## ఎర్రకోట వేడుకలకు హాజరుకాని రాహుల్,ఖర్గే

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎర్రకోట వద్ద శనివారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకలకు హాజరుకాలేదు. ఇద్దరూ ఈ వేడుకలకు హాజరుకాకపోవడం వరుసగా ఇది రెండోసారి. ఎర్రకోట వద్ద ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. 80వ ఇండిపెండెన్స్ డే వేడుకలు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగాయి. సాధారణంగా ఈ వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష నేతలు, ఇతర పార్టీల నాయకులు కూడా హాజరవుతారు. గతంలో ఖర్గే, రాహుల్ సహా అగ్రనేతలు హాజరయ్యేవారు. కానీ, గత ఏడాది జరిగిన వేడుకలతోపాటు ఈరోజు జరిగిన వేడుకలకు కూడా ఇద్దరూ హాజరుకాకపోవడం ఆసక్తికరంగా మారింది. అధికారపక్షానికి, ప్రతిపక్షానికి మధ్య దూరం పెరిగింది అనేందుకు ఈ పరిణామం ఒక నిదర్శనం అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య వైరంగా మారిన సంగతి తెలిసిందే. మోడీపై, అమిత్ షాపై రాహుల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాహుల్ ఎర్రకోట వద్ద వేడుకలకు చివరిగా 2024లో హాజరయ్యారు. అప్పట్లో రాహుల్‌కు కేటాయించిన సీటుపై వివాదం నడిచింది. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీకి రెండో వరుసలో సీట్లు కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఇలాంటి వేడుకల్లో ప్రతిపక్ష నేతకు ముందు వరుసలో సీటు కేటాయించాలి. ఆ తర్వాత నుంచి వేడుకలకు ఆయన హాజరవ్వడం లేదు. సాధారణంగా లోక్‌సభ ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ హోదా ఉంటుంది. ప్రోటోకాల్ అనుసరించాలి.

రాహుల్‌కు సీటు కేటాయింపులో ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదు. దీనిపై అప్పట్లో కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఆయనను అవమానించడం అంటే, ప్రజల్ని అవమానించినట్లే అని వ్యాఖ్యానించింది. అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం తమ పంతాలకు ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయాల్ని కాలరాస్తున్నాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.



## కాంగ్రెస్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపనపై విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర దిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా జరిగిన ఒక ఘటనపై స్వల్ప వివాదం మొదలైంది. వందేమాతరం గేయానికి ఇటీవల పూర్తిస్థాయి జాతీయ గేయంగా గౌరవం దక్కింది. జాతీయ గీతానికి ఉన్న గౌరవాన్నే కేంద్రం కల్పించింది. దీంతో తాజా స్వాతంత్ర్య దిన వేడుకల్లో వందేమాతరం ఆలపించడం తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకల సందర్భంగా కూడా వందేమాతరాన్ని నిర్వాహకులు ప్లే చేశారు. అది కూడా పూర్తి గేయాన్ని. అయితే, ఈ గేయం ప్లే అవుతుండగా సోనియా, రాహుల్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా, రాహుల్ కాస్త అటూ, ఇటూ చూడటం చేశారు. దీంతో పూర్తి వందేమాతరం గేయం ప్లే అవ్వకుండా ఆపేయాలంటూ సూచించారు అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో పక్కనే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఉన్నారు. సోనియా, ఖర్గే కాస్సేపు ఏదో చర్చించుకుంటున్నట్లు అక్కడి వీడియోలో కనిపించింది. దీంతో వారు వందేమాతరాన్ని ఆపేయమన్నారంటూ ప్రచారం జరగడంతో ఆ పార్టీ స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఖర్గే చాలాసేపు నిలబడే ఉన్నారు. పెద్దవయసు కావడంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాల్సిందిగా నిర్వాహకులకు సూచించారని, ఆ గేయాన్ని ఆపాలని చెప్పలేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రచారానికి తెరపడింది. వందేమాతరం పూర్తి గేయాన్ని ఈ రోజు అధికారికంగా ఢిల్లీలోని ఎర్రకోటలో ప్లే చేశారు. మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఆర్మీ తమ బ్యాండ్‌తో వందేమాతరం గేయాన్ని ఆలపించింది. ఈ గేయానికి జాతీయ గీతం తరహా హోదా దక్కిన తర్వాత తొలిసారి దేశమంతటా పూర్తి వందేమాతరాన్ని భారతీయులు ఆలపించారు.

### ఇండోనేసియాలో భారీ భూకంపం.. 7.7 తీవ్రత

## 50 మంది మృతి, సునామీ హెచ్చరిక జారీ

**జకార్తా, ఆగస్టు 15:** ఇండొనీసియాలో భారీ భూకంపం సంభవించింది. తూర్పు ఇండొనీసియాలోని ఫ్లొరెస్ దీవి సమీపంలో శనివారం తెల్లవారుజామున 7.7 తీవ్రతతో భారీ భూకంపం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. భూకంపం ధాటికి భవనాలు దెబ్బతినగా 50 మంది మృతి చెందినట్లు, డజన్ల కొద్దీ ప్రజలు గాయపడినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. బలమైన ప్రకంపల నేపథ్యంలో కొద్దిసేపు సునామీ హెచ్చరిక జారీ చేయడంతో వందలాది మంది ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు పరుగులు తీశారు.

**భూకంపం ధాటికి భవనాలకు బీటలు**
అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) ప్రకారం.. ఫ్లొరెస్ దీవి ఉత్తర తీరానికి సమీపంలో భూకంప కేంద్రం నమోదైంది. ఎండె నగరానికి వాయువ్యంగా సుమారు 68 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం చాలా తక్కువ లోతులో సంభవించడంతో ప్రకంపనలు తీవ్రంగా కనిపించాయి. తర్వాత అదే ప్రాంతంలో 6.1 తీవ్రతతో సహా పలు ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం కారణంగా పలు భవనాలు దెబ్బతిన్నాయి. ఆసుపత్రుల్లోని రోగులు సైతం భయంతో బయటకు పరుగులు తీశారు. కొన్ని భవనాల గోడలకు పగుళ్లు ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.

**సునామీ హెచ్చరిక.. వందలాది మంది ప్రజల తరలింపు**
భూకంపం తర్వా ఇండొనీసియా వాతావరణ, వాతావరణ శాస్త్ర, భూభౌతిక సంస్థ (బిఎంకెజి) సునామీ హెచ్చరిక జారీ చేసింది. 0.5 మీటర్ నుంచి 3 మీటర్ల వరకు అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. తూర్పు నుసా తెంగారా, దక్షిణ సులవేసి, పశ్చిమనుసా తెంగారా ప్రాంతాలకు సునామీ ముప్పు ఉండొచ్చని హెచ్చరించారు. దీంతో ఫ్లొరెస్ దీవిలోని మౌమెరె సహా పలు ప్రాంతాల్లో ప్రజలు ఎత్తయిన ప్రదేశాలకు తరలివెళ్లారు. సముద్రం వెనక్కి వెళ్లి దృశ్యాలు కూడా కనిపించినట్లు స్థానికులు తెలిపారు. అయితే కొద్దిసేపటి తర్వాత సునామీ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. భూకంపం కారణంగా ఇద్దరు మృతి చెందినట్లు విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య, భవనాలకు జరిగిన నష్టం తదితర వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఫిన్లాండ్‌లో శిక్షణ

### 17నుంచి 26వరకు 8 రోజులు పర్యటించనున్న ఉపాధ్యాయులు

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను దేశానికే తలమానికంగా తీర్చిదిద్దేందుకు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు విద్యారంగంలో గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దే ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ లో 37మందిని సింగపూర్ పంపించిన రాష్ట్రప్రభుత్వం... తాజాగా మరో 29మందిని ఫిన్లాండ్ పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 17 నుంచి 26వ తేదీ వరకు 8రోజులపాటు ఉత్తమ ఉపాధ్యాయులు ఫిన్లాండ్‌లో పర్యటించనున్నారు. ఫిన్లాండ్ విద్యారంగంలోని ఉత్తమ బోధనా పద్ధతులను అధ్యయనం చేసి, రాష్ట్రంలో సహ ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇచ్చేలా ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేశారు. అంతర్జాతీయ వృత్తిపర అభివృద్ధి కార్యక్రమం పేరిట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక మార్గదర్శక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 2026 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 29 మంది టీచర్లను ఫిన్లాండ్‌లోని టుర్కు విశ్వవిద్యాలయంలో నిర్వహించే ప్రొఫెషనల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ లో పాల్గొనే అవకాశం కల్పించడం ద్వారా వారికి అంతర్జాతీయ అనుభవాన్ని అందించాలని నిర్ణయించారు.

**.ప్రపంచస్థాయి బోధనా పద్ధతులపై అధ్యయనం.**
ప్రపంచ స్థాయి విద్యా విధానాలు, వినూత్న బోధనా పద్ధతులను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడం, తద్వారా రాష్ట్రంలో బోధన, అభ్యసన నాణ్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఫిన్లాండ్‌లోని టుర్కు విశ్వవిద్యాలయంతో కలిసి జాయ్ అండ్ ప్లే పద్ధతి ద్వారా.. ప్రారంభ బాల్య విద్య , ప్రాథమిక విద్య లో వృత్తిపర శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం ఫిన్లాండ్‌లోని అత్యుత్తమ విద్యా వ్యవస్థ ద్వారా మన ఉపాధ్యాయుల వృత్తిపర సామర్థ్యాలను పెంపొందించడంపై దృష్టి సారిస్తుంది. ఇందులో బాలకేంద్రిత అభ్యసన , ఆనందదాయక బోధన , ఆట ఆధారిత విద్య వంటి వినూత్న తరగతి గది బోధనా పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తారు. మూడు దశల్లో ఈ ప్రోగ్రామ్ ను అమలుచేసే విధంగా కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

**మూడు దశల్లో ఉపాధ్యాయులకు శిక్షణ..**
మొదటి దశ ఓరియంటేషన్ విజయవాడలో 4 రోజుల ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. ముగ్గురు ఫిన్నిష్ నిపుణులు ఈ శిక్షణ నిర్వహించారు. ఫిన్నిష్ విద్యా వ్యవస్థ, బోధనా పద్ధతులు, డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ వర్క్, మెంటరింగ్ కార్యకలాపాలను పరిచయం చేశారు.

రెండోదశలో ఫిన్లాండ్‌లో ప్రత్యక్ష కార్యక్రమం (ఆగస్టు 17-26, 2026). ఫిన్లాండ్‌లోని టుర్కు, రౌమాలో 8 రోజుల ప్రత్యక్ష బోధన, అభ్యసన అనుభవాలను అందిస్తారు. తరగతి గదుల పరిశీలన, ప్రదేశ సందర్శనలు, ప్రారంభ బాల్య విద్యా కేంద్రాలు, ఉపాధ్యాయ శిక్షణా పాఠశాలల్లోని విద్యావేత్తలతో సంభాషణలు ఇందులో ఉంటాయి. మూడోదశలో ఆన్‌లైన్ మెంటరింగ్, ప్రాజెక్ట్ మద్దతు ఉంటాయి. శిక్షణ అనంతరం ఆన్‌లైన్ మెంటరింగ్ సెషన్లు. పాఠశాల ఆధారిత ప్రాజెక్టుల అభివృద్ధి, అమలు, బోధన మెరుగుదలపై దృష్టి. విశ్వవిద్యాలయ మెంటర్లు మూడు నిర్మాణాత్మక ఆన్‌లైన్ మెంటరింగ్ సెషన్ల ద్వారా నిరంతర మార్గదర్శనం చేసి, మద్దతు అందిస్తారు.

**కార్యక్రమ ముఖ్య లక్ష్యాలు.** అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విద్యా విధానాలు, బోధనా పద్ధతుల ద్వారా బేసిక్ అభ్యసన సూత్రాలు , విజ్ఞానం , నైపుణ్యాల పై అవగాహనను బలోపేతం చేయడం. అంతర్జాతీయ విద్యా విధానాలు , తరగతి గది వాతావరణాలు సాంస్కృతిక దృక్పథాలపై అవగాహన కల్పించడం. డిజిటల్ సాధనాలు, అభ్యసన వనరులను సమర్థవంతంగా ఉపయోగించడాన్ని పెంపొందించడం. విద్యావేత్తలు, పాఠశాల విద్య లీడర్లలో నాయకత్వం, మెంటరింగ్ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం. అభ్యసన, ఆనందం, శ్రేయస్సును ప్రోత్సహించే వినూత్న పాఠశాల సంస్కృతులను ప్రోత్సహించడం. బాలకేంద్రిత, ఆనందదాయక బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడానికి ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు.

**ఫిన్లాండ్ శిక్షణతో ఉపయోగం ఏమిటి?..**
ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ఫిన్లాండ్‌లోని ప్రారంభ బాల్య విద్య, ప్రాథమిక విద్య (ఫిన్లాండ్‌లో 1 నుండి 6 తరగతులు) విధానంపై పరిచయం పొందుతారు. పాల్గొనేవారు శిక్షణ పూర్తయి స్వస్థలాలకు చేరుకున్నాక తమ సొంత అభివృద్ధి ప్రాజెక్ట్‌ను రూపొందిస్తారు. ఇందులో వారు ఫిన్నిష్ బోధనా విధానాలు, పద్ధతులను పరిశీలించి, వాటిని తమ పాఠశాలలు, తరగతి గదులు, అభ్యసన వాతావరణంలో అమలు చేస్తారు.

కార్యక్రమంలో రూపొందించిన పాఠశాల ఆధారిత అభివృద్ధి ప్రాజెక్టులను పాల్గొనేవారు తొలుత తమ తమ పాఠశాలల్లో అమలు చేస్తారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జిల్లా, మండల స్థాయిలలో తోటి ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్లుగా, మెంటర్లుగా వ్యవహరిస్తారు. ఫిన్నిష్ విద్యా వ్యవస్థ నుండి నేర్చుకున్న ముఖ్య అంశాలను ఆంధ్రప్రదేశ్ విద్యా వాతావరణానికి అనుగుణంగా మార్చి అమలు చేస్తారు.

## మారుపేర్లతో ఒకే వ్యక్తికి బహుళ పాస్‌పోర్టులు

### యుఎస్ కాన్సులేట్ అధికారుల ఫిర్యాదుతో అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 15, ప్రభాతవార్త:** నకిలీ డాక్యుమెంట్లను ఉపయోగించి, మారుపేర్లతో ఒకే వ్యక్తి బహుళ భారతీయ పాస్ పోర్టులను తీసుకున్నాడు. వాటి ద్వారా విదేశీ ప్రయాణాలు సైతం చేశాడు. అమెరికా వీసా దరఖాస్తుల సమయంలో ఒకే వ్యక్తి వేరువేరు పాస్‌పోర్టులను ఉపయోగించడంతో యుఎస్ కాన్సులేట్ అధికారులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నింది తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కోకాపేటలో నివాసం ఉంటున్న మోతుకుపల్లి లక్ష్మీకాంత్‌రెడ్డి(55) అనే వ్యక్తి వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను కలిగి ఉన్నాడని యుఎస్ కాన్సులేట్ అధికారులు గత మార్చి 22వ తేదీన గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశారు. లక్ష్మీకాంత్‌రెడ్డి వేరువేరు పేర్లు, పుట్టినతేదీ, గుర్తింపు వివరాలతో వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను తీసుకోవడంతో పాటు వాటిని అమెరికా వీసా దరఖాస్తు కోసం ఉపయోగించినట్లు యుఎస్ కాన్సులేట్ అధికారులు గుర్తించారు. యుఎస్ కాన్సులేట్ అధికారుల పిర్యాదు ఆధారంగా గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో మోతు కుపల్లి లక్ష్మీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి 1997లో నాంపల్లిలో ఉన్న సమయంలో తాను ఉంటున్న అడ్రస్‌తో చదువు రాదని చెప్పి మేధ ప్రసూన్‌కుమార్ రెడ్డి పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకున్నాడు. 2007లో ఇదే పాస్‌పోర్టు రెన్యూవల్ చేసుకున్నాడు. 2017లో తన అసలు పేరుతో మోతుకుపల్లి లక్ష్మీకాంతరెడ్డి అనే పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకొని కొన్ని రోజులు సదరు పాస్‌పోర్టు మీద అమెరికాకు సైతం వెళ్లి వచ్చాడు. వీటితో పాటు ఇదే వ్యక్తి నకిలీ రెసిడెన్షియల్ సర్టిఫికేట్లు, డేట్ ఆఫ్ భర్త్ సర్టిఫికేట్లు పెట్టి ముద్దనోళ్ల లక్ష్మీకాంత్ పేరుతో మరో పాస్‌పోర్టు సైతం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు సికింద్రాబాద్ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి సదరు పాస్‌పోర్టు దర ఖాస్తు పత్రాలను పోలీసులు సేకరించారు.



లక్ష్మీకాంత్‌రెడ్డి (ఫైల్)




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI No. ARTEL 2004/13724 Editor: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త



# వైన్ షాపులు బంద్ బెల్ట్ షాపులు బరాబరే..

## నిర్లక్ష్యపు నీడలో ఎక్సైజ్ శాఖ

**ప్రభాతవార్త చాట్రాయి**

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వైన్ షాపులు మూసివేయాలని ఉత్తర్వులు ప్రకారం బంద్ చేసినప్పటికీ గ్రామాలలో బెల్ట్ షాపులు యధాతథంగా కొనసాగాయి. ప్రతి గ్రామంలో 10 నుంచి 15 బెల్ట్ షాపులు ఉండటం వల్ల మందు బాబులకు మద్యం కొరత లేకుండా పోయింది. ఎక్సైజ్ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అమ్యమ్యాలు గట్టిగా ముట్టడం వల్లే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రెండు లీటర్లు కాపు సారా దొరికితే విచ్చలవిడిగా హడావిడి చేసే ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈరోజు వైన్ షాప్ బంద్ ఉంటుందని ముందుగానే బెల్ట్ షాపులకు ఒకరోజు ముందుగానే ఆటోలో కావలసినంత సరుకు వైన్ షాప్ యజమానులు సరఫరా చేశారని అందువల్ల మద్యం కొరత రాలేదని పలువురు అంటున్నారు. చాట్రాయి మండలంలో బెల్ట్ షాపులు బడులు పక్కన గుడులు పక్కన నిర్వహిస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు ప్రకారం గుడులకు, బడులకు వైన్ షాపులు ఆమడ దూరంలో షరతు ఉన్నప్పటికీ బెల్ట్ షాపులు ఎలా విధిగా కొనసాగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ ఉన్నతాధికారులు చాట్రాయి మండలం పై దృష్టి సారించి బెల్ట్ షాపులు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.









# సేవలకు గుర్తింపుగా అధికారులకు ప్రశంసా పత్రాలు...



వేలేరుపాడు, ఆగస్టు 15 (ప్రభాత వార్త): 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మండలంలో విశిష్ట సేవలు అందించిన పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రాలను అందుకున్నారు.మండలంలో ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో తహసీల్దార్ ఎన్. శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి శ్రీహరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ ఆశ,పంచాయతీ కార్యదర్శి డేవిడ్ తదితరులు ఉన్నారు.ప్రజా సేవలో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్న ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన అధికారులను వారి సిబ్బంది అభినందించారు. సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలు అందుకోవడం పట్ల మండల ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.

# ఏ దేశమేగినా.. ఎందుకు కాలిడినా...

- పొగడరా నీ తల్లి భూమి భారతిని... యమ్ ఏ షరీఫ్
- నరసాపురంలో భారీ 500 అడుగుల తిరంగా ర్యాలీ

**నరసాపురం ఆగస్టు 15 ప్రభాతవార్త** మహనీయుడు గురజాడ చెప్పినట్లు ఏ దేశంలో ఉన్న భరతమాత గొప్పతనాన్ని చాటి చెప్పాలని అంతటి పుణ్యభూమి భారతావని అని ఏపీ ప్రభుత్వ సలహాదారు టిడిపి పోలీసు బ్యూరో సభ్యులు ఎంఏ షరీఫ్ అన్నారు. నరసాపురం పట్టణంలోని స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముస్లిం మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు ఎం.ఏ. షరీఫ్ పాల్గొన్నగా, తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



**దేశభక్తిని చాటుతూ భారీ తిరంగా ర్యాలీ**

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అనంతరం 500 అడుగుల భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పంజా సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ శివాలయం సెంటర్, అంబేద్కర్ సెంటర్, మొగల్తూరు రోడ్డు, పెద్ద వర్తి రోడ్డు మీదుగా పాదయాత్రగా కొనసాగింది. భారీ జాతీయ జెండాతో సాగిన తిరంగా ర్యాలీ నరసాపురం పట్టణంలో దేశభక్తి భావాన్ని నింపింది. జాతీయ జెండాలు చేతబట్టి, దేశభక్తి నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు, యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ మార్గమంతా ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశ ఐక్యతను చాటేలా కార్యక్రమం సాగింది. దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపైనా ఉందన్నారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రధానంగా యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని, దేశభక్తి, సేవాభావం, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, వాతాడి ఉమామహేశ్వరరావు నరసాపురం మండల పార్టీ అధ్యక్షులు, గుబ్బల నాగరాజు,మొగల్తూరు మండలం అధ్యక్షుల భూపతి నరేష్, అధికార అనంతరామారావు, పొన్నాల నాగబాబు, మౌలాలి ఖాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు, యువత, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం, ఆగస్టు 15 ( ప్రభాత వార్త)** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగా నే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం అంతా అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్చాలని ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో జిల్లా ముందంజలో ఉంటూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుతున్నాయని వివరించారు. మన జిల్లా, రాష్ట్రం, దేశం ప్రపంచంలోనే ఉన్నతమైన గుర్తింపు సాధించేలా అధికారులు కృషి చేయాలని ఆకాంక్షించారు. పతాకావిష్కరణకు ముందు కలెక్టరేట్ ప్రాంగణంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, ఇతర ఉన్నతాధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి డిఆర్ఓ పి. ప్రభాకర్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# కలెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## అతిథిగా హాజరైన మంత్రి నిమ్మల రామానాయుడు



**ఆగస్టు 15, పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో:** భీమవరం కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్‌లో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్--2047' లక్ష్యంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. వ్యవసాయం, జలవనరులు, సంక్షేమం, విద్య, వైద్యం, మౌలిక వసతులు, పర్యాటక రంగాల్లో పశ్చిమ గోదావరి జిల్లా అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. పశ్చిమ డెల్టాలో 4.03 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని, కాలువల ఆధునీకరణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు 'అన్నదాత సుఖీభవ' ద్వారా గత రెండేళ్లలో 1,03,761 మంది రైతులకు రూ. 207.52 కోట్లు అందించామన్నారు. కౌలు రైతులకు 43,338 సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద జిల్లాలో 2,20,227 మంది లబ్ధిదారులకు రూ. 96.02 కోట్లు పంపిణీ చేశామని, మహిళా సంఘాలకు రూ. 269.58 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించామని వెల్లడించారు. దీపం--2 పథకం ద్వారా అర్హులైన మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు చెప్పారు. విద్యారంగంలో 86,258 మంది విద్యార్థులకు ఉచిత విద్యా కానుక కిట్లు, 87,142 మందికి మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. వైద్యరంగంలో 379 హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామని, ఎన్టీఆర్ వైద్యసేవ కింద 7,257 మందికి ఉచిత వైద్యం అందించామని చెప్పారు. జిల్లాలో 10 అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ కింద రూ. 335.75 కోట్లతో 1,488 పనులు చేపట్టి 890 పనులు పూర్తి చేశామన్నారు. పంచాయతీరాజ్ శాఖలో రూ. 310.42 కోట్లతో 1,295 పనులు చేపట్టి 1,111 పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా జిల్లాలో 28 జాబ్ మేళాలు నిర్వహించి 1,589 మందికి ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. పర్యాటక రంగంలో పేరుపాలెం బీచ్‌తో పాటు గోదావరి తీర ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, పచ్చని పంటలు, మత్స్య సంపద, చేనేత, పర్యాటక రంగాలతో పశ్చిమ గోదావరి జిల్లాను మరింత అభివృద్ధి చేసి 'స్వర్ణాంధ్రప్రదేశ్' నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం వివిధ శాఖల్లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, డీఆర్వో పీ. ప్రభాకర్, ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, అధికారులు, ఉద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనకు ప్రణాళికాబద్ధమైన చర్యలు

## స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో మంత్రి పార్థసారథి



**ఏలూరు జిల్లా బ్యూరో ఆగస్టు 15:** వికసిత్ భారత్--స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పేదరిక నిర్మూలన, రైతు సంక్షేమం, సాగునీటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల మేరకు అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తోందన్నారు. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2027 మే నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను కూడా వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ, సామాజిక పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత ఇసుక, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 71,910 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, 44,114 కుటుంబాలను 4,853 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. రైతులకు అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ కింద రూ. 106.29 కోట్ల పెట్టుబడి సాయం అందించామని, సాగునీటి వనరుల అభివృద్ధి, ప్రకృతి వ్యవసాయం, భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద జిల్లాలో 82,443 ఇళ్లు మంజూరు కాగా 46,962 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా 12,774 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్, మనమిత్ర యాప్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేస్తున్నామని మంత్రి తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ట్రైనీ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, డీఆర్వో ఎం. శ్రీదేవి, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, పాల్గొన్నారు.

# వికసిత్ భారత్--2047 సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి: శ్రీనివాస వర్మ



**భీమవరం, ఆగస్టు 15 ప్రభాతవార్త** న్యూఢిల్లీలోని అశోకా రోడ్, నంబర్ 15లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అధికారిక నివాసంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతంతో పాటు 'వందేమాతరం' పూర్తి గీతాన్ని సగర్వంగా ఆలపించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అసమాన త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను, వారి పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన పవిత్ర దినమిదని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ భారత్ నేడు ప్రపంచంలోనే ఒక బలమైన శక్తిగా ఎదుగుతోందని శ్రీనివాస వర్మ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్--2047' లక్ష్య సాధన దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తోందని, ఈ మహత్తర సంకల్పాన్ని సాకారం చేయడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు. దేశ రక్షణను తమ ధ్యేయంగా భావిస్తూ అహర్నిశలు సేవలందిస్తున్న సీఆర్పీఎఫ్ వీర జవాన్లతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్పీఎఫ్ జవాన్లకు మిఠాయిలు తినిపించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ రక్షణ కోసం తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న జవాన్లను దేశానికి నిజమైన హీరోలుగా ఆయన కొనియాడారు. వీర జవాన్లతో కలిసి గడిపిన ప్రతి క్షణం తనకు ఎంతో ప్రత్యేకమైనదని, వారితో కలిసి తీసుకున్న సెల్ఫీ తన జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో, అంతర్గత భద్రతలో అహర్నిశలు సేవలందిస్తున్న సీఆర్పీఎఫ్ సహా మన భద్రతా బలగాలకు యావత్ దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని ఆయన అన్నారు.

# జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**భీమవరం ఆగస్టు 15 ప్రభాతవార్త** 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఆగస్టు 15, శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీస్ సంప్రదాయ జాతీయగీతాల ఆలాపన నడుమ జాతీయ జెండాను ఎగురవేసి, గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ , మహిళా ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) ఇ.ఇందుమతి , ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# స్ఫూర్తి ప్రదాతలు స్వాతంత్ర సమర త్యాగదనులు

## కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి



**నరసాపురం ఆగస్టు 15 ప్రభాత వార్త** దేశ ప్రజలకు స్వేచ్ఛనిచ్చిన స్వాతంత్ర వేడుక మానవ జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైన పండుగ వేడుకని అంతటి స్వాతంత్రాన్ని తెచ్చి పెట్టిన మహనీయుల త్యాగాన్ని ఎప్పటికీ మరువరాదని మాజీ మంత్రి రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. స్థానిక గోగులమ్మ తల్లి ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచారు. అనంతరం తన అభిమానులతో కూడి నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సెంటర్లో అంబేద్కర్ గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్రం అనేది ప్రతి వ్యక్తికి కూడా ఎంతో ముఖ్యమైన వేడుకని ఈరోజు వంటి గొప్ప రోజు మరొకటి ఉండదన్నారు. అల్లూరి భగత్ సింగ్ వంటి మహనీయుల త్యాగాలను విస్మరించరాదన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని మాజీ ఏఎంసీ చైర్మన్ దొండపాటి స్వాములు ఆయన అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర సాధన కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే నాయకర్



**నరసాపురం ఆగస్టు 15 ప్రభాతవార్త** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, వలందర రేవు వద్ద మరియు సీతారామపురంలోని లేస్ ఫ్యాక్టరీలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అలాగే వికసిత్ భారత్--2047 లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "స్వర్ణాంధ్ర 2047" విజన్‌తో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, పారదర్శక పాలన, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల బలోపేతం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల ద్వారా స్వర్ణాంధ్ర నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని కాపాడుతూ, భావితరాలకు అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను అందించడమే స్వర్ణాంధ్ర--2047 లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తితో మహిళలకు ఆర్థిక భరోసా..

## ఏడాదిలో 70 కోట్ల మంది మహిళల ఉచిత ఆర్టీసీ ప్రయాణం -- ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రి నిమ్మల.



**పాలకొల్లు: ఆగస్టు 15 ప్రభాతవార్త** మహిళల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్రంలో ఏడాది కాలంలో 70 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. స్త్రీ శక్తి పథకం అమలుకు ఏడాది పూర్తయిన సందర్భంగా పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామం నుంచి పాలకొల్లు ఆర్టీసీ బస్టాండ్ వరకు బస్సులో మహిళలతో కలిసి మంత్రి ప్రయాణించారు. శివదేవుని చిక్కాల గ్రామం నుంచి బయలుదేరిన బస్సు బల్లిపాడు, దగ్గులూరు, లంకలకోడేరు, భగ్గేశ్వరం, పూలపల్లి గ్రామాల మీదుగా పాలకొల్లు చేరుకుంది. ప్రతి గ్రామంలోనూ మంత్రి నిమ్మలకు మహిళలు స్వాగతం పలికి హారతులు ఇచ్చారు.పాలకొల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలను పలకరించి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం నుంచి ఆర్థిక సాధికారత వరకు.. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## తణుకు పోస్ట్ ఆఫీస్ లో స్వాతంత్ర దినోత్సవం వేడుకలు



**తణుకు, ఆగస్టు 15 (ప్రభాత వార్త)** తణుకు హెడ్ పోస్ట్ ఆఫీసులో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పోస్ట్ మాస్టర్ చిట్టా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త గోకరాజు రఘురామరాజు, పోస్టల్ డివిజనల్ సీనియర్ సూపరింటెండెంట్ కురువా హరికృష్ణ ప్రధాన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాటల పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ సైనిక పోస్టల్ సిబ్బందిని సత్కరించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాసరావు, తణుకు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జే.వెల్ సత్తిబాబు సత్కరించారు. అసిస్టెంట్ పోస్ట్మాస్టర్ అనంతరం రామకృష్ణ, జీ కరుణ, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కు అవార్డు



**తణుకు,ఆగస్టు 15 (ప్రభాత వార్త)** 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తణుకు డిపో లో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గా అత్యుత్తమ సేవలందిస్తున్న షేక్ లాల్ కు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రం ను రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ద్వారా అందుకున్నారు. డిపో మేనేజర్ వి డి ఎల్ సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి గిరిధర్ కుమార్, జిల్లా కార్గో కమర్షియల్ మేనేజర్ జి ఎల్ పి వి సుబ్బారావు, డిపో మేనేజర్ సుధారాణి, డిపో సిబ్బంది, కార్గో సిబ్బంది లాల్ ని అభినందించారు.

## రావిపాడు లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**అత్తిలి,ఆగస్టు 15 (ప్రభాతవార్త)** పెంటపాడు మండలం, రావిపాడు మోడల్ ప్రైమరీ స్కూల్ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె కాశీ విశ్వనాథం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, టంగుటూరి ప్రకాశం పంతులు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ వారితో పోరాడి మనకు స్వాతంత్ర్యం తెచ్చారని, వారిని ఆదర్శంగా తీసుకుని వారి కష్టాన్ని, కష్టపడే తత్వాన్ని బాల బాలికలు అలవరచుకుని వారి అడుగు జాడల్లో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు ఎస్ఎంసి చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర వేడుకలు



**తణుకు, ఆగస్టు 15 (ప్రభాతవార్త)** 80వ స్వాతం త్ర్య దినోత్సవం సందర్భంగా తణుకు పట్టణ గ్రాండ్ ట్రంక్ న తణుకు స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంఘ గౌరవ అధ్యక్షులు పెంటి యనన లక్ష్మణరావు, కీర్తి శేషపుసాయిలు పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు నాగు మల్లి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కోరుమిల్లి సుబ్బారావు, కోశాధికారి వెండి శ్రీను, తమిరి శ్రీనివాసు, స్వర్ణకార సంఘ కార్యవర్గ సభ్యులు, విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దాతృత్వంలో మంత్రిని ఆదర్శంగా తీసుకున్నా



**చాట్రాయి, ఆగస్టు 15 (ప్రభాతవార్త)** ప్రజలకు ప్రజా సేవ చేయడంతో పాటు ఎన్నో దాతృత్వ కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్న మంత్రి పార్థసారథిని ఆదర్శంగా తీసుకుని తన వంతు సహాయం చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నూజివీడు నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నక్క రాము అన్నారు. 80 స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా చనుబండ హైస్కూల్లో ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కొలుసు పార్థసారథి ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు కొలుసు పెద్దిరెడ్డియ్య చారిటీ ట్రస్ట్ ద్వారా నూజివీడు నియోజకవర్గంలోని అన్ని హైస్కూల్స్ లో పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందించే మహోన్నత కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినందుకు విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఆనాడు మంత్రి స్ఫూర్తితో 10వ తరగతి విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరిగి పోటీ పడే విధంగా ఉత్తమ మార్కులు సాధించిన 10వ తరగతి విద్యార్థులకు మొదటి బహుమతి 5000 రూపాయలు, రెండవ బహుమతి 4000 రూపాయలు, మూడో బహుమతి 3000 రూపాయలు బహుమతి ప్రకటించి ఈరోజు విద్యార్థులకు అందరి సమక్షంలో పంచుగ నగదు బహుమతి అందించినట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా వచ్చే ఆగస్టు 15 రోజున ఆరో తరగతి నుండి టెన్త్ క్లాస్ వరకు అన్ని క్లాసుల్లో 100 పర్సెంట్ హాజరు నమోదు చేసుకునే విద్యార్థికి వెయ్యి రూపాయలు చొప్పున అందిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కుంచం కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు వీరగాని మారేశ్వరరావు, బిజెపి నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు . ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహనీయుల మార్గదర్శకాలతో ముందుకు సాగుదాం

**- ఎంపీపీ లంకా నిర్మల**




**చాట్రాయి, ఆగస్టు 15, ప్రభాతవార్త** ఎందరో మహనీయులు స్వాతంత్ర సమరంలో పాల్గొని ప్రాణాలర్పించారని వారికి గల దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మండల పరిషత్ అధ్యక్షురాలు లంకా నిర్మల అన్నారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి దేశభక్తి ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. చాట్రాయి భారతీయ స్టేట్ బ్యాంకులో బ్రాంచ్ మేనేజర్ కిరణ్ కుమార్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ దేశం పట్ల ప్రతి ఒక్కరికి గౌరవం భక్తి ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయులను ఎప్పటికీ మరవరాదని వారి జీవిత ఆశయాలను అనుసరించాలని ప్రతి ఒక్కరూ మెలగాలని ఆయన ఉద్బోధించారు. చాట్రాయి సంఘంలో అధ్యక్షుడు తుమ్మల రాంబాబు జెండా ఆవిష్కరించారు. చాట్రాయి సచివాలయంలో స్పెషలాఫీసర్ బి.శివశంకర్ జెండా ఆవిష్కరించగా, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఆరుగొలనుపేట లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జగాని వెంకటేశ్వరరావు స్వతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. మండలంలో దాదాపు అన్ని గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయులకు నివాళు లర్పించారు.

## మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది,-ఎమ్మెల్యే పితాని




**పెనుమంట్ర, ఆగస్టు-15, (ప్రభాతవార్త)** మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మహిళా సంఘాలే ఆర్థిక సాధికారతకు పునాదిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మండలంలోని మార్టేరులో శ్రీ వేణుగోపాల ఆడిటోరియంలో శనివారం ఆచంట నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాలకు, డీఆర్డీఏ-వెలుగు సిబ్బంది అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటి పథకాలతో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు అందించి మహిళలను ఆర్థికంగా స్వావలంబన సాధించేలా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు రుణాలను సకాలంలో చెల్లిస్తూ బ్యాంకుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, డీఆర్డీఏ-వెలుగు కార్యక్రమాల అమలులో కృషి చేస్తున్న సిబ్బందిని అభినందించారు. మహిళా సంఘాలు, మహిళలు, కూటమి నాయకులు, ఐకేపీ సిబ్బంది, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సిబ్బంది చేస్తున్న కృషిని ప్రశంసించారు.

## మార్టేరులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**పెనుమంట్ర, ఆగస్టు-15, (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలమూరు నుంచి మార్టేరు వరకు మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. మార్టేరు సెంటర్లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పితాని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశ అభివృద్ధిలో యువతతో పాటు ప్రతి పౌరుడు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**అత్తిలి, ఆగస్టు 15 (ప్రభాతవార్త)** అత్తిలి మండలంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల సంఘం వద్ద సంఘ అధ్యక్షుడు వెంకటరావు ప్రసాద్ రావు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దేశ నాయకులు చేసిన త్యాగాలను ఆయన గుర్తు చేశారు. సంఘ కార్యదర్శి వి. బ్రహ్మాజీ, రిటైర్డ్ సిఐ వెంకట్రావు, మాట్లాడారు. సంఘ నాయకులు సీతాల వెంకటనారాయణ, పంజా ఏర ప్రసాద్, ఏ. శ్రీనివాసరావు, దాసం సత్యవతి, డి ఎం జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక పూజలు..

**-ఆధ్యాత్మిక శోభతో ద్వారకా తిరుమల-వర్షాలు సమృద్ధిగా కురవాలి - ఎమ్మెల్యే మద్దిపాటి**



**ద్వారకా తిరుమల,జులై 15 ప్రభాతవార్త :** ఏలూరు జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమలలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో లోకకల్యాణం, సకాలంలో వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.వేద పండితుల వేదఘోష, మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.ఈ పవిత్ర కార్యక్రమానికి గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే కూటమి నాయకులు సైతం కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని, ఇది ఇలాగే ఉంటే త్రాగునీరుకి కూడా మరెన్నో ఇబ్బందులు వస్తాయని, అందువల్ల ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వలన వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా భగవంతుని అనుగ్రహాన్ని కోరుకోవడం మన సాంప్రదాయమని ,వరుణ దేవుని కృపతో సమృద్ధిగా వర్షాలు కురవాలని శ్రీ మల్లికార్జున స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని.. రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ వెంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, అర్చక స్వాములు, వేద పండితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.వేదఘోషలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం.. శివనామస్మరణతో పరవశించిన భక్తులు.. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ద్వారకా తిరుమలలో భక్తి భావాన్ని మరింత పెంచింది.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో న్యాయమూర్తులు



**నరసాపురం ఆగస్టు 15 ప్రభాతవార్త** 80వ స్వాతంత్ర దినోత్సవం సదర్భంగా నరసాపురం కోర్టు ప్రాంగణంలో 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి ముందుగా జాతిపిత మహాత్మా గాంధీజీ , రాజ్యాంగ పితామహుడు డా బి. ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణంలో స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులతో కలసి న్యాయమూర్తులు వానమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చినమామిడిపల్లి మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులకు న్యాయ సేవా సంస్థ నిర్వహించిన వ్యాసరచ పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు న్యాయమూర్తి ఎ. వాసంతి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఎస్. రాజ్యలక్ష్మిబార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. జ్ఞానానంద్, జనరల్ సెక్రెటరీ కె . సోమ శేఖర్, నాలుగు కోర్టుల సూపరింటెండెంట్ లు జె . సోమేశ్వరరావు, పి. కామేశ్వరి, ఆర్. సుధాకరరావు, ఎస్. మల్లేశ్వర గుప్త, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పోలీసులు, పాల్గొన్నారు.

## జాతీయ స్ఫూర్తిని చాటిన స్వాతంత్ర్య వేడుకలు



**జీలుగుమిల్లి, ఆగస్టు 15 (ప్రభాతవార్త):** దేశభక్తి భావం ఉప్పొంగింది.. జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసింది.. జీలుగుమిల్లి మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. గ్రామగ్రామాన మువ్వన్నెల జెండాలు రెపరెపలాడగా, విద్యార్థుల దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.స్వాతంత్ర్య సమరంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను పలువురు వక్తలు స్మరించుకున్నారు. మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.మండలంలోని బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ వెంకటేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోచమ్మ, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ మణికంతేశ్వర్, ఎంపీపీ పాఠశాల మెయిన్‌లో పాఠశాల స్థలదాత చాట్రాతి భవాని శేఖర్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.జీలుగుమిల్లి పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పంచాయతీ కార్యదర్శి చైతన్యతో పాటు బీజేపీ నాయకులు చాట్రాతి ప్రసాద్, గుడ్ల రాంబాబు, కొండపల్లి ప్రసాద్, వీరభత్తుల ధనుంజయ, సన్న మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కోల మధు తదితరులు పాల్గొన్నారు.మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, గ్రామ సచివాలయాల్లోనూ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మొత్తం మండలం మువ్వన్నెల రంగుల్లో మురిసిపోయింది.

## దేశ నాయకుల త్యాగాలు మరువద్దు



**అత్తిలి ఆగస్టు 15 (ప్రభాత వార్త )** స్వాతంత్ర సమూపార్జన కోసం త్యాగం చేసిన మహనీయులను మరిచిపోరాదని అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యరావు అన్నారు. అత్తిలి ఎంపీడీవో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి అందేలా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు , కార్యదర్శి ఆల్తి అజయ్, ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ ఆల్తి సత్యనారాయణ, మాజీ ఎంపిపి కేతా సత్యనారాయణ, నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరు సురేష్, మండల ఉపాధ్యక్షులు కొనకళ్ళ విజయనిర్మల, సుంకర నాగేశ్వరరావు, బోడపాటి సూర్యచంద్రరావు కొరిపల్లి హరి, సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి గోపికృష్ణ, ఎంపీడీవో అన్నపూర్ణేశ్వరి తదితరులు పాల్గొన్నారు. తాసిల్దారు కార్యాలయం వద్ద : అత్తిలి తాసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ పద్మావతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ మక్కా సూర్యారావు, పోలిశెట్టి రంగారావు, బిజెపి అధ్యక్షుడు మామిడి శెట్టి నాగబాబు, ఆనాల ఆదినారాయణరావు, డి .టి కాళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘ భవనం వద్ద: అత్తిలి ఆర్యవైశ్య యువజన సంఘం వద్ద స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా సంఘ అధ్యక్షులు చిన్నం లక్ష్మణరావు చే, జాతీయపతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమములో, కార్యదర్శి సన్నిధి సూర్యనారాయణ గుప్త కోశాధికారి పులవర్తి వెంకటేశ్వరరావు సంఘ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీ నర్సాపురం లోఘనంగా ఆగస్టు 15 పండుగ



**టి నర్సాపురం ఆగస్టు 15 ప్రభాతవార్త** 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు టీ నర్సాపురం మండలంలోవాడవాడలా ఘనంగా జరిగాయి .టీ నర్సాపురంలో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఆర్యవైశ్య సంఘం మరియు గ్రామస్తులు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు .మండలఆర్యవై శ్య యువజన సంఘ అధ్యక్షులుపసుమర్తి రాము మాట్లాడుతూ ఈ దేశాన్ని బానిసత్వం నుండి విముక్తి చేసినటువంటి మహా పురుషులు మహాత్మా గాంధీ అన్నారు .అనంతరం మండల తహసిల్దార్ ఆఫీస్ లోను మండల పరిషత్ ఆఫీసులోనూ ఆగస్టు 15 ఉత్సవాలు జరిగాయి.ఈ సందర్భంగా మండల తహసిల్దార్ మాట్లాడుతూఎందరో త్యాగాల ఫలితమే ఆగస్టు 15 పండుగ వచ్చిందన్నారు.గ. గాంధీ సుభాష్ చంద్రబోస్ భగత్ సింగ్ చాచా నెహ్రూ వంటి వారు ఎందరోస్వాతంత్రం కోసం పోరాడనన్నారు.వారి త్యాగపలితమే స్వాతంత్ర్యం వచ్చింది అన్నారు. కె .జగ్గవరం హైస్కూల్లో జరిగినటువంటి కార్యక్రమంలో జయవరపు శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ బనియన్లు అందజేశారు.టి. నరసాపురం మెయిన్ సెంటర్ లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 పండుగ జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగినఈ కార్యక్రమాల్లో నాయుడు రామకృష్ణ గౌడ్ ప్రసంగించారు.ఎందరో త్యాగమూర్తుల త్యాగ ఫలితమే ఈ స్వాతంత్రం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎంఈఓరామ్మూర్తివిజన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులుడాన్స్ ప్రోగ్రాం ఆగట్టుకున్నారు.పలువురు మండల రెవెన్యూ సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ సబ్ ఇన్స్పెక్టర్ గా రామకృష్ణ

**- మంత్రి పార్థసారథి చేతుల మీదుగా అవార్డు**



**చాట్రాయి, ఆగస్టు 15, ప్రభాతవార్త** ఏలూరు జిల్లాలో ఉత్తమ సబ్ ఇన్స్పెక్టర్ గా రామకృష్ణ కు అవార్డు లభించింది. చాట్రాయిలో గత కొంతకాలంగా చాట్రాయి సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామకృష్ణ ఇటీవల కొన్ని భారీ చోరీ కేసులను చేదించి నింతులను అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర వహించారు. ఆ కేసులలో ఆయన చూపిన శ్రద్ధ,ధైర్య సాహసాలు, వృత్తిలో నిబద్ధతను గుర్తించిన ఉన్నతాధికారులు ఆయనకు అవార్డు ఇచ్చే విధంగా దోహద పడింది. దీనితో 80 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్ సైతం గుర్తించి అవార్డు అందజేయడం ఆనందంగా ఉందని చెప్పారు. అవార్డు వల్ల తన బాధ్యతను మరింత పెంచుతున్నట్లు ఆయన భావిస్తున్నానని చెప్పారు. భవిష్యత్తులో మరింత అంకితభావంతో పనిచేసి ఉన్నతాధికారులుతో ప్రశంసలు పొందుతానని చెప్పారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ తన వృత్తి ధర్మాన్ని గౌరవిస్తూ బాధ్యతలు నిర్వహిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఎస్పీ, నూజివీడు డిఎస్పి, సర్కిల్ ఇన్స్పెక్టర్లకు ధన్యవాదాలు తెలియజేశారు.

## పాలూరు సొసైటీ సీఈఓ కు అవార్డు



**అత్తిలి,ఆగస్టు 15 (ప్రభాత వార్త)** స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా భీమవరంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదగా ఉత్తమ సేవ పురస్కారాన్ని పాలూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సీఈవో మంతెన నాగ శ్రీరామరాజు అందుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు అల్లూరి ధన రాజు పాలకవర్గ సభ్యులు , సిబ్బంది, మూడు గ్రామాల రైతులు సి ఈ ఓ శ్రీరామరాజును అభినందించారు.

## ఇరగ వరం లో స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలు



**ఇరగవరం, ఆగస్టు 15 (ప్రభాతవార్త )** ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇరగవరం ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో ఏ శ్రీనివాసు కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అనూషకి బెస్ట్ సేవ అవార్డు



**ఆగిరిపల్లి ఆగస్టు 15 ప్రభాతవార్త** మండల పరిధిలోనిఈదర పీహెచ్ సి నందు ఫాంసిస్ట్ గా చేస్తున్న గజవల్లి అనూష మెరుగైన సేవలు అందించి నందుకు గాను బెస్ట్ ఫార్మసీ ఆఫీసర్ అవార్డును, ప్రశంషా పత్రము అందుకున్నారు. చాట్రాయి మండలం చనుబండ కు చెందిన అనూషను పలువురు అభినందించారు

## స్వతంత్ర వేడుకల్లో పాల్గొన్న బీసీవై పార్టీ అధ్యక్షులు రామకృష్ణ



**కైకలూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త):** మంగళగిరిలోని బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కైకలూరు నియోజకవర్గ బీసీవై పార్టీ అధ్యక్షులు తోకల రామకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని పేర్కొన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయులకు ఘన నివాళులు అర్పిస్తూ, వారి ఆశయాలను నేటి తరాలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.దేశ అభివృద్ధి, సమగ్ర ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని తోకల రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొగల్తూరు మండలంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మొగల్తూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం వాడవాడలా అత్యంత ఘనంగా, దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, పోలీస్‌స్టేషన్‌లు, విద్యుత్‌శాఖ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.మండల కేంద్రమైన మొగల్తూరు ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ కైల సుబ్బారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మొగల్తూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి సిహెచ్. త్రిశూలపాణి, మొగల్తూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఎస్ఐ జి. వాసు, మొగల్తూరు విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద లైన్ ఇన్‌స్పెక్టర్ వి. పెద్దిరాజు, మొగల్తూరు మండల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అహ్మద్ ఫరూక్ తమ సిబ్బందితో కలిసి జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలుచోట్ల విద్యార్థులు దేశభక్తి గీతాలు, వందేమాతరం ఆలపిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. చిన్నారులకు స్వీట్లు, బిస్కెట్లు, పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేసి వారిని అభినందించారు. విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.మొగల్తూరు మండలంలోని మొత్తం 17 గ్రామపంచాయతీల్లో ఆయా ప్రత్యేక అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఉత్తమ సేవలకు ఉద్యోగులకు అవార్డులుఇదిలా ఉండగా, వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ (వీబీఆర్‌ఎంజీ) ఉపాధి హామీ పథకంలో ఉత్తమ సేవలు అందించిన మొగల్తూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది వర్ధనపు ఆనంద్‌లు జిల్లా స్థాయిలో అవార్డులు అందుకోవడం పట్ల మొగల్తూరు మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం పట్ల ఎంపీడీవో సిహెచ్. త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపీడీవో మేడిద నవీన్ కిరణ్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్.ఎస్. శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మారంపూడి మౌనిక, జూనియర్ అసిస్టెంట్ మోకా శ్రీనివాసరావుతో పాటు సహచర ఉద్యోగులు వారిని ప్రత్యేకంగా అభినందించారు.ప్రభుత్వ పథకాల అమలులో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులను అధికారులు, సహచర సిబ్బంది అభినందించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు ఉద్యోగుల ప్రతిభకు గుర్తింపు లభించడం వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకువచ్చింది. మండలవ్యాప్తంగా జరిగిన ఈ వేడుకలు దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.

## విద్యుత్ శాఖ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**మొగల్తూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ వి. పెద్దిరాజు జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం లభించిన చారిత్రక ప్రాధాన్యతను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వివరించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన జూనియర్ అసిస్టెంట్ బి. శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ వి. మాధవరావు, జేఎల్‌ఎం ఎల్.టి. సూరిబాబు, జేఎల్‌ఎం బాబ్జీలను అభినందించారు. వీరు పశ్చిమగోదావరి జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఉషారాణి చేతుల మీదుగా భీమవరం జిల్లా కేంద్రంలో అవార్డులు అందుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.అనంతరం పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు, పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, మొగల్తూరు కోట వద్ద ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహశీల్దార్ సంతకం ఫోర్జరీ కేసులో నలుగురు అరెస్ట్



**మొగల్తూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త):** మొగల్తూరు మండల డిప్యూటీ తహశీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి, ఆ సంతకంతో భూమి రిజిస్ట్రేషన్‌కు వినియోగించిన ఆరోపణలపై నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నరసాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగరాజు తెలిపారు. శనివారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.సీఐ కథనం ప్రకారం.. మొగల్తూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న దువ్వూరి సుగుణ సంధ్య సంతకాన్ని ఫోర్జరీ చేసి, ఆ పత్రాలను ఉపయోగించి మొగల్తూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఫిర్యాదు అందింది. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసుతో సంబంధం ఉన్న మొగల్తూరు గ్రామానికి చెందిన జంపా వెంకట నాగ శివ అంజనేయులు, జంపా శ్రీనివాస్, కనయ్యగూడెంకు చెందిన కడలి నాగేంద్ర కుమార్ అలియాస్ చైనా నాగేంద్ర, ముత్యాలపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న బస్వాని రాజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.ఈ కేసులో నేరానికి వినియోగించినట్లు భావిస్తున్న ఒక కంప్యూటర్, సీపీయూ, మానిటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. అరెస్ట్ చేసిన నిందితులను తదుపరి న్యాయపరమైన చర్యల నిమిత్తం కోర్టు ముందు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.తప్పుడు పద్ధతుల్లో ప్రభుత్వ ధ్రువపత్రాలను పొందడం, వాటిని భూ లావాదేవీలకు వినియోగించడం తీవ్రమైన నేరమని సీఐ నాగరాజు హెచ్చరించారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మొగల్తూరు ఎస్ఐ జి. వాసు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక ఆర్థిక సమానత్వ సాధన దిశగా పాలన ఉండాలి : భీమారావు కోనాల



**భీమవరం టౌన్,ఆగస్టు 15 : ప్రభాతవార్త** అందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం సాధించే దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలని సిపిఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీపీఐ ఆధ్వర్యం లో భీమవరం శ్రీనివాస సెంటర్‌లోని సీపీఐ స్థూపం వద్ద జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంద ర్భంగా కోనాల జాతీ య పతాకాన్ని ఎగురవే శారు. అనంతరం ఆయన మాట్లా డుతూ, ఎంతోమంది త్యాగధనుల పోరాటాల, ప్రాణ త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్వాతం త్ర్యాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పైనా ఉందన్నారు. స్వాతంత్ర్య సమర యోధులు కలలుగన్న సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.దేశంలో మతం, కులం పేరుతో ప్రజల మధ్య విభజనలు సృష్టించే విధానాలకు స్వస్తి పలకాలని, ప్రాంతీయ వివక్ష, లింగ వివక్షకు తావులేని సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.పేదరికం, దారిద్ర్యం, నిరుద్యోగం, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రజలందరూ ఐక్యంగా నిరంతరం కృషి చేయాలని భీమారావు పిలు పునిచ్చారు.స్వాతంత్ర్యం కేవలం జెండా ఎగుర వేయడంతో పూర్తికాదని, ప్రతిపౌరుడికి స్వేచ్ఛ, సమాన త్వం, సామాజికన్యాయం, గౌరవప్రద మైన జీవనం లభించినప్పుడే స్వాతంత్ర్యానికి నిజ మైన అర్థం చేకూరు తుందని అన్నా రు.స మా నత్వం,సామాజిక న్యాయం లక్ష్యంగా ఉద్య మిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్ర మం లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయి న రంగారావు, ఎం. సీతారాం ప్రసాద్, జిల్లా సమి తి సభ్య లు నాగిడి శాంతమూర్తి, కిలారి మల్లే శ్వర రావు, మల్లుల శ్రీనివాస్, ప్రజా సం ఘాల నాయకులు మోకా నరశింహమూర్తి, పోతుల యాకోబు, పాలా త్రిమూర్తులు తదిత రు లు పాల్గొన్నారు.

## బల్లిపాడు లో స్వాతం త్ర్య దినోత్సవ వేడుక లు



**అత్తిలి,ఆగస్టు 15 (ప్రభా త వార్త )** బల్లిపాడు గ్రామంలో గ్రామపంచాయతీ వద్ద, సొసైటీ వద్ద, హై స్కూల్,మదన గోపాల స్వామివారి ఆలయంలో జెండా ఆవిష్కరణ జరిపారు. గ్రామ పంచాయతీ వద్ద తహసిల్దార్ కే పద్మావతి జండా ఆవిష్కరణ చేసి గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం చేసారు. కొత్తచెరువు వద్ద మొక్కలను నాటారు గ్రామ జనసేన అధ్యక్షుడు ఆకుల రామచంద్రరావు, గ్రామ టిడిపి అధ్యక్షుడు గారపాటి అశోక్, దేవస్థానం చైర్మన్ బాబ్జి పాల్గొన్నారు.

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**కుక్కునూరు:ఆగస్టు:15( ప్రభాత వార్త)**80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు తహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ చలపతిరావు జండాను ఆవిష్కరించారు స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ బాల సురేష్ జాతీయ జెండాను ఎగరవేశారు ప్రెస్ క్లబ్ లో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కాకల రమణయ్య జాతీయ జెండాను ఎగరవేశారు మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో జాతీయ జెండాలను ఎగరవేసి స్వతంత్ర సమరయోధులు స్మరించుకున్నారు మండల కేంద్రంలో అధికారులు ప్రజాసంఘాల నాయకులు ప్రజలు విద్యార్థిని విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## దేశభక్తతో మంచి పౌరులుగా అభివృద్ధి చెందాలి -ఎస్సై నాగరాజు



**ఆగిరిపల్లి ఆగస్టు 15 ప్రభాతవార్త**దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసి స్వాతంత్రం తెచ్చిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆగిరిపల్లి ఎస్ఐ నాగరాజు అన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందిస్తూ బాధ్యతాయుత పౌరులుగా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా నాగరాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు సిబ్బందితో కలిసి జెండాకు వందనం చేశారు. అనంతరం ఆగిరిపల్లి బస్టాండ్, పెద్ద కొరాయి సెంటర్‌లో టాటా మ్యాజిక్, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని జెండా ఎగురవేసిస్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దేశభక్తి ప్రమశిక్షణ ఆవశ్యకతను తెలియజేశారు.కార్యక్రమాల్లో పోలీసు సిబ్బంది, ఆటో, టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు స్థానిక సెంటర్లో గల గాంధీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద 80 స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఆర్యవైశ్య సంఘ ము నిర్వహించారు గాంధీజీ పొట్టి శ్రీరాములు పటాలకు పూలమాలలు వేసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు వెంకటరత్నం నరసింహ మదుపల్లి గోపాలకృష్ణ ప్రణీత్ రా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీ నిట్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



**తాడేపల్లిగూడెం ఆగస్టు 15 (ప్రభాతవార్త)** స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరు జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డా.జి.రవికిరణ్ శాస్త్రి సూచించారు. ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ డా. ఎన్.వి.రమణారావు ఆధ్వర్యంలో ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ రవికిరణ్ శాస్త్రి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలను ఎదిరించి ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తితో యువత నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. దేశ ప్రగతి రథసారధులు విద్యార్థులేనని, వినూత్న ఆలోచనలు చేస్తూ కొత్త కొత్త ప్రాజెక్టులు, పరిశోధనలు చేపట్టాలని చెప్పారు. ఈ విద్యాలయం ఓ అవకాశాల గని అని, అందులోని విజ్ఞానాన్ని తవ్వి తీసుకున్న వారి జీవితం బంగారుమయం అవుతుందని తెలియజేశారు. స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలర్పించిన మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వివరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీన్ రవి కిరణ్ శాస్త్రి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, అసోసియేట్ డీన్ డా.శివాసన్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన యోగాసనాలు, నృత్యాలు చూపరులను ఎంతగానో అలరించాయి. ముందుగా రవి కిరణ్ శాస్త్రి జాతీయ జెండాను ఆవిష్కరించి సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా.రాజేశ్వర రెడ్డి, ఆచార్యులు డా.పి శంకర్, డా.టి రమేష్, డా.నగేష్ బట్టు, డా.కూర్మయ్య, డా.నరసింహారావు, డా.భరణీ దరన్, డా.కృష్ణ చైతన్య, డా.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న మోటార్ సైకిల్ ర్యాలీ



**తాడేపల్లిగూడెం ఆగస్టు 15 (ప్రభాతవార్త)** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17న తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో జర్నలిస్టుల మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నామని యూనియన్ జిల్లా కార్యదర్శి గజపతి వర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐ.జె.యూ సెక్రటరీ జనరల్ దూసనపూడి సోమసుందర్ హాజరవుతారని చెప్పారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛపై అవగాహన, విలేకరుల సమస్యల పరిష్కారం ప్రధానాంశాలుగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎస్వీఆర్ సర్కిల్ నుంచి మోటార్ సైకిల్ ర్యాలీగా బయలుదేరి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని, ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పెంటపాడు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. 70వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర యూనియన్ నిర్ణయం మేరకు సంవత్సరం పొడవునా 12నెలల పాటు సదస్సులు, సెమినార్లు,జర్నలిస్టుల కోసం మెడికల్ క్యాంపులు, సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు ర్యాలీలో పాల్గొని పత్రికా స్వేచ్ఛకు మద్దతు ఇవ్వాలని కోరారు. 70 ఏళ్లుగా యూనియన్ ప్రధానంగా మూడు అంశాలపై పోరాడుతోందని పత్రికా స్వేచ్ఛను కాపాడటం, పాత్రికేయుల హక్కులను పరిరక్షించడం, పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేయడం యూనియన్ లక్ష్యాలని వివరించారు. అక్రిడిటేషన్, హెల్త్ స్కీములు, జర్నలిస్టుల సంక్షేమం తదితర అంశాల్లో యూనియన్ ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిందని వివరించారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు 5000 రూపాయలు బహుమతి.



**ముదినేపల్లి. ఆగస్టు 15( ప్రభాతవార్త).** ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన నియోజవర్గ తెలుగుదేశం తెలుగు యువత అధ్యక్షుడు దవు నాగరాజు విద్యార్థులకు 5000 రూపాయలు బహుమతి అందించారు. అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగరాజు మండలంలోని మొదటి ర్యాంక్ సాధించిన పంతంగాని మృదుల, ఈద రితికా కి ఒక్కొక్కరికి 5000 అందించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ సాధించి అల్లూరు గ్రామానికి ఇచ్చినందుకు తల్లిదండ్రులకు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి వీళ్ళని ఆదర్శంగా తీసుకొని ఇదేవిధంగా గ్రామ పేరు ప్రతిష్టలు నిలబెట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నరేష్ కుమార్ ,విద్య కమిటీ చైర్మన్ శీలం వెంకటశ్యామల ,కుర్మ లాజరు ,దాసరి శ్రీను, కాసాని బాల యేసు , బొమ్మను బోయిన వెంకటరత్నం ,తోట నాగరాజు, రామ్మోహన్ రావు, కులమట్ల రాము, శీలం సురేష్ , లుక్కా ఫణి మరియు పాఠశాల అధ్యాపకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం

### -జెండా ఆవిష్కరించిన వడ్డి రఘురామ్ నాయుడు



**తాడేపల్లిగూడెం ఆగస్టు 15 (ప్రభాతవార్త)** పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు జాతీయ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనుభావుల ప్రాణత్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని తెలిపారు. ఈ స్వేచ్ఛ స్వాతంత్రాలను ఎల్లప్పుడూ కాపాడుకుంటూ భవిష్యత్ తరాలవారికి స్వాతంత్ర ఫలాలు అందేవిధంగా కృషిచేయాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యానికి అసలైన అర్థం ప్రతి పేదవాడికి గౌరవంగా జీవించే హక్కు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కల్పించడమేనని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చూపించిన "ప్రజల సంక్షేమమే పాలనకు కేంద్రబిందువు" అనే ఆలోచనను వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ ముందుకు తీసుకెళ్తుందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా పేదలు, మహిళలు, రైతులు, విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగిందని గుర్తుచేశారు. సంక్షేమం, సామాజిక న్యాయం, విద్య, వైద్యం, రైతు సంక్షేమం వంటి అంశాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. పేదల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి రెండూ సమాంతరంగా పాలన సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఎద్దేవాచేశారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల సంక్షేమం, రాష్ట్ర హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జడ్పిటిసిలు, ఎంపిటీసీలు, రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ అనుబంధ కమిటీ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కాశిపాడు లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**గణపవరం, ఆగస్టు 15 (ప్రభాతవార్త)** గణపవరం మండలంలోకాశిపాడునెంబర్ 2 మోడల్ ప్రాథమిక పాఠ శాల నా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు చల్లా కృష్ణ పాఠశాల కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని గంటా వీరవేణి ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గణపవరం నంబర్ 1పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం ఎస్ ఎన్ నారాయణ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పిప్పర ఉన్నత పాఠశాలలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

## దుబాయిలో గాయపడిన క్షతగాత్రుని పరామర్శించిన ఎమ్మెల్యే



**అత్తిలి, ఆగస్టు 15 (ప్రభా త వార్త)** అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన వీరవల్లి దుర్గా సాయిరాం దుబాయిలో పనిచేస్తూ దురదృష్టవశాత్తూ ప్రమాదానికి గురై కాలు తొలగించిన విషయాన్ని తెలుసుకుని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి పరామర్శించారు. దుర్గా సాయిరాం కుటుంబానికి ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ఆచంట శెట్టిబలిజ ఐక్య సంఘం సభ్యులను అభినందించారు. రూ. 3.10 లక్షలు కుటుంబ సభ్యులకు అందజేయడం పట్ల కుటుంబ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ మరో రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ ఐక్య సంఘం సభ్యులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వేలేరుపాడులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**వేలేరుపాడు, ఆగస్టు15 (ప్రభాత వార్త):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వేలేరుపాడు మండలంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం,ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిద్ధార్థ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు వివిధ రాజకీయ పార్టీ కార్యాలయాలు, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు.అలాగే మసీదులు, చర్చిలలోనూ జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.డాన్ బాస్కో స్కూల్, క్వీన్ ఎలిజబెత్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు,ర్యాలీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు న్యాయవాది బడిగించల గంగాధర్ పాలు, పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, జనసేన ప్రధాన కార్యదర్శి మాచినేని సంజయ్ తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మ ఆలయంలో 1108 మంది మహిళలచే సహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణం



**భీమవరం ఆగస్టు 15 ప్రభాతవార్త** భగవద్గీత గీతా పఠనం ద్వారా మనిషికి ఆత్మజ్ఞానం, సత్ప్రవర్తన అలవడతాయని, జన్మసాఫల్యం కలుగుతుందని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ఛైర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ డైరెక్టర్ బొండాడ నాగ భూషణం అన్నారు. శ్రీగణపతి సచ్చిదానంద స్వామి వారి అనుగ్రహంతో కోటి సంపూర్ణ భగవద్గీత పారాయణంలో భాగంగా శనివారం భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో 1108 మహిళలచే సహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు వివిఎస్ శర్మ మాట్లాడుతూ భగవద్గీత పారాయణం చేయడం వల్ల మనిషిలో మానసిక ప్రశాంతత, ధైర్యం పెరుగుతాయన్నారు. ఇది నవ సమాజంలో పాపాలను తొలగించి, జీవితంలో సరైన కర్తవ్యాన్ని నిర్దేశించే మార్గాన్ని చూపుతుందన్నారు. 1108 మంది మహిళలచే ముక్త కంఠంతో భగవద్గీత పారాయణం చేయడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, డైరెక్టర్ బొండాడ నాగభూషణం ధర్మకర్తలు రామాయణం శ్రీనివాస్,పుడిని మీనాక్షి,అతికాల అంజనేయ ప్రసాద్,గునిడి నాగశేషు,కారెంపూడి ఆదిలక్ష్మి,అరసవల్లి బాల సుబ్రహ్మణ్యం ,మల్లువలస లక్ష్మి నిర్మల,గొంతిన రమణ,యండ సత్యవతి,ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు,పాపోలు ఏడుకొండలు, ఎక్స్ అఫీషియో మెంబర్ బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పాల్గొన్నారు.

## సమాన అవకాశాలు సామాజిక న్యాయానికి కృషి చేస్తాం: కురిమెళ్ల హరి



**వేలేరుపాడు,ఆగస్టు 15(ప్రభాత వార్త ):** సామాజిక సంక్షేమ అభ్యుదయ సంఘం మరియు (ఫ్రెండ్స్) ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వేలేరుపాడు అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక సంఘ అధ్యక్షులు కురిమెళ్ల హరి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం అందేలా కృషిచేస్తామని తెలిపారు. గ్రామీణ, ఆదివాసీ ప్రజల సంక్షేమానికి నిరంతరం పనిచేస్తామని పేర్కొంటూ మండల ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో (ఫ్రెండ్స్) ఆటో యూనియన్ అధ్యక్షులు కురిమెళ్ళ శ్రీను, లాడే వెంకటేష్, మజ్జి ఫణి, కమ్మిచ్చు రమేష్, మాల మహానాడు ఏలూరు జిల్లా నాయకులు బుడిపిటి జానుబాబు, బుర్రి ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**కాళ్ళ, ఆగస్టు 15 (ప్రభాతవార్త):** మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, సొసైటీలు, గ్రామపంచాయతీలు, పోలీస్‌స్టేషన్, విద్యుత్‌శాఖ కార్యాలయ, విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరిపారు. మండల కేంద్రమైన కాళ్ల సొసైటీ వద్ద సంఘ అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణంరాజు తనయుడు కనుమూరు భరత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ మండల జనసేనపార్టీ యూత్ అధ్యక్షులు మేకా కాశీ చరణ్ ,మండల ఉపాధ్యక్షులు ఓగిరాల రాజేష్ గడి రాము,ప్రధాన కార్యదర్శులు ఇర్రింకి జగన్, ఆరేటి దిలీప్ గారు,కాళ్ళ గ్రామ అధ్యక్షులు బందారు సోమేశ్వరరావు , కొల్లి లక్ష్మణ స్వామి, అధ్యక్షులు తానింకి రాము, పసుపులేటి మహేష్, జనసేన పార్టీ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లోనూ మెరిట్ కాకతీయ విద్యార్థులదే



**భీమవరం టౌన్,ఆగస్టు15 : ప్రభాతవార్త** 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భీమవరం శ్రీ కాకతీయ మెరిట్ స్కూల్ లో అత్యంత దేశభక్తితో, వారసత్వం ఉట్టిపడే వేషధారణలతో, ఉత్సాహ భరిత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.రోజంతా జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రదర్శించిన స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలు, నృత్యాలు మరియు వివిధ కళారూపాలు ప్రదర్శనలో చోటుచేసుకుని ఆకర్షణీయంగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎ.పి. శ్రీమతి రమాదేవి, శ్రీనివాస్ , కిరణ్ మరి యు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ.పి రమాదేవి మాట్లాడు తూ విద్యార్థులకు ఇటువంటి అవకాశాలు ప్రతి నిత్యం అందించడం శ్రీ కాకతీయ మెరిట్ స్కూల్ ప్రత్యేకత" అని అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయ వంతంగా ముగిసేందుకు విద్యా ర్థుల, పేరెంట్స్, మరియు అందరి సహా కారం మరువలేనిదని శ్రీ కాకతీయ మెరిట్ స్కూల్ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణ కిషోర్ వెల్లడించారు.

## వెంకటేశ్వర స్వామికి 1,00,116/- విరాళం



**కాళ్ళ ఆగస్టు 15 (ప్రభాత వార్త)** కాళ్ళకూరు స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మాదేపల్లి వాస్తవ్యులు విస్సరపు కొల్లెటి చెందిన కె.శే.ఉప్పల సీతారామయ్య-కృష్ణవేణి కుమారుడు వెంకట సాయి గురు సింహ నాగ భూషణం -లక్ష్మి సువర్ణల రూ.1,00,116/- విరాళం అందజేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి మోకా అరుణ కుమార్, పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పంచాయతీ అధికారికి అవార్డు

**అత్తిలి, ఆగస్టు 15 (ప్రభాతవార్త)** అత్తిలి గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి జి .భాస్కర్ కి ఎస్ డబ్ల్యు పి సి షెడ్ నిర్వహణ లో ఉత్తమ ప్రదర్శన చూపినందుకు పంచాయతీ రాజ్ అడిషనల్ కమిషనర్ ఏ .సుధాకర్ నుండి అవార్డు పొందారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి, కూటమి ప్రభుత్వ నాయకులు గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారిని సన్మానించారు.ఈ సందర్భంగా సిబ్బంది అందరి సహకారం వల్లనే తనకు ఈ అవార్డు వచ్చిన ట్లు జి .భాస్కర్ తెలిపారు.

## పెనుమంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు కారుణ్య ట్రస్ట్ విగ్రహాల బహూకరణ



**ఆచంట, ఆగస్టు-15, (ప్రభాతవార్త)** మండలంలోని పెనుమంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కారుణ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ అధినేత తుంగ నాగేశ్వరరావు పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించి పాఠశాలకు బహూకరించారు.అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను విద్యార్థులు స్మరించుకోవాలని అన్నారు. విగ్రహాల ఏర్పాటుతో విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందుతాయని పేర్కొన్నారు.పేదలు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## డిఎన్ఆర్ కళాశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**భీమవరం టౌన్, ఆగస్టు15 : ప్రభాతవార్త** దంతులూరి నారాయణరాజు కళాశాల క్రీడా ప్రాంగణం లో పాలకవర్గ అధ్యక్షులు గోకరా జు వెంకట నరసింహ రాజు అధ్యక్షతన అత్యంత వైభవంగా జరిగాయి. గోకరాజు వెంకట నరసింహ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి యస్.సి.సి కేడెట్లు, కళాశాల అసోసియేషన్ అనుబంధ సంస్థల విద్యా ర్థినీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరిం చారని కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ తెలి పారు.. డి.యన్.ఆర్ కళాశాల అసోసియే షన్ లో ఉన్న అన్ని విద్యాసంస్థల సిబ్బంది మరియు విద్యార్థులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహ రాజు మాట్లాడుతూ ఎందరో అమర వీరుల త్యాగఫలం తో భారత దేశానికి 1947 ఆగష్టు 15 వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. అటువంటి త్యాగ ధనుల కృషి వల్ల మనమంతా హాయి గా జీవించగల్గుతున్నామనీ, వారు కుల మతాలకతీతం గా తెల్లదొరలను తరిమికొట్టేందుకు పోరాడి స్వతంత్ర పోరాటంలో అసువులు బాసారన్నారు. ఆ మహా వీరుల జీవిత గాథలను ఆదర్శంగా తీసుకొని నేటి పౌరులు స్వాతంత్ర్య ఫలాలను కాపాడుకోవలసిన అవసరం ఉందని అన్నారు.కళాశాల పాలకవర్గ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ గాదిరాజు సత్యనారాయణరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారు తమ ప్రాణాలను సహితం ఫణంగా పెట్టారని వారు ఎప్పుడూ తమ ఉద్యమ భాటలో వెన్ను చూపకుండా ముందడుగు వేస్తూ సాతంత్ర్యాన్ని సాధించటం జరిగిందన్నారు.కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు , కళాశాల అసోసియేషన్ అనుబంధ విద్యా సంస్థల అధిపతులు, వైస్ ప్రిన్సిపాల్స్ , అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది యన్.సి.సి మరియు యన్.యస్.యస్ ఆఫీసర్లు, వాలంటీర్లు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో



**భీమవరం టౌన్, ఆగస్టు15 : ప్రభాతవార్త** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకుని భీమవరం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం, విశ్వబ్రాహ్మణ యువజన సంఘం ఆధ్వర్యంలో ఓవర్‌బ్రిడ్జి సమీపంలోని శ్రీ కామాక్షి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో జెండా వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు వందనం సమర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్య సముపార్జనకు కృషి చేసిన మహనీయులను స్మరించుకుని, దేశ సమైక్యత, సమగ్రత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీశైలపు నాగబాబు, ప్రధాన కార్యదర్శి కణితి భద్రం, కోశాధికారి కర్రి సుధాకర్తో పాటు గోరస రాంబాబు, దేవు ప్రసాద్, గొల్తి ప్రసాద్, పుట్టా పణీ, మందరపు వసంత్, లక్కోజు నాని, గొన్నాభత్తుల మల్లేశ్వరరావు, వింజరపు భాస్కరరావు, కుప్పిలి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన స్వేచ్ఛా సంబరం



**నరసాపురం ఆగస్టు 15 ప్రభాతవార్త** నరసాపురం పట్టణంలో వాడవాడలా పంద్రాగస్టు జెండా పండుగ ఎంతో వేడుకగా జరుపుకున్నారు. ఉదయాన్నే చినుకులు పడిన ఆ తర్వాత వాతావరణం కలిసి రావడంతో ప్రతి ఒక్కరు జెండా పండుగలో పాల్గొన్నారు. వందేమాతరం ఆలపించడంలో వందలాది గొంతులు కలిశారు. నరసాపురం కోర్టులో నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ పాలకవర్గం జెండా పండుగను ఎంతో సంబరంగా జరిపారు. అధ్యక్షులు నిడుమోలు జ్ఞానానంద్ జనరల్ సెక్రెటరీ కు రెల్ల సోమశేఖర్ ఉపాధ్యక్షులు జాన్ కెనడి జాయింట్ సెక్రెటరీ దొంగ సుభాష్ బాబు ఏపిపి ఎంసెట్ ఫణికర్ రంప పుల్లాజీ వనమాల శ్రీనివాస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. న్యాయమూర్తులు ఏ వాసంతి జి గంగరాజు వరలక్ష్మి తదితరులు మొక్కలు నాటారు. లేడీ రిప్రజెంటేటివ్ ప్రగతి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు. నరసాపురం సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రర్ ఎం జీవన్ బాబు జెండా ఎగురవేశారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దస్తావేజులేఖర్ల సంఘ అధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ కార్యదర్శి కోయ చింతారావు తదితరులు పాల్గొన్నారు.

## మదన గోపాల్ స్కూల్ లో జెండా పండుగ



**అత్తిలి,ఆగస్టు 15 (ప్రభాత వార్త )** బల్లిపాడు మదన గోపాల్ స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గాయకుడు తమ్మా సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెండా వందన కార్యక్రమనాంతరం జరిగిన ర్యాలీ లో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. చిన్నారుల చేసిన నృత్యాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ తిరుపతి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, పాఠశాల సొసైటీ అధ్యక్షుడు నీలం శివకృష్ణ, ఇన్ చార్జ్ ఆకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మార్టేరులో వ్య.ప స్థానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**పెనుమంట్ర, ఆగస్టు 15 (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంస్థ సహ పరిశోధనా సంచాలకులు డా. సి.హెచ్. శ్రీనివాస్ అధ్యక్షత శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుటేరు పరిశోధనా స్థానం వ్యవసాయ రంగానికి విశేష సేవలందిస్తోందన్నారు. ఇక్కడి నుంచి విడుదలైన పలు వరి రకాలు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయని తెలిపారు. పరిశోధనా స్థానం 100 సంవత్సరాలు, వ్యవసాయ పాలిటెక్నిక్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిబ్బంది, విద్యార్థులను అభినందించారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి పురస్కారాలు పొందిన సిబ్బందిని సన్మానించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి-ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం ఆగస్టు 15 (ప్రభాతవార్త)** స్వాతంత్రోద్యమ స్ఫూర్తితోప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన జెండా వందనం కార్యక్రమాల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎంతోమంది ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు.. ఝాన్సీ లక్ష్మీబాయి, ఛత్రపతి శివాజీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల చరిత్రను నేటి తరం తెలుసుకోవాలని చెప్పారు. మార్కులు, ర్యాంకులతో పాటు దేశం గురించి ఆలోచించే విధంగా యువతలో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించాలన్నారు. ప్రతి ఒక్కరూ భారతీయులమనే భావనతో ఉండాలని, కులమతాలకు అతీతంగా దేశ ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ బలమైన దేశంగా ఎదుగుతోందని,2047 స్వాతంత్ర శతాబ్ది ఉత్సవాల నాటికి భారత్ స్వర్ణయుగంలోకి వెళ్లేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాగా పనిచేసే సిబ్బందిని గుర్తించి అవార్డులతో సత్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాన్నారు. పనితీరును బట్టి ప్రోత్సాహకాలు, చర్యలు ఉంటే సిబ్బందిలో మరింత ఉత్సాహం పెరుగుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే మున్సిపల్ సిబ్బందికి తన తరపున రూ.10 వేల నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. నగదు బహుమతి కంటే వారి కృషికి లభించే గుర్తింపే ముఖ్యమని, మరింత అంకితభావంతో పనిచేసి తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబుతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు

## సామాజిక సేవకు గుర్తింపు.. నాగిడి రాంబాబుకు ఘన సత్కారం



**మొగల్తూరు, ఆగస్టు 15 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త, ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా నాగిడి రాంబాబు మెమొంటో, ప్రశంసా పత్రం అందుకున్నారు.సమాజంలో అవసరమైన వారికి అండగా నిలుస్తూ, వివిధ ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్న నాగిడి రాంబాబు సేవలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ప్రజా సేవే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్న ఆయనకు ఈ గుర్తింపు లభించడం పట్ల ముత్యాలపల్లి గ్రామస్థులు, స్నేహితులు, సేవా సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.